
గురువారం 26-1-2023


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 305

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



Lalithaa

లలితా జ్యువెల్లరి
మార్ట్ ప్రై. లిమిటెడ్



నగారా సమాచారం

దయచేసి పూర్తిగా చదవండి,
తప్పకుండా డబ్బు ఆదా చేస్తారు !

కళ్లారా చూస్తున్నది నిజం కాదు, వినేవన్నీ వాస్తవాలు కావు.. ఏ విషయాన్నైనా లోతుగా విచారిస్తేనే నిజం తెలుస్తుందనే మాటను అసలు మరవకండి. ఎందుకంటే, నగల షోరూంల వారి మాటలు, ప్రకటనలు తీయగా, చెవికి ఇంపుగా ఉంటాయి. కానీ, ధరల్లో నిజాలు, వాస్తవాలు ఉన్నాయా అని తెలుసుకోవడమే ముఖ్యం!

లలితా జ్యువెల్లరి మాదిరిగా ఏ ఇతర నగల షోరూంలు నగల పరిశ్రమలో ఉన్న ఇలాంటి రహస్యాలను, ధరల వివరాలను చర్చించడం లేదు. ధరలు పోల్చి చూసేందుకు, నగ ఫొటో మరియు ఎస్టిమేట్ స్లిప్‌ను ఇవ్వడం లేదు. వాళ్లు ఎందుకలా చేయడం లేదనే కారణాన్ని మీ ఊహకే వదిలేస్తున్నానండి. మావద్ద మాత్రమే నగలు కొనాలని చెప్పడంలేదు, ఎక్కడ ధర తక్కువగా ఉందో అక్కడ కొనమని చెబుతున్నా.

ఎందుకు ఆఫర్లను నమ్మకూడదు?

ముందుగా ఓ విషయాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. ఏ నగల షోరూం వాళ్లు కూడా, ఏ వస్తువును మీకు ఉచితంగా ఇవ్వరు. సొంత డబ్బుతో వస్తువులు కొని మీకు ఉచితంగా ఇస్తారా ఏంటి? మీ డబ్బులతోనే మీకు ఉచిత వస్తువులను ఇస్తారు.

గ్రాముకు రూ.50, 100, 200 తగ్గింపు! బంగారం కొంటే వెండి ఉచితం!
ఇలా చెప్పే నగల షోరూంలు.. నగల తరుగును 4 నుంచి 8% లేదా 10% పెంచి, ఆ తర్వాత మీకు ఇలాంటి ఆఫర్లను ఇస్తున్నారని అర్థం చేసుకోండి.

ఉచిత గిఫ్ట్!
తరుగును పలు రెట్లు పెంచి, మీ వద్ద డబ్బు తీసుకునే ఆ ఉచిత గిఫ్ట్‌లను ఇస్తున్నారు! అది కూడా నాలుగు రెట్లు ధరలు పెంచి!

తరుగులో 20%, 50% తగ్గింపు!
ముందుగా ఎందుకు తరుగును పెంచాలి, ఆ తర్వాత తగ్గింపు పేరుతో ఎందుకు తగ్గించి ఇవ్వాలి?

బోర్డ్ రేటును తగ్గించడం!
బోర్డ్‌లో గోల్డ్ రేటును తగ్గించినట్లు తగ్గించి.. తరుగును పెంచేయడం! ఇది కూడా ఓ ట్రిక్!

పాత నగకు, గ్రాముకు రూ.50, రూ.100, అధికంగా ఇవ్వడం!
ఎవరూ నష్టానికి వ్యాపారం చేయరు. ఆఖరు ధరను మీరే పోల్చి చూడండి!

నగల పథకంలో ఉచితంగా కుక్కర్.. మిక్సీ.. సాధారణ వాటర్‌బాటిల్ & గ్లాసు..
వంటి వస్తువుల వల్ల మీరు పక్కదారి పట్టకండి. పథకం ఆఖరులో ఎంత బంగారం లభిస్తుందోనని లలితా జ్యువెల్లరిలో పథకంతో క్షుణ్ణంగా లెక్కగట్టండి.

అది, భేరమాడినప్పుడు ధరలు తగ్గించే షోరూంమా?

అయితే, రెండు రెట్లు జాగ్రత్తగా ఉండండి!

తరుగును, ధరలను పెంచి, మిమ్మల్ని ఎందుకు భేరమాడేలా చేయాలి? భేరమాడిన తర్వాత ధరలు తగ్గిస్తే, మీరు ఏదో రాయితి, తగ్గింపు ఇచ్చినట్లు భావించకండి! నిజం ఏంటంటే, మీకు తెలియకుండానే మీరు మోసపోతున్నారు.

రాళ్లు పొదిగిన నగలు కొంటున్నారా?

రాళ్లు పొదిగిన నగలు కొనేటప్పుడు మీరు ముఖ్యంగా గమనించాల్సిన విషయాలు.. రాళ్ల బరువు, బంగారం బరువు విడివిడిగా చేసి, వాటి ధరను వివరంగా లెక్కగట్టారా అని సరిచూడాలి.

- బంగారం బరువు గ్రాముల్లో లెక్కగట్టి, ధరను నిర్ణయిస్తారు. (ఉదాహరణకు : రూ.5000/ గ్రాము)
- రాళ్ల బరువు, క్యారెట్‌లో లెక్కగట్టి, ధర నిర్ణయిస్తారు. రకాన్ని బట్టి, ఒక్కో రాయి, ఒక్కో ధరలో ఉంటుంది. (ఉదాహరణకు: అమెరికన్ డైమండ్ రాళ్ల ధర రూ.125 / క్యారెట్)
- 5 క్యారెట్ = 1 గ్రాము
- ఇందులో రాళ్ల బరువు, బంగారం బరువు విడివిడిగా లెక్కగట్టి, గ్రాముకు రూ.625 (5 x రూ.125)కు బదులుగా, గ్రాముకు రూ.5000 ఇవ్వకండి! (ఉదాహరణకు)
- ఒక గ్రాముకు ఇంత నష్టం ఏర్పడితే, పలు గ్రాముల బరువున్న రాళ్ల నగ కొనేటప్పుడు, ఎంత జాగ్రత్తగా ఉండాలో కాస్త ఆలోచించండి.
- అలాగే, రాళ్ల రకాన్ని బట్టి, క్యారెట్ ధర.. కరెక్టుగా ఉందా అని సరిచూసుకోండి.
- కుందన్ & యాంటిక్ నగలలో పెద్ద, బరువు ఎక్కువగా ఉన్న రాళ్లు కలిగినవి. టెంపుల్ & బ్లాక్‌బీడ్స్ నగల్లో పూసల బరువు ఎక్కువగా ఉంటుంది. కాస్త పక్కదారి పట్టినా.. రాళ్లు, పూసల ధరకు ఏకంగా బంగారం ధర చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.. జాగ్రత్త.. చాలా జాగ్రత్త!!

వజ్రాభరణాలు కొనేటప్పుడు మీరు ఎలా మోసపోతారో తెలుసా?

బంగారు నగల కన్నా వజ్రాభరణాలు పలు రెట్లు ధర ఎక్కువ అని మీకు బాగా తెలుసు. అందుకే, వజ్రాభరణాలు కొనేటప్పుడు మరింత జాగ్రత్తగా కొనాలి. కాస్త పక్కదారి పట్టినా, పెద్దమొత్తంలో నష్టం వాటిల్లుతుంది.

- వజ్రం బరువు నగలో ప్రస్తావిస్తారు. కానీ దాన్ని ప్రస్తావించినది ఎవరు, అది సరైన బరువులో ఉందా అన్నదే పెద్ద ప్రశ్న!
- మీరు వారంతట వారే ఇన్‌హౌస్ సర్టిఫికెట్ ఇచ్చే షోరూంలో వజ్రాభరణం కొంటున్నారని అనుకుందాం. 1 క్యారెట్ ధర రూ.65000 అనుకుందాం. 3 క్యారెట్లు అని నగలో ప్రస్తావించి ఉంది... కానీ, వాస్తవానికి అందులో కేవలం 2 క్యారెట్లు మాత్రమే ఉంటే...??! మీరు కోల్పోతున్న డబ్బు రూ.65,000. (క్యారెట్‌కు రూ.10,000 తగ్గింపు ఇచ్చినా... మీరు కోల్పోతున్న డబ్బు రూ.35,000.)
- షోరూంవాళ్లు సొంతంగా తయారు చేసే 'ఇన్‌హౌస్' సర్టిఫికెట్‌ను నమ్మకండి. గుర్తింపు పొందిన మూడోవ్యక్తి (సంస్థ) ఇచ్చే నాణ్యత సర్టిఫికెట్ కావాలని అడగండి. మీరు కొనే వజ్రాభరణాలకు E-F కలర్‌గ్రేడ్ మరియు VVS క్లారిటి ఉన్నాయా అని సరిచూసుకోండి. తక్కువ ధరకు లభిస్తున్నాయనే కారణం వల్ల G-H కలర్‌గ్రేడ్ వంటి నాణ్యత తక్కువైన ఆభరణాలను కొనకూడదు.

ఏ నగల షోరూం మీ నమ్మకాన్ని పొందుతుందో, ఏ షోరూం అన్ని నగల వివరాలను దాపరికం లేకుండా ప్రజలకు తెలియజేస్తుందో, ఆ నగల షోరూంలో కొనండి.

www.lalithaajewellery.com

Customer Care
90 99 999 916
BIS 916 హాల్‌మార్క్
లక్షలాది డిజైన్లు!



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 305

గురువారం 26-1-2023


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | BANGALORE | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సోనోవిజన్ రిపబ్లిక్ డే డిస్కౌంట్ సేల్

రిపబ్లిక్‌డే డిస్కౌంట్ సేల్‌లో వడ్డీగాని, DBD గాని లేకుండా లభించే ఫైనాన్స్ లాభదాయకంగా ఉంది. ముఖ్యంగా మొబైల్స్, ల్యాప్‌టాప్స్ ముందెన్నడూ లేనంత ఎక్కువ డిస్కౌంట్‌తో లభించడం ఈ సంవత్సరం ప్రత్యేకత. అంతే కాకుండా 10% వరకు లభించే క్యాష్‌బ్యాక్ మరియు మార్కెట్‌లో అందరికన్న తక్కువ ధరలలో సోనోవిజన్ రిపబ్లిక్ డే సేల్ కోసం అందరూ ఎదురుచూస్తున్నారు.



గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలతో...
సోనోవిజన్ రిపబ్లిక్ డే సేల్
26TH JANUARY 2023
LG Life's Good
INTRODUCING THE ALL-NEW RANGE OF
LG REFRIGERATORS
STUNNINGLY STYLISH
GC-X257CQES
InstaView - Door-In-Door™
AI ThinQ
Hygiene Fresh+™
Door Cooling+™
UVnano™
Smart Diagnosis™
Non-Plumbing Water & Ice Dispenser
Automatic Ice Maker
Smart Pocket Handle
Spaceplus™ Ice System
Express Freezing
Multi Digital Sensor
Inverter Linear Compressor
Capacity: 674 Litres
GL-T502APZY
Door Cooling+™
Convertible
Smart Diagnosis™
2-Star Rating
Smart Inverter Compressor™
Capacity: 471 Litres
Also available in 437 Litres
DoorCooling+™ Convertible
GL-T422VESX
AI ThinQ
Door Cooling+™
Hygiene Fresh
Convertible
3-Star Rating
Smart Inverter Compressor™
Capacity: 423 Litres
Also available in 408, 360 and 340 Litres
DoorCooling+™
AI ThinQ | DoorCooling+™ | UVnano™
EXCLUSIVEOFFERS
5 YEARS COMPREHENSIVE ASSURANCE
STARTING @ ₹2* PER DAY FOR ADDITIONAL 3 YEARS
CASHBACK UP TO 20%*
(On Select Side-by-Side Refrigerator Models)
Mini Bar Refrigerator
(GL-M051RSWC)
*Free Mini Bar Refrigerator with Select Side-by-Side Refrigerator Models.
AI ThinQ | HYGIENE FRESH | DoorCooling+™
Go Easy Intelligent! with AI Direct Drive™
AI DD™
Steam+
Inverter DirectDrive
6 MOTION DD
TurboWash
FHP1410Z7P
• AI Direct Drive™
• Steam+
• 6 Motion DD
• TurboWash™
• LG ThinQ™
• 10-Year Warranty
• RPM: Max. 1400
• Colour: Platinum/Shiny Rose Gold
FHV1409Z4M
• AI Direct Drive™
• Steam™
• 6 Motion DD
• LG ThinQ™
• 10-Year Warranty
• RPM: Max. 1400
EXCLUSIVE OFFERS*
5 YEARS COMPREHENSIVE ASSURANCE
STARTING @ ₹2* PER DAY FOR ADDITIONAL 3 YEARS
25%* CASH BACK
2999/-* Fiexed EMI
3999/-* Fiexed EMI
1* EMI OFF
10/0* EMI
T&C apply
Care & Delight LG Service
LG 24 x 7 CUSTOMER CARE
08069379999
1800 315 9999 (Toll Free)
www.lg.com/in/support
LG WhatsApp No. 9711709999
LG Service India Mobile App Available at Google Play
www.facebook.com/lgindiapage/
www.twitter.com/LGIndia
To know more about LG, visit www.lg.com/in
For Corporate/Institutional enquiries, please write to corp.enquiries@lge.com
Regd. Office: LG Electronics India Pvt. Ltd., A-24/6, Mohan Cooperative Industrial Estate, Mathura Road, New Delhi-110044
CIN No. U32107DL1997PTC220109
LG Greencycle
Partner Banks ICICI Bank State Bank of India citibank FEDERAL BANK one card kotak standard chartered
గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలతో...
సోనోవిజన్ రిపబ్లిక్ డే సేల్
26TH JANUARY 2023



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 305

గురువారం 26-1-2023

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి
గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



డాక్యుమెంటరీ కలకలం

ఢిల్లీలోని జామియా వర్సిటీలో బీబీసీ డాక్యుమెంటరీని ప్రదర్శించేందుకు ఓ విద్యార్థి సంఘం సిద్ధమవ్వడం కలకలం రేపింది.

వివరాలు 6లో ▸



ఈజిప్టుతో బంధం బలోపేతం

రక్షణ, వర్తక రంగాలతో పాటు ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో సహకరించుకోవాలని భారత్, ఈజిప్టు నిర్ణయించాయి.

వివరాలు 6లో ▸



ఆశిష్ మిశ్రాకు బెయిల్

రైతులతో పాటు 8 మందిని బలిగొన్న కేసులో కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాకు సుప్రీంకోర్టు బెయిలిచ్చింది.

వివరాలు 6లో ▸



ప్రాంతీయ భాషల్లో తీర్పులు

ఈ గణతంత్ర దినోత్సవం నుంచి 22 భాషల్లో తీర్పులను అందుబాటులో ఉంచుతామని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ఆనాడు షరతులతోనే జగన్ పాదయాత్ర



వైఎస్ జగన్ 'ప్రజా సంకల్ప యాత్ర'కు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పోలీసు శాఖ షరతులతోనే అనుమతిచ్చింది. వాటిని పాటిస్తూ ఆద్యంతం క్రమశిక్షణతో జగన్ పాదయాత్ర సాగింది. ఇప్పుడు లోకేశ్‌కు అవే షరతులతో అనుమతిచ్చినా టీడీపీ, ఎల్లో మీడియా రాద్ధాంతం చేస్తున్నాయి.

వివరాలు 2 ▸

మళ్లీ అధ్యయనం కుదరదు



పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంపై మళ్లీ అధ్యయనం చేయడం కుదరదని.. అది ముగిసిన అధ్యాయమని ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలకు కేంద్ర జల సంఘం తేల్చిచెప్పింది. బ్యాక్ వాటర్ వల్ల ముంపు ఉండదని స్పష్టం చేసింది.

వివరాలు 5 ▸



పశు సంచార అంబులెన్స్‌లను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో మంత్రి అప్పలరాజు, వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి

పశు వైద్యానికీ పటిష్ట వ్యవస్థ

పశు సంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖలపై సమీక్షలో సీఎం జగన్

- ఆర్బీకేల్లో ఉన్న పశు సంవర్థక విభాగం బలోపేతం
- నాడు – నేడు కింద మౌలిక సదుపాయాల కల్పన
- ప్రతి పశువుకూ హెల్త్ కార్డు.. పూర్తిస్థాయిలో వ్యాక్సినేషన్
- పశువుల అంబులెన్స్‌ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ
- అమూల్ భాగస్వామ్యంతో పాడి రైతులకు శిక్షణ
- చిత్తూరు డెయిరీ పునరుద్ధరణకు ఏర్పాట్లు
- 'సహకార' తరహాలో ఆక్వాలోనూ ప్రాసెసింగ్ యూనిట్లు
- ఆక్వా ఉత్పత్తుల కొనుగోళ్లలో మధ్యవర్తులకు తావివ్వద్దు
- నిర్దేశిత గడువులోగా ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తి

సాక్షి, అమరావతి: 'నాణ్యమైన, మెరుగైన పశు వైద్య సేవలు అందించేందుకు సమర్థవంతంగా పనిచేసే పటిష్టమైన అంచెల విధానాన్ని తీసుకురావాలి. రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో పని చేసేలా హేతుబద్ధమైన వ్యవస్థ ఉండాలి. తగిన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలి. యూనిఫార్మిటీ తీసుకురావడం ద్వారా నాణ్యమైన సేవలు అందుబాటులోకి తీసుకు రావచ్చు. ఇందుకోసం తగిన

మిగతా 2వ పేజీలో ▶

మూగ జీవాలకు కొండంత భరోసా

- రూ.111.62 కోట్లతో మరో 165 పశు సంచార అంబులెన్స్‌లు
- జెండా ఊపి ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్


2లో

చినజీయర్‌స్వామికి పద్మభూషణ్

- ఆరుగురికి పద్మవిభూషణ్, 9 మందికి పద్మభూషణ్, 91 మందికి పద్మశ్రీ
- ములాయం, జాకీర్ హుస్సేన్, ఎస్ఎం కృష్ణకు పద్మవిభూషణ్
- సుధామూర్తి, కుమారమంగళం బిర్లా, వాణీ జయరాంకు పద్మభూషణ్
- ఎం.ఎం.కీరవాణి, బి.రామకృష్ణారెడ్డి, సంకురాత్రి చంద్రశేఖర్‌కు పద్మశ్రీ

తెలుగు నేలపై విరిసిన పద్మాలు

- వివరాలు 6, 10లో


చినజీయర్‌స్వామి


ములాయం


వాణీ జయరాం


ఎం.ఎం కీరవాణి

చర్చలకు చక్కని వేదిక



మన దేశం సాధించిన సర్వతోముఖాభివృద్ధి, పౌరుల సృజనాత్మక ఆవిష్కరణల ఫలితంగా నేడు ప్రపంచ దేశాలు భారత్‌కు సమున్నత గౌరవం ఇస్తున్నాయి. కీలక అంశాలపై చర్చకు, వాటి పరిష్కారానికి జీ20 సదస్సు సరైన వేదిక.

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

6లో


అతుల్‌సింగ్


వెంకటరావు

ఇద్దరికి రాష్ట్రపతి పోలీస్ విశిష్ట సేవా పతకాలు

- అదనపు డీజీ అతుల్‌సింగ్, రిజర్వ్ ఎస్ఐ వెంకటరావుల ఎంపిక
- 15 మందికి పోలీస్ ప్రతిభ పతకాలు

- వివరాలు 3లో

క్లుప్తంగా...

సీఎం జగన్‌ను కలిసిన 'సిరివెన్నెల' కుటుంబ సభ్యులు

తమ కుటుంబాన్ని ఆదుకున్నందుకు కృతజ్ఞతలు



సీఎం జగన్‌తో సిరివెన్నెల కుటుంబ సభ్యులు

సాక్షి,అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దిగ్గజ సినీ గేయ రచయిత, పద్మశ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి సతీమణి పద్మావతి, కుమారులు యోగేశ్వరశర్మ, రాజా, కుమార్తె శ్రీలలితాదేవి, సిరివెన్నెల సోదరుడు సీఎస్ శాస్త్రిలు మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఎం జగన్‌ను కలిసి సిరివెన్నెల అనారోగ్య సమయంలో చికిత్స ఖర్చులను ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకోవడం, తమ కుటుంబానికి విశాఖలో ఇంటి స్థలం మంజూరు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌తో సిరివెన్నెలకు ఉన్న అనుబంధాన్ని సీఎంతో పంచుకున్నారు. సిరివెన్నెల కుటుంబానికి అవసరమైన సాయం చేసేందుకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని సీఎం జగన్ మరోమారు భరోసానిచ్చారు.

గణతంత్ర 'వెలుగులు'

విద్యుత్ దీపాలతో ప్రకాశిస్తున్న సీఎం క్యాంప్ కార్యాలయం, అసెంబ్లీ



విద్యుత్ దీపాలంకరణతో సీఎం క్యాంప్ కార్యాలయం

సాక్షి, అమరావతి: 74వ గణతంత్ర దిన వేడుకలకు ఏపీ సచివాలయం, శాసన సభ, శాసన మండలి భవనాలు ముస్తాబయ్యాయి. శాసన సభ భవనంతో పాటు రాష్ట్ర సచివాలయంలోని ఐదు బ్లాక్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మరోవైపు గణతంత్ర వేడుకల సందర్భంగా తాడేపల్లిలోని సీఎం వైఎస్ జగన్ క్యాంప్ కార్యాలయం విద్యుత్ కాంతులతో వెలుగులు విరజిమ్ముతోంది. ప్రజలను ఈ దృశ్యాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

- ముస్తాబైన ఇందిరా గాంధీ స్టేడియం
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న గవర్నర్
- హాజరు కానున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి /సాక్షి ప్రతినిధి, విజయవాడ: గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ గురువారం ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తారు. ఈ వేడుకల్లో సీఎం వైఎస్ జగన్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు. కాగా, స్టేడియంలో ఏర్పాట్లను గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా బుధవారం పరిశీలించారు. సాయంత్రం 4.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇచ్చే హైటీ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు.

పద్మ అవార్డులు లభించిన తెలుగు ప్రముఖులకు సీఎం జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి ప్రతిష్టాత్మకమైన పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులకు ఎంపికైన తెలుగు ప్రముఖులకు సీఎం వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు. వారికి లభించిన గుర్తింపు చాలా గర్వించదగినదని కొనియాడారు.

హైకోర్టు న్యాయమూర్తులుగా రేపు ప్రమాణం చేయనున్న జ్యోతిర్మయి, గోపాలకృష్ణారావు





సాక్షి, అమరావతి: హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా ప్రతాప వెంకటజ్యోతిర్మయి, వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు శుక్రవారం ప్రమాణం చేయనున్నారు. హైకోర్టు మొదటి కోర్టు హాలులో వీరితో ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ప్రమాణం చేయించనున్నారు. అనంతరం వీరు సీనియర్ న్యాయమూర్తులతో కలిసి కేసులు విచారిస్తారు. వీరి నియామకంతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 32కి చేరింది. మరో ఐదుపోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులను న్యాయవాదుల కోటా నుంచి త్వరలో భర్తీచేసే అవకాశం ఉంది. జ్యోతిర్మయి, గోపాలకృష్ణారావుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే.

షరతులతోనే జగన్ పాదయాత్ర

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, పోలీసుల షరతులు పక్కాగా పాటింపు ● పాదయాత్ర శాంతియుత నిర్వహణకు పూర్తి బాధ్యత వహించిన వైఎస్సార్‌సీపీ

- ఆద్యంతం క్రమశిక్షణ, పక్కా ప్రణాళికతో సాగిన ప్రజా సంకల్ప యాత్ర
- ప్రస్తుతం లోకేశ్ పాదయాత్రకు అవే షరతులతో పోలీసుల అనుమతి
- అయినా సరే వక్రీకరిస్తూ టీడీపీ, ఈనాడు రాజకీయ రాద్ధాంతం
- లోకేశ్ పాదయాత్రకు హైప్ సృష్టించేందుకే ప్రభుత్వంపై దుష్ప్రచారం
- ప్రజల నుంచి స్పందన లేకపోవడం తోనే కుట్ర రాజకీయాలు



వైఎస్ జగన్ పాదయాత్రకు అనుమతి కోరుతూ ఆయన పీఎస్ పి.కృష్ణమోహన్‌రెడ్డి 2017లో అప్పటి డీజీపీకి సమర్పించిన దరఖాస్తు



పోలీసుల షరతులు, సుప్రీంకోర్టు తీర్పులోని షరతులతో పాదయాత్రకు పోలీసులు ఇచ్చిన అనుమతి పత్రం



వైఎస్ జగన్ పాదయాత్రకు విశాఖపట్నం పోలీసులు విధించిన షరతులు, మైక్ వినియోగానికి జారీ చేసిన అనుమతి పత్రం

సాక్షి, అమరావతి: చట్టం దృష్టిలో అందరూ సమానమే అన్నది రాజ్యాంగం స్పష్టం చేస్తున్న అంశం. కానీ చట్టానికి తాము అతీతమన్నట్టుగా ప్రధాన ప్రతిపక్షం టీడీపీ వ్యవహరిస్తోంది. అందుకు 'ఈనాడు', ఇతర ఎల్లో మీడియా వత్తాసు పలుకుతూ వక్రీకరణలతో ప్రజల్ని మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నాయి. చంద్రబాబు, ఈనాడు రామోజీరావుకు మధ్య పరస్పర వ్యాపార, రాజకీయ సంబంధాలు ఉండొచ్చు. అందుకోసం చంద్రబాబును అర్జంటుగా సీఎంను చేసేయాలని రామోజీరావు ఆరాటపడుతూ ఉండొచ్చు. లోకేశ్‌కు లేని ప్రజాదరణను ఉన్నట్టుగా చూపించేందుకు నానా తంటాలు పడొచ్చు. కానీ చట్టానికి వాటితో ఏం పని? చట్టం తన పని తాను చేసుకుపోతుంది. అలా కాకుండా చట్టం తమ చుట్టం అని చంద్రబాబు, ఈనాడు రామోజీరావు భావిస్తూ రాజకీయ రాద్ధాంతం చేస్తుండటం విస్మయ పరుస్తోంది. అందుకే తాజాగా టీడీపీ నేత నారా లోకేశ్ పాదయాత్రకు ప్రభుత్వం ఆంక్షలు విధిస్తోందంటూ కట్టుకథలతో కనికట్టు చేసేందుకు ఈనాడు తనకు అలవాటైన రీతిలో దిగజారుడు పాత్రికేయానికి పాల్పడుతోంది. లోకేశ్ పాదయాత్రకు నిబంధనల మేరకు పోలీసు శాఖ అనుమతిచ్చింది. అయినా సరే 'యువ గళానికి ఆంక్షల సంకెళ్లు' అంటూ ఈనాడు పత్రిక బుధవారం ఓ కథనాన్ని ప్రచురించడం ఎల్లో మీడియా దుష్ప్రచారానికి తాజా నిదర్శనం. పాదయాత్ర సజావుగా సాగేందుకు పోలీసులు చట్టంలో ఉన్న అతి సామాన్యమైన షరతులతో కూడిన అనుమతి మంజూరు చేశారు. ఆ షరతులు ఇప్పటికిప్పుడు కొత్తగా పెట్టినవి కావు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అమలవుతున్న భారత పోలీసు చట్టంలో పేర్కొన్నవే అవి. 2009లో సుప్రీంకోర్టు తన తీర్పులో కూడా స్పష్టం చేసిన షరతులనే ప్రస్తుతం పోలీసులు తమ అనుమతి పత్రంలో పేర్కొన్నారు.

నాడు పోలీసులు నిర్దేశించిన, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం షరతులు ఇలా..

- వైఎస్సార్‌సీపీ స్థానిక నేతలు పాదయాత్ర రూట్‌మ్యాప్‌ను జిల్లా ఎస్పీలు/ నగర పోలీసు కమిషనర్లు, సంబంధిత ప్రాంతంలోని పోలీసు అధికారులకు ముందుగా తెలియజేయాలి.
- పాదయాత్రలోకానీ, పాదయాత్ర సందర్భంగా నిర్వహించే సభల్లో కానీ.. వచ్చే ప్రజలను నియంత్రించాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీదే. అంటే పాదయాత్ర నిర్వాహకులదే. వలంటీర్లను ఏర్పాటు చేసుకుని ప్రజలను నియంత్రించే బాధ్యత తీసుకోవాలి.
- పాదయాత్ర శాంతియుతంగా నిర్వహిస్తామని నిర్వాహకులు లిఖిత పూర్వకంగా తెలియజేయాలి.
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగించకూడదు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగితే, అల్లర్లు చెలరేగితే ఆ చర్యల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న వారితో పాటు ఆ పాదయాత్ర నిర్వాహకులు కూడా బాధ్యత వహించాలి. వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. సాధారణంగా ఇటువంటి సందర్భాల్లో ప్రత్యక్షంగా పాల్గొనే కార్యకర్తలపై కేసులు పెడతారు. కానీ పార్టీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, నిర్వాహకులు తెరవెనుక ఉండిపోతారు. ఆ విధంగా కాకుండా వారిపై కూడా పోలీసులు తగిన కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలి. పాదయాత్రను శాంతియుతంగా నిర్వహిస్తామని... అందుకు విరుద్ధంగా ఏదైనా విధ్వంసం జరిగితే తాము బాధ్యత వహిస్తామని నిర్వాహకులు ముందే లిఖిత పూర్వకంగా తెలియజేయాలి.
- పాదయాత్ర కొనసాగే పరిధిలోని పోలీస్‌స్టేషన్ హౌస్ అధికారి ప్రత్యేకంగా ప్రైవేట్ వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేసుకుని మరీ పాదయాత్ర/సభను వీడియో తీయించాలి. ఏదైనా విధ్వంసం జరిగితే సంబంధిత వీడియో క్లిప్పింగులను ఆధారాలుగా పరిగణిస్తూ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ స్టేట్‌మెంట్ రికార్డు చేయాలి. ఆ వీడియో సీడీని మెజిస్ట్రేట్ ఎదుట సమర్పించాలి.
- పాదయాత్రలో ఏదైనా విధ్వంసం సంభవిస్తే నిర్వాహకులు వెంటనే పోలీసు అధికారులను కలవాలి. పాదయాత్ర శాంతియుతంగా నిర్వహించేందుకు గాను రూట్‌మ్యాప్‌లో మార్పులు చేయాలి.
- ఎటువంటి ఆయుధాలను పాదయాత్రలో అనుమతించరు.
- పాదయాత్రలో ఏదైనా విధ్వంసంగానీ, దుస్సంఘటనగానీ జరిగితే పోలీసులు తగిన వీడియో ఆధారాలతో ప్రభుత్వానికి నివేదించాలి. వాటిని పరిశీలించిన అనంతరం ప్రభుత్వం తగిన నివేదికను రూపొందించాలి. అవసరమైతే వాటిని హైకోర్టుకుగానీ సుప్రీంకోర్టుకుగానీ సమర్పించాలి. ఎందుకంటే ఆ విధ్వంసం/ దుర్ఘటనపై సుమోటోగా హైకోర్టుగానీ సుప్రీంకోర్టుగానీ కేసు నమోదు చేయవచ్చు. అప్పుడు విచారణకు ప్రభుత్వం ఆ నివేదికను సమర్పించాలి.
- పాదయాత్రలో ఏదైనా విధ్వంసంగానీ దుర్ఘటనగానీ సంభవిస్తే న్యాయస్థానాలు సుమోటోగా కేసు నమోదు చేసి విచారిస్తాయి. బాధితులకు నిర్వాహకులతో నష్టపరిహారాన్ని ఇప్పిస్తాయి. అందుకోసం అవసరమైతే సిట్టింగ్/ రిటైర్డ్ న్యాయమూర్తితో క్లెయిమ్ కమిషన్‌ను న్యాయస్థానం ఏర్పాటు చేస్తుంది.
- పాదయాత్ర సందర్భంగా ఏదైనా విధ్వంసంగానీ దుర్ఘటనగానీ సంభవిస్తే మీడియా (ప్రధానంగా ఎలక్ట్రానిక్ మీడియా) బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. రాజ్యాంగం పత్రికా స్వేచ్ఛ కల్పించింది. కానీ సంచలనాలకు కాకుండా సంయమనానికి మీడియా అధిక ప్రాధాన్యమివ్వాలి. అందుకోసం మీడియా స్వీయ నియంత్రణ పాటించాలి. మీడియాను నియంత్రించడం అని కాదు గానీ ప్రెస్ కౌన్సిల్ మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించేలా పర్యవేక్షించాలి.

నాటి ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ ఇలా ప్రతీ జిల్లాలో పోలీసులు విధించిన షరతులను అనుసరిస్తూ పాదయాత్రను సాఫీగా నిర్వహించారు.

వైఎస్ జగన్ పాదయాత్రకు షరతులతోనే అనుమతి

67 మంది ఎమ్మెల్యేలు, 9 మంది ఎంపీలు ఉన్న వైఎస్సార్‌సీపీ అధినేత, ప్రధాన ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2017లో 'ప్రజా సంకల్ప యాత్ర'పేరుతో చేపట్టిన పాదయాత్రకు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పోలీసు శాఖ షరతులతోనే అనుమతి మంజూరు చేసింది. పాదయాత్రకు అనుమతి కోరుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫున ఆయన పీఎస్ పి.కృష్ణమోహన్‌రెడ్డి డీజీపీకి దరఖాస్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ప్రజాప్రతినిధులతో కూడిన బృందం అప్పటి డీజీపీ సాంబశివ రావును కలిసి పాదయాత్రకు అనుమతి కోరింది. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే డీజీపీ షరతులతో కూడిన అనుమతినిచ్చారు. పోలీసులు ఎన్నో షరతులు విధించడంతోపాటు సుప్రీంకోర్టు 2009లో ఇచ్చిన మార్గదర్శకాలు, షరతులను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. పాదయాత్ర సాగే జిల్లాల ఎస్పీలు, పోలీసు కమిషనర్లు ఆ షరతుల అమలును కచ్చితంగా పర్యవేక్షించాలని కూడా ఆయన ఆదేశించారు.

ఇప్పుడెందుకీ రాద్ధాంతం?

భారత పోలీసు చట్టం, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి అవే షరతులతో ప్రస్తుతం పోలీసు శాఖ నారా లోకేశ్ పాదయాత్రకు అనుమతిచ్చింది. గతంలో వైఎస్ జగన్ పాదయాత్రకు విధించిన షరతులనే ప్రస్తుతం పేర్కొంది. కొత్తగా ఎలాంటి షరతూ విధించ లేదు. పోలీసులకు రూట్‌మ్యాప్‌ను ముందుగా తెలపాలి.. రూట్‌మ్యాప్‌కు కట్టుబడి పాదయాత్ర సాగాలి.. నిర్ణీత ప్రదేశాల్లోనే సభలు నిర్వహించాలి.. ప్రభుత్వ,ప్రైవేటు ఆస్తులకు నష్టం కలిగించకూడదు.. ఎవరూ మారణాయుధాలు కలిగి ఉండకూడదు.. ఇలా ఎప్పటి నుంచో దేశంలో అమలులో ఉన్న సాధారణ షరతులనే పోలీసులు విధించారు. ఈ వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా తాము ఆనాడు తలచుకుని ఉంటే వైఎస్ జగన్ పాదయాత్ర చేయగలిగేవారా? అని టీడీపీ నేతలు ప్రశ్నిస్తుండటం హాస్యాస్పదం. ఇటీవల చంద్రబాబు పాల్గొన్న కందుకూరు, గుంటూరు సభల్లో తొక్కిసలాటలతో 11 మంది దుర్మరణం చెందారు. అందుకే పాదయాత్ర నిర్వాహకులు అత్యవసర వైద్య సేవల కోసం ప్రత్యేకంగా అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని.. అంబులెన్స్‌కు దారి ఇవ్వాలని సూచించారు. అందులో తప్పుబట్టడానికి ఏముంది? కేవలం నారా లోకేశ్ పాదయాత్రకు ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో సానుకూల స్పందన లభించడం లేదన్నదే చంద్రబాబు, ఈనాడు రామోజీరావు ఆందోళన. అందుకే పోలీసులు సాధారణ షరతులతో ఇచ్చిన అనుమతిని వక్రీకరిస్తూ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. తద్వారా లోకేశ్ పాదయాత్ర పట్ల లేని హైప్‌ను సృష్టించేందుకు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని స్పష్టమవుతోందనిపరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

షరతులకు కట్టుబడే.. చరిత్రాత్మక పాదయాత్ర

పోలీసు శాఖ విధించిన షరతులు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తునే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర పూర్తి చేశారు. తన 'ప్రజా సంకల్ప యాత్ర'ను 2017 నవంబరు 6న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో ప్రారంభించి 341 రోజులపాటు 3,648 కి.మీ. మేర పాదయాత్ర నిర్వహించి.. 2019 జనవరి 10న ఇచ్ఛాపురంలో ముగించారు. పాదయాత్ర రూట్‌మ్యాప్‌ను నిర్వాహకులు ముందుగానే సంబంధిత పోలీసు అధికారులకు అందజేశారు. సామాన్యులకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రూట్‌మ్యాప్ రూపొందించారు. సభలు నిర్వహించేందుకు తగినంత విశాలమైన ప్రదేశాలను నిర్వాహకులు ముందుగానే ఎంపిక చేసుకుని పోలీసులకు తెలిపారు. పోలీసులు ఆమోదించిన తర్వాతే ఆ ప్రదేశాల్లో సభలు నిర్వహించారు. ఎక్కడ కూడా ముందుగా నిర్ణయించిన ప్రదేశంలో కాదని మరోచోట సభ నిర్వహించ లేదు. అంత పకడ్బందీగా రూట్‌మ్యాప్ అనుసరించారు. మైక్‌లను ఉపయోగించేందుకు ముందుగానే పోలీసుల నుంచి అనుమతి తీసుకున్నారు. పాదయాత్రలో, పాదయాత్ర సందర్భంగా నిర్వహించిన సభలు సక్రమంగా నిర్వహించేందుకు పార్టీ వలంటీర్లను ముందే నియమించారు. అందుకే అంతటి సుదీర్ఘ పాదయాత్రలో ఎక్కడా సాధారణ జనజీవనానికి ఇబ్బందులుగానీ ట్రాఫిక్ సమస్యలుగానీ తలెత్తనే లేదు. ఎక్కడా తోపులాటలుగానీ తొక్కిసలాటలుగానీ సంభవించలేదు. ప్రజా సంకల్ప యాత్ర ఆద్యంతం సజావుగా, సక్రమంగా సాగింది.

పశు వైద్యానికీ పటిష్ట వ్యవస్థ

▶ మొదటి పేజీ తరువాయి

మార్గదర్శక ప్రణాళిక తయారు చేయాలి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పశు సంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖలపై బుధవారం ఆయన తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూగ జీవాలకు అందిస్తోన్న సేవల్లో దేశానికి మనం మార్గనిర్దేశంగా నిలిచామని, దాన్ని ఇదే రీతిన కొనసాగించాలన్నారు. మండల స్థాయిలో ఉన్న ఈ వ్యవస్థ నుంచి ఆర్బీకేల్లో ఉన్న పశు సంవర్థక సహాయకులకు పూర్తి స్థాయి మద్దతు, సహకారం ఉండేలా చూడాలని చెప్పారు. దీనివల్ల సంతృప్త స్థాయిలో పశువులకు తగిన వైద్య సేవలు అందించడానికి వీలవుతుందన్నారు. ఈ మేరకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌ఓపీ) తయారు చేయాలని ఆదేశించారు. ఈ వ్యవస్థ ఏర్పాటు విషయంలో ఏం చేయాలో నిర్దిష్టమైన విధానాన్ని నిర్దేశించుకున్న తర్వాత నాడు – నేడు కింద మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో సీఎం ఇంకా ఏమన్నారంటే..

> వైద్య ఆరోగ్య శాఖలో ఒక సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేశాం. అదే రీతిలో పశు సంవర్థక శాఖలో కూడా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అందుకు అనుగుణంగా గ్రామ స్థాయిలో పశు సంవర్థక విభాగాన్ని బలోపేతం చేయాలి. ఆర్బీకేల్లో పని చేస్తోన్న పశు సంవర్థక సహాయకుల సమర్థతను మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాలి. గ్రామ స్థాయిలో పనిచేసే ఒకరిద్దరు వలంటీర్లను ఈ సేవల్లో భాగస్వాములను చేయాలి.
>
> – సీఎం వైఎస్ జగన్

పర్యవేక్షణ కోసం హెల్త్ కార్డు

- ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ప్రతి పశువుకూ హెల్త్ కార్డు జారీ చేయాలి. వాటి ఆరోగ్య పరిస్థితి, పోషకుల వివరాలు ఆ కార్డులో పొందుపర్చాలి. ఈ కార్డుల జారీ వల్ల వాటికి అందుతున్న వైద్య సేవలపై పర్యవేక్షణ సులభతరం అవుతుంది.
- పశువులకు నూరు శాతం వ్యాక్సినేషన్‌పై దృష్టి సారించాలి. నెలవారీ లక్ష్యాలు నిర్దేశించుకుని పని చేయాలి. పశువులకు పంపిణీ చేసిన మందులను నిల్వ చేయడానికి ప్రతి ఆర్బీకేలో ఫ్రిజ్ సహా మౌలిక సదుపాయాలు సమకూర్చాలి.
- పశు సంవర్థక శాఖలో అన్ని రకాల సేవలకు ఒకే నంబర్ వినియోగించాలి. పశు పోషకుల వద్ద కాల్ సెంటర్ నెంబర్ ఉండాలి. పశువుల అంబులెన్స్‌ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. వీటి నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఎస్‌ఓపీ రూపొందించాలి. పశు సంవర్థక శాఖ ద్వారా అమలు చేసే సంక్షేమ పథకాలన్నీ వివక్ష లేకుండా అర్హులందరికీ అందేలా చూడాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అమలు చేసే దిశగా కృషి చేయాలి.

పాడి రైతుల జీవనోపాధిపై దృష్టి

- గడిచిన రెండేళ్లుగా అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్క చెల్లెమ్మలకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఏడాదికి రూ.18,750 చొప్పున ఇచ్చాం. ఈ డబ్బు వారి జీవనోపాధి మార్గాలను మెరుగు పరచడానికి, ఆ మార్గాలను బలోపేతం చేయడానికి ఉపయోగ పడుతుంది. ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న మహిళా పాడి రైతులకు జీవనోపాధి కల్పనపై దృష్టి సారించాలి.
- పశుపోషణ సహా ఇతర జీవనోపాధి మార్గాల కోసం అవసరమైన రుణాలు మంజూరు విషయంలో అధికారులు దృష్టి సారించాలి. పాలల్లో రసాయన మూలకాలు ఉన్న ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. అలాంటి పరిస్థితులు రాకుండా చూడాలి. పాల నాణ్యత పెరిగేలా శ్రద్ధ వహించాలి. రసాయనాలకు తావులేని పశు పోషణ విధానాలపై అవగాహన పెంచాలి. ఆ దిశగా పాడి రైతులకు గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన మిల్క్ సొసైటీల వద్ద అమూల్ భాగస్వామ్యంతో శిక్షణ ఇవ్వాలి. చిత్తూరు డెయిరీని సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించాలి. డెయిరీ పునరుద్ధరణకు రెండు మూడు వారాల్లో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేయాలి.

ఆర్బీకే స్థాయిలో ఆక్వా కొనుగోళ్లు

- ఆక్వా రైతులకు మేలు చేసేందుకే ఫీడ్, సీడ్ రేట్లపై నియంత్రణ కోసం చట్టాలను తీసుకొచ్చాం.
- వీటిని సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల పాత్ర ఎలా తీసేశామో అదే రీతిలో ఆక్వా ఉత్పత్తుల కొనుగోళ్లలో కూడా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చూడాలి. ఆర్బీకే స్థాయిలో ఆక్వా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఆ దిశగా ఆర్బీకే వ్యవస్థను బలోపేతం చేయాలి. అందుకనుగుణంగా యాక్షన్ ప్లాన్‌ను రూపొందించుకోవాలి. సహకార రంగంలో డెయిరీలు ఏర్పాటు చేస్తున్నట్టుగానే ఆక్వా రంగంలో కూడా సహకార పద్ధతిలోనే కొత్త ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుపై తగిన ఆలోచన చేయాలి. ఆక్వా సాగయ్యే ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహించాలి.
- ఫిషింగ్ హార్బర్ల పనులు వేగవంతం చేయాలి. నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు పూర్తయ్యేలా చూడాలి. అప్పుడే మత్స్య ఉత్పత్తుల ఎగుమతులు పెరుగుతాయి. మత్స్యకారుల ఆదాయం పెరుగుతుంది. రాష్ట్ర జీడీపీ పెరుగుతుంది. ప్రతి ఫిషింగ్ హార్బర్ నుంచి ఏటా కనీసం రూ.వెయ్యి కోట్లకు పైగా ఆర్థిక కార్యకలాపాలు కొనసాగుతాయి. ఇది పరోక్షంగా ఆర్థికాభివృద్ధికి దోహద పడుతుంది. ఉపాధి కోసం మన మత్స్యకారులు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఎంతమాత్రం ఉండదు.
- పశు సంవర్థక, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురాం, పశు సంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ వై.మధుసూదనరెడ్డి, పశు సంవర్థక శాఖ డైరెక్టర్ డాక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్, మత్స్య శాఖ కమిషనర్ కే.కన్నబాబు, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ ఎండీ అహ్మద్ బాబు పాల్గొన్నారు.

రెండో ఫేజ్ హార్బర్లకు పర్యావరణ అనుమతులు

- రెండవ ఫేజ్‌లో నిర్మించనున్న వాడరేవు, బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం, బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి అటవీ, పర్యావరణ సహా అన్ని రకాల అనుమతులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని అధికారులు సీఎంకు వివరించారు.
- మొదటి ఫేజ్‌లో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు 92.5 శాతం పూర్తయ్యాయని, ఫిబ్రవరి 15 నాటికి మిగిలిన పనులు పూర్తవుతాయని చెప్పారు. నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడల్లో కూడా పనులు వేగం పుంజుకున్నాయని తెలిపారు. ప్రతి 3 నెలలకొకటి చొప్పున డిసెంబర్‌కల్లా మొదటి ఫేజ్ ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. మొత్తం 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి రూ.3,520.57 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు.
- ఏపీలో పశువులకు వైద్య సేవలు అందిస్తున్న అంబులెన్స్ విధానంపై ఇతర రాష్ట్రాలు కూడా ఆసక్తి చూపాయని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. పంజాబ్, ఛత్తీస్‌గఢ్, కేరళకు చెందిన అధికారులు రాష్ట్రాన్ని సందర్శించి వెళ్లారని, ఆయా రాష్ట్రాల్లో ఏపీ మోడల్‌లోనే పశు అంబులెన్స్‌ల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నారని వివరించారు.
- ఆర్బీకే స్థాయిలో ఖాళీగా ఉన్న 4,765 పశు సంవర్థక సహాయకుల పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. జగనన్న పాల వెల్లువ కింద 2.6 లక్షల మంది రైతులు సభ్యులుగా చేరారని, వారి నుంచి ఇప్పటి వరకు 6.06 కోట్ల లీటర్ల పాలను సేకరించామన్నారు. వచ్చే 2 నెలల్లో మరో 1,422 గ్రామాలకు జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని విస్తరిస్తున్నామని తెలిపారు.

మూగ జీవాలకు కొండంత భరోసా



పశు సంచార అంబులెన్స్ లోపల విభాగాలను పరిశీలిస్తున్న సీఎం జగన్



పశు సంచార అంబులెన్స్ డ్రైవర్లకు నమస్కరిస్తున్న సీఎం జగన్

పాడి రైతు ముంగిట నాణ్యమైన పశు వైద్యం

- మారుమూల పల్లెల్లోనూ మెరుగైన సేవలు
- రూ.111.62 కోట్లతో మరో 165 పశు సంచార అంబులెన్స్‌లు
- జెండా ఊపి ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఇప్పటికే నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175..
- మొత్తంగా రూ.240.69 కోట్లతో 340 పశు అంబులెన్స్‌లు
- డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలు మరింత విస్తృతం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పశువుల ఆరోగ్య సంరక్షణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ కింద రెండో దశలో రూ.111.62 కోట్ల వ్యయంతో 165 పశు అంబులెన్స్ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ జెండా ఊపి ఈ అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనంలోకి వెళ్లి.. వాటి పనితీరు, సేవలను స్వయంగా పరిశీలించారు. అంబులెన్స్‌లో కల్పించిన సౌకర్యాలతో పాటు తొలి దశలో ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా అందించిన సేవలను పశు సంవర్థక శాఖ డైరెక్టర్ డాక్టర్ రెడ్నం అమరేంద్ర కుమార్ సీఎంకు వివరించారు. టోల్ ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ రాగానే వాహనం నేరుగా ఆ గ్రామానికి చేరుకొని రైతు ఇంటి ముంగిటే సేవలందిస్తుందని చెప్పారు. మెరుగైన వైద్యం అవసరమైతే సమీప పశు వైద్యశాలకు తరలించి వైద్య సేవలనంతరం పూర్తిగా కోలుకున్న తర్వాత తిరిగి ఉచితంగా అదే అంబులెన్స్‌లో రైతు ఇంటికి భద్రంగా చేరుస్తున్నారన్నారు. పంజాబ్, ఛత్తీస్‌గఢ్, కేరళ తదితర రాష్ట్రాల బృందాలు ఇప్పటికే ఏపీలో పర్యటించి, మన అంబులెన్స్‌లను, వీటి ద్వారా అందిస్తోన్న సేవలను పరిశీలించి వెళ్లారని.. ఆయా రాష్ట్రాల్లో మన మోడల్‌లోనే అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అంబులెన్స్‌లో కల్పించిన సౌకర్యాలు, అందిస్తోన్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం.. సకాలంలో వైద్యం అందని పరిస్థితి రాష్ట్రంలో ఉండకూడదని సూచించారు. మూగ జీవాలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు.

అందుబాటులో 340 అంబులెన్స్‌లు

తొలిదశలో రూ.129.07 కోట్లతో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 పశు అంబులెన్స్‌లు ఏర్పాటు చేయగా, తాజాగా రెండో దశలో మరో 165 పశు అంబులెన్స్‌లను ప్రభుత్వం రైతులకు అందుబాటులోకి తెచ్చింది. మొత్తంగా రూ.240.69 కోట్లతో 340 పశు అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. వీటి కోసం ప్రత్యేకంగా కాల్ సెంటర్ (1962)ను ఏర్పాటు చేసింది. ఈ కాల్ సెంటర్ 3.71 లక్షల కాల్స్‌ను అటెండ్ చేయగా, అంబులెన్స్‌లు 1,28,625 ట్రిప్‌లు తిరిగాయి. 1,81,791 పశువులు, సన్న జీవాలు, పెంపుడు జంతువులను ప్రాణాపాయం నుంచి రక్షించి 1,26,559 మంది పశు పోషకులకు లబ్ధి చేకూర్చాయి. బుధవారం నాటి కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీయస్ నాగిరెడ్డి, స్పెషల్ సీఎస్ వై.మధుసూదనరెడ్డి, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, ఎం.హనుమంతరావు, లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు ముస్తాఫా, మద్దాల గిరి, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వైద్య శాఖకు ఐదు జాతీయ స్థాయి అవార్డులు

- పేపర్ రహిత వైద్య సేవల్లో ఉత్తమ పనితీరుకు కేంద్ర పురస్కారాలు
- హెల్త్ ఐడీలకు ఆరోగ్య రికార్డుల అనుసంధానంలో రాష్ట్రానికి ప్రథమ స్థానం
- జిల్లాల విభాగంలోనూ తొలి మూడూ మన రాష్ట్రానికే
- ఏలూరు, విశాఖ, పల్నాడు జిల్లాలకు అవార్డులు
- ఇంటిగ్రేటెడ్ విధానంలోనూ రాష్ట్రానిదే అగ్రస్థానం

సాక్షి, అమరావతి: జాతీయ స్థాయిలో రాష్ట్ర వైద్య శాఖకు ఐదు అవార్డులు లభించాయి. రాష్ట్ర ప్రజలకు పేపర్ రహిత వైద్య సేవలు వేగంగా చేరువ చేస్తూ, ఉత్తమ పని తీరు కనబరుస్తున్నందుకు కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మూడు విభాగాల్లో ఈ అవార్డులను ప్రకటించింది. పేపర్ రహిత వైద్య సేవల్లో భాగంగా ప్రతి వ్యక్తికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌లు సృష్టిస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 5.4 కోట్ల మందికి హెల్త్ ఐడీలను ఇచ్చారు. ఇందులో 3.79 కోట్ల మంది హెల్త్ ఐడీలకు వారి ఆరోగ్య రికార్డులను అనుసంధానించారు. ఇలా డిజిటల్ హెల్త్ ఐడీలకు ఆరోగ్య రికార్డులను అనుసంధానించిన రాష్ట్రాల విభాగంలో ఏపీ ప్రథమ స్థానం పొందింది. జిల్లాల విభాగంలో దేశంలోనే తొలి మూడు అవార్డులూ వరుసగా ఏలూరు, విశాఖపట్నం, పల్నాడు జిల్లాలకొచ్చాయి. ఇంటిగ్రేటెడ్ విధానంలో హెల్త్ ఐడీలకు ఆరోగ్య రికార్డులు అనుసంధానించిన విభాగంలోనూ రాష్ట్రానికి మొదటి స్థానం లభించింది. గతేడాది అక్టోబర్ 20 నుంచి డిసెంబర్ 10 మధ్య కనబరిచిన ఉత్తమ ప్రతిభకు ఈ అవార్డులిచ్చారు. అంతకు ముందు రెండు నెలల్లో పనితీరుకు ప్రకటించిన అవార్డుల్లోనూ ఏపీకి జాతీయ స్థాయిలో ఆరు లభించాయి. ఈ లెక్కన నాలుగు నెలల్లో రాష్ట్ర వైద్య శాఖకు జాతీయ స్థాయిలో 11 అవార్డులు వచ్చాయి.

ప్రజల ప్రాథమిక ఆరోగ్య వివరాలు నిక్షిప్తం

వైఎస్ జగన్ సీఎం అయిన నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. పేపర్ రహిత వైద్య సేవల్లోనూ వేగంగా చర్యలు చేపడుతోంది. 2021 అక్టోబర్‌లో రాష్ట్ర వైద్య శాఖ నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్-కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ-సీడీ) 2.0ను ప్రారంభించింది. ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలకు డిజిటల్ హెల్త్ ఐడీలను సృష్టించడంతో పాటు, స్క్రీనింగ్ నిర్వహించి ప్రాథమిక ఆరోగ్య వివరాలను హెల్త్ ఐడీల్లో నిక్షిప్తం చేశారు. ఇలా ఇప్పటివరకు 5.4 కోట్ల మందికి హెల్త్ ఐడీలను సృష్టించారు. మరో వైపు 14,505 ప్రభుత్వాస్పత్రులు, 21,200 మంది వైద్యులు, ఇతర సిబ్బందిని ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో రిజిస్టర్ చేశారు. ఇది సంఖ్యాపరంగా, జనాభా శాతం పరంగా కూడా దేశంలోనే అత్యధికం.

సచివాలయాల ఉద్యోగులకు
'ఫెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్'

ప్రతి నెలా వారి పని తీరు మదింపు

- కేటగిరీ వారీగా జాబ్‌చార్ట్ ప్రకారం వేర్వేరుగా ఇండికేటర్స్
- ఒక్కొక్క ఉద్యోగికి నాలుగు గ్రేడ్‌లు
- సంతృప్తికరం, తృప్తికరం, పర్వాలేదు, అసంతృప్తికరం గా రేటింగ్
- అసంతృప్తికరం గ్రేడ్ పొందిన వారికి శిక్షణ ఇచ్చే అవకాశం
- ఆరు శాఖల ఉద్యోగులకు పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ రూపకల్పన



సాక్షి, అమరావతి : గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల్లో ప్రతి ఒక్కరి పని తీరు మదింపునకు ప్రభుత్వం కొత్తగా పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (ఉద్యోగి పనితీరు సూచికలు)ను రూపొందిస్తోంది. సచివాలయాల్లో మొత్తం 20 కేటగిరీల ఉద్యోగులు పని చేస్తున్నారు. ఒక్కొక్క కేటగిరీ ఉద్యోగి పనితీరు మదింపునకు వారి జాబ్‌చార్ట్‌ల ప్రకారం వేర్వేరు పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ఉంటాయి. ఈ ఇండికేటర్స్ ఆధారంగా మండల స్థాయి అధికారులు ప్రతి నెలా వారి పరిధిలోని సచివాలయాల ఉద్యోగుల పనితీరును అంచనా వేస్తారు. సంతృప్తికరం (గుడ్), తృప్తికరం (ఫెయిర్), పర్వాలేదు (శాటిస్ఫై), అసంతృప్తికరం (నాట్ శాటిస్ఫై)గా రేటింగ్ ఇస్తారు. వరుసగా కొన్ని నెలలు అసంతృప్తికరం రేటింగ్ పొందే ఉద్యోగులకు మెళకువలు పెంపొందించుకునేలా శిక్షణ ఇచ్చే అవకాశం ఉందని అధికారవర్గాలు వెల్లడించాయి.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల మేరకు పనితీరు అంచనా

వాస్తవానికి గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాల జాబ్ నోటిఫికేషన్‌లలోనే ఉద్యోగుల పని తీరు నిరంతర అంచనా అంశాన్ని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. జాబ్ చార్ట్‌లను కూడా ప్రకటించింది. అయితే, ప్రభుత్వం ఇటీవల ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఉద్దేశించిన కొన్ని సుస్థిర అభివృద్ధి సూచికలు (సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్)ను రూపొందించుకొని ఆ ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాల్సిన సచివాలయాల ఉద్యోగులకు కూడా ఈ సుస్థిర అభివృద్ధి సూచికల ప్రకారం పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌ను రూపొందిస్తోంది. వీటి రూపకల్పన బాధ్యతను ప్రభుత్వం ఆయా ఉద్యోగుల విధులకు సంబంధించిన శాఖలకే అప్పగించింది. ఇప్పటివరకు ఆరు శాఖలు పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌ను రూపొందించి, ఉత్తర్వులు కూడా జారీ చేశాయి. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్లకు పశు సంవర్ధక శాఖ, మహిళా పోలీసు ఉద్యోగులకు హోం శాఖ, ఏఎన్‌ఎంలకు వైద్య, ఆరోగ్య శాఖ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు సాంఘిక సంక్షేమ శాఖ, ఆరు కేటగిరీల ఉద్యోగులకు పట్టణాభివృద్ధి శాఖ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ రూపొందించాయి. పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మూడు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. వీరందరికీ వారి జాబ్ చార్ట్ ప్రకారం వంద మార్కులు ఉంటాయి. పని తీరు ఆధారంగా మార్కులు వేస్తారు. డిజిటల్ అసిస్టెంట్లకు ప్రత్యేకంగా రేటింగ్ ఇచ్చారు. 90కిపైగా మార్కులు తెచ్చుకొనే డిజిటల్ అసిస్టెంట్లకు ఎక్సలెంట్ రేటింగ్ ఇస్తారు. 75 – 90 మార్కులు వచ్చేవారికి గుడ్ రేటింగ్, 50 – 75 మధ్య మార్కులు వచ్చేవారికి ఫెయిర్, 50 మార్కులకు కన్నా తక్కువ తెచ్చుకునే వారికి పూర్ రేటింగ్ ఇస్తారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మిగిలిన శాఖలు కూడా త్వరలో ఇండికేటర్స్ రూపొందిస్తాయని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులు వెల్లడించారు.

విశాఖ రైల్వేస్టేషన్‌కు 'గ్రీన్' సర్టిఫికెట్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు అత్యధిక ప్లాటినం రేటింగ్‌తో కూడిన గ్రీన్ రైల్వేస్టేషన్ సర్టిఫికెట్ లభించింది. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్ ఈ సర్టిఫికెట్‌ను వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతికి మంగళవారం రాత్రి అందజేశారు. ఈ విషయాన్ని బుధవారం డీఆర్‌ఎం కార్యాలయం వెల్లడించింది. ఈ సర్టిఫికెట్ అందుకున్న రైల్వేస్టేషన్‌లలో విశాఖ ఒకటి. మొత్తం 100 పాయింట్లకు గానూ, విశాఖపట్నం రైల్వేస్టేషన్ 82 పాయింట్లతో ఈ ఘనతను సాధించింది. భారతీయ రైల్వే ఎన్విరాన్‌మెంట్ డైరెక్టరేట్ విభాగం ఐజీబీసీ సహకారంతో ఈ గ్రీన్ రైల్వేస్టేషన్ రేటింగ్ సిస్టంను అభివృద్ధి పరిచింది.

ఇద్దరు పోలీస్ అధికారులకు రాష్ట్రపతి పోలీస్ విశిష్ట సేవా పతకాలు

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ : అదనపు డీజీ అతుల్‌సింగ్, మంగళగిరిలోని ఆరో బెటాలియన్ రిజర్వ్ ఎస్‌ఐ ఎస్.వెంకటరావు ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి పోలీస్ విశిష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా 2023కు గాను కేంద్ర ప్రభుత్వం ఈ పతకాలను బుధవారం ప్రకటించింది. 1995 బ్యాచ్‌కు చెందిన అతుల్‌సింగ్ గతంలో విశాఖ ఎస్పీగా, గ్రేహౌండ్స్ ఎస్పీగా, రాష్ట్ర పోలీస్ నియామక మండలి చైర్మన్‌గా వివిధ హోదాల్లో పనిచేశారు. అనంతరం 2018లో కేంద్ర సర్వీసులకు వెళ్లి కేంద్ర విజిలెన్స్ కమిషన్‌లో బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర క్రీడల శాఖలో సంయుక్త కార్యదర్శిగా కూడా పని చేసి.. ఖేలో ఇండియా కార్యక్రమ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. 2022లో రాష్ట్ర సర్వీసులకు తిరిగొచ్చిన అతుల్‌సింగ్.. ప్రస్తుతం మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రొక్యూర్‌మెంట్-లాజిస్టిక్స్ విభాగం అదనపు డీజీగా ఉన్నారు. ఇక మంగళగిరిలోని ఆరో బెటాలియన్‌లో రిజర్వ్ ఎస్‌ఐగా ఉన్న ఎస్.వెంకటరావు 1983లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరి అంచెలంచెలుగా ఎస్‌ఐ స్థాయికి చేరుకున్నారు. 2013లో ఇండియన్ పోలీస్ మెడల్, 2021లో సేవా పతకాన్ని ఆయన స్వీకరించారు. ప్రస్తుతం రాష్ట్రపతి పోలీస్ పతకానికి ఎంపికయ్యారు. రాష్ట్రపతి పోలీస్ పతకాలను సాధించిన అదనపు డీజీ అతుల్‌సింగ్, రిజర్వ్ ఎస్‌ఐ ఎస్.వెంకటరావును పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

పోలీస్ ప్రతిభ పతకాలకు 15 మంది

అలాగే పోలీస్ ప్రతిభ పురస్కారాలకు ఎంపికైన వారిలో బల్లి రవిచంద్ర(ఎస్పీ, గుంటూరు), ఎర్రం శ్రీనివాస్‌రెడ్డి(సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్, డోన్), కోరంగి ప్రవీణ్‌కుమార్(డీఎస్పీ, విశాఖ), గొడ్డపాటి సత్యనారాయణ(ఏఎస్పీ, కాకినాడ), జె.శివనారాయణస్వామి(డీఎస్పీ, ఏసీబీ కర్నూల్), అంగడి సాధిక్‌అలీ(ఇన్‌స్పెక్టర్, మొలక చెరువు), ప్రత్తిపాటి సుకుమార్(రిజర్వ్ ఎస్‌ఐ, విజయవాడ), దారా సూరిబాబు(ఎస్‌ఐ, విశాఖ), గంగులయ్య పార్థసారథి(ఏఎస్‌ఐ, తిరుపతి), కడియాల సాంబశివరావు (ఏఎస్‌ఐ, చేబ్రోలు), ఎర్రం శ్రీనివాసరావు(ఏఎస్‌ఐ, పల్నాడు), తిరుమలరాజు సూర్యనారాయణరాజు(ఏఎస్‌ఐ, భోగాపురం), నీలగిరి వరప్రసాద్(ఎస్‌ఐ,స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్, విజయవాడ), కొలసాని వెంకటరామారావు(డిప్యూటీ అసాల్ట్ కమాండర్, గ్రే హౌండ్స్), దబ్బకూటి సూర్యనారాయణ(రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, విజయవాడ) ఉన్నారు.

పాలనా వికేంద్రీకరణకే ప్రజా మద్దతు

850వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: వికేంద్రీకరణ ఉద్యమానికి మద్దతు రావడం, అమరావతి ఉద్యమం అటకెక్కడంతో చంద్రబాబు కుయుక్తులు పన్నుతున్నాడని బహుజన పరిరక్షణ సమితి నేతలు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో 850వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో బుధవారం పలువురు మాట్లాడారు. మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, సుభాషిణి, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.



నున్నితమైన చేయి ఏనుగును కూడా ఒక్క వెంట్రుకతోనడిపించగలదు.
నీ శత్రువుకు సామ్యతతో ప్రత్యుత్తరం ఇవ్వు.
– జరాతుష్ట్ర

సాక్షి
గురువారం, జనవరి, 26

ఎడతెగని ఉన్మాదం

ఎక్కడో ఒకచోట చాలా తరచుగా ఉన్మాదుల తుపాకులు పేలుతూనే ఉన్నా నిమ్మకు నీరెత్తినట్టు మనుగడ సాగిస్తున్న అమెరికాలో మరోసారి ఏడుగురు అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం మధ్యాహ్నం జరిగిన రెండు ఉదంతాల్లో వీరు మరణించగా ఆదివారం ఉన్మాది కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన 22 ఏళ్ల తెలుగు విద్యార్థి దేవాశిష్ ఆ మరునాడు కన్నుమూశాడు. నూతన సంవత్సరం ప్రారంభమైన ఈ మూడు వారాల్లో ఇంతవరకూ మొత్తం ఆరు ఉదంతాలు జరగ్గా దుండగుల తుపాకులకు 39 మంది బలయ్యారంటే సమస్య ఎంత తీవ్రంగా ఉన్నదో అర్థమవుతుంది. ప్రపంచ జనాభాలో అమెరికా వాటా అయిదు శాతం. కానీ ప్రపంచంలో ప్రైవేటు వ్యక్తుల దగ్గరుండే తుపాకుల్లో సగభాగం ఆ దేశంలోనే ఉంటాయి. అంతేకాదు...ఏటా ఉన్మాదులు తుపాకులతో రెచ్చిపోతున్న ఘటనల్లో మూడోవంతు అమెరికాలోనే చోటుచేసుకుంటాయి. కాల్పుల ఘటనల్లో మరణిస్తున్నవారినీ, తుపాకులతో కాల్చుకుని ప్రాణాలు తీసుకునేవారినీ కలుపుకుంటే ఏటా 40,620 మంది ఈ మారణాయుధాల కారణంగా చనిపోతున్నారని నిరుడు ఒక నివేదిక తెలిపింది. అంటే రోజూ సగటున 110మంది తుపాకులకు బలైపోతున్నారు. తుపాకుల సంస్కృతిని అరికట్టడం తక్షణావసరమని గ్రహించడానికి ఈ గణాంకాలు చాలవా? కానీ ప్రభుత్వ విధానాలనూ, రాజకీయాలనూ తుపాకులే శాసిస్తున్నచోట ఈ విజ్ఞతను ఆశించటం దురాశే అవుతుంది. నిరుడు వరసగా వర్జీనియా, కొలరాడో, ఇల్లినాయ్, ఓక్లహమా, టెక్సాస్, న్యూయార్క్ తదితరచోట్ల విచ్చలవిడి కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నప్పుడు మూడు దశాబ్దాల్లో తొలిసారి తుపాకుల కొనుగోలుపై పరిమిత స్థాయి సంస్కరణలు తీసుకురావాలని సెనేట్‌లో ఒప్పందం కుదిరింది. దానిపై చర్చ సాగుతుండగానే న్యూయార్క్ తుపాకుల చట్టాన్ని కొట్టేస్తూ ఆత్మరక్షణ కోసం తుపాకులు కలిగి ఉండటం ప్రాథమిక హక్కని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.

తుపాకులుండరాదని మెజారిటీ ప్రజానీకం భావించేచోట అవి నానాటికీ తామరతంపరగా పెరుగుతూ పోవటం ఒక వైచిత్రి. తుపాకి ఉండటం తమ హోదాకూ, గౌరవానికీ చిహ్నమని, ఆత్మరక్షణకు తప్పనిసరని భావించేలా చేయటంలో అక్కడి తుపాకి పరిశ్రమలు విజయం సాధించాయి. ఎక్కడో ఒకచోట తుపాకి పేలినప్పుడల్లా జనంలో ఆగ్రహావేశాలు రగలటం, తుపాకుల అమ్మకంపై నియంత్రణ విధించాలని కోరటం షరా మామూలే. కానీ ఆ వెంటనే తుపాకి లాబీ రంగప్రవేశం చేసి ఈ చర్చనంతటినీ తలకిందులు చేస్తోంది. మానసిక రోగులవల్ల తలెత్తుతున్న సమస్యను తుపాకుల అమ్మకానికి ముడిపెడుతున్నారని వక్రభాష్యాలకు దిగుతోంది. ఆ తర్వాత అంతా సద్దుమణుగుతోంది. తుపాకుల అమ్మకాలు మాత్రం యథావిధిగా కొనసాగుతున్నాయి. అమెరికాలో పౌరుల వద్ద మొత్తం 39 కోట్ల తుపాకులు చలామణీలో ఉన్నాయని... ప్రతి వంద మంది పౌరుల దగ్గరా సగటున కనీసం 120 తుపాకులు ఉండొచ్చని స్విట్జర్లాండ్‌కు చెందిన పరిశోధనా సంస్థ లెక్కగట్టింది. ఇది 2018 నాటి మాట. అమెరికాలో ఏ రాష్ట్రంలోనూ తుపాకుల అమ్మకానికి సంబంధించిన డేటా బేస్ లేదు. పైగా పకడ్బందీ చట్టాలు కొరవడి బ్లాక్ మార్కెట్ జోరుగా సాగుతుంటుంది. కరోనా మహమ్మారి విజృంభిస్తున్నకాలంలో ప్రతి అయిదు కుటుంబాల్లోనూ ఒక కుటుంబం తుపాకి కొనుగోలు చేసిందని మరో సంస్థ తేల్చింది. ఇదంతా చూస్తే ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తుల దగ్గరుండే తుపాకుల సంఖ్య ఎన్ని కోట్లు దాటివుంటుందో ఊహకందదు. హార్వర్డ్, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీలు 2016లో తేల్చిన లెక్క ఆసక్తికరమైంది. అమెరికాలో అమ్ముడైన తుపాకుల్లో సగభాగం కేవలం 3 శాతంమంది దగ్గర కేంద్రీకృతమయ్యాయని ఆ పరిశోధన సారాంశం.

తుపాకుల విచ్చలవిడి అమ్మకానికీ, వాటి ద్వారా జరిగే హింసకూ మధ్య అవినాభావ సంబంధం ఉంటుందని చెప్పడానికి పెద్ద పరిశోధన అక్కరలేదు. కానీ అలా పరిశోధించి చెప్పే నివేదికలకు కూడా అక్కడి తుపాకి లాబీ పెద్ద ప్రాధాన్యం ఇవ్వదు. వాటికి పోటీగా నివేదికలు విడుదల చేసి పౌరులను అయోమయంలోకి నెట్టే యత్నం చేస్తుంది. కాల్పులు జరిగినచోట 'మంచి వ్యక్తి' గనుక తుపాకితో ఉంటే ఇన్ని ప్రాణాలు పోయేవికాదని ఆ నివేదికలు చెబుతుంటాయి. విచ్చలవిడి కాల్పుల ఉదంతాల నిరోధానికి పౌరుల దగ్గర మరిన్ని తుపాకులుండటమే పరిష్కారమని తుపాకుల తయారీ పరిశ్రమలకు చెందిన జాతీయ రైఫిల్ అసోసియేషన్(ఎన్ఆర్ఏ) సంస్థ చెప్పిందంటే దాని తెలివి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

బ్రిటన్, స్వీడన్, జర్మనీ, బెల్జియంలలో తుపాలకు అమ్మకంపై గట్టి నియంత్రణలున్నాయి. కెనడాలో 2020 కాల్పుల ఉదంతం తర్వాత రెండు వారాల్లోనే ఆయుధ ధారణపై కఠిన ఆంక్షలు విధిస్తూ చట్టం తీసుకొచ్చారు. న్యూజిలాండ్‌లో 51మందిని కాల్చిచంపిన క్రైస్ట్ చర్చ్ నగరం ఉదంతం తర్వాత పౌరుల దగ్గరున్న తుపాకులను ప్రభుత్వం కొని ధ్వంసం చేసేలా చట్టం తెచ్చారు. ఆస్ట్రేలియాలో 1996నాటి కాల్పుల ఘటన తర్వాత పౌరులనుంచి 6,50,000 తుపాకులు సేకరించి ధ్వంసం చేశారు. ఆ దేశాల్లో ఇలాంటి చట్టాలు తెచ్చాక హింస గణనీయంగా తగ్గింది. అయినా ఎన్ఆర్ఏ తన తర్కం వీడదు. ఫలితంగా తరచు దుండగుల తుపాకులకు పదులకొద్దీమంది నేలకొరుగుతున్నారు. అనేకులు గాయాలపాలై వికలాంగులవుతున్నారు. అక్కడ చదువుల కోసం, కొలువుల కోసం వెళ్తున్న మన పౌరులు అనేక మంది ఈ మారణహోమంలో సమిధలవుతున్నారు. అమెరికన్ సమాజం కళ్లు తెరడానికి మరెన్ని బలిదానాలు జరగాలో?!

సకల శక్తుల సాధన సబ్‌ప్లాన్



మల్లెపల్లి లక్ష్మయ్య

2013లో 'ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం' రూపొందడం వెనుక చారిత్రక నేపథ్యం, రాజ్యాంగ రక్షణ, ఉద్యమ సందర్భాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా.. సబ్‌ప్లాన్ అవసరం, దాని అమలు తీరుతెన్నులపై అసెంబ్లీలో మొదట గళం విప్పింది వైఎస్సార్ అనే వాస్తవాన్ని విస్మరించడానికి లేదు. 2001లో ప్రతిపక్ష నాయకులైన వైఎస్సార్ సబ్ ప్లాన్ గురించి ప్రస్తావించడం వల్లనే ఆ అంశం రాజకీయ ఎజెండాలోకి చేరి, చివరికి చట్టం రూపం దాల్చింది. ఇప్పుడీ చట్టం కాలపరిమితి ముగిసే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని; దాన్ని మరో ఇరవై ఎళ్ళు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్డినెన్స్ జారీకి చొరవ చూపడం ముదావహం. దళితుల, ఆదివాసుల అభివృద్ధికి... ఈ చట్టం పొడిగింపు ఉపకరిస్తుంది.

''ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టానికి 2023 జనవరి 23తో పదేళ్ళ కాలపరిమితి ముగియనున్నందున, ఆ చట్టం లక్ష్యాలు ఇంకా నెరవేరాల్సి ఉన్నందున, ఆ చట్టాన్ని మరో ఇరవై సంవత్సరాలు పొడిగిస్తున్నాం'' అంటూ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జనవరి 22న ఒక ఆర్డినెన్స్ జారీ చేశారు. శాసన సభ, శాసనమండలి సమావేశాలు ఆ సమయానికి జరగటం లేనందువల్ల ఈ ఆర్డినెన్స్ అవసరమైందని కూడా ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు. మరికొన్ని అవసరమైన మార్పులను సైతం ఇందులో పేర్కొన్నారు. వీటితో పాటు, చట్టం పేరును ఆంధ్ర ప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం' అనడానికి బదులుగా 'ఆంధ్ర ప్రదేశ్ ఎస్సీ కాంపోనెంట్, ఎస్టీ కాంపోనెంట్ చట్టం'గా మార్చారు. గతంలో ఉన్న విధంగా బడ్జెట్‌లో ప్లాన్, నాన్ ప్లాన్ లేనందువల్ల ఎస్సీ, ఎస్టీలకు కేటాయిస్తున్న భాగాన్ని సబ్‌ప్లాన్‌కు బదులుగా కాంపోనెంట్‌గా పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం కాలపరిమితి ముగిసే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని, దళిత సంఘాల, సంస్థల అభ్యర్థనలను కూడా పరిగణనలోనికి తీసుకొని చట్టం కాలపరిమితిని మరో ఇరవై సంవత్సరాలు పొడిగించాలని నిర్ణయించినందుకు ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి అభినందనీయులు. ఈ చట్టం పట్ల, అదే విధంగా రాజ్యాంగం పట్ల ఆయన తన గౌరవాన్ని ఆచరణాత్మకంగా వ్యక్తం చేయడం ప్రశంసనీయం. ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం– 2013' రూపొందడం వెనుక చారిత్రక నేపథ్యం, రాజ్యాంగ రక్షణ, ఉద్యమ సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వపరంగా ఎటువంటి నిర్ణయాలు జరగాలన్నా, ప్రగతిశీల చట్టాలు అమలులోకి రావాలన్నా ప్రజల కోర్కెలు, ఉద్యమాలతో పాటు, రాజకీయ పార్టీల, సంస్థల అంగీకారం, రాజ్యాంగపరమైన ఆమోదం తప్పనిసరి. అలాంటి అన్ని రకాల మద్దతులను కూడగట్టిన చట్టాలలో సబ్‌ప్లాన్ చట్టం ఒకటి.

మొట్టమొదటి నుంచి ఇప్పటి వరకు సబ్‌ప్లాన్ ఉద్యమంతో, చట్టం రూపకల్పనతో పాటు, దాని అమలు విషయంలో భాగమున్న వారిలో నేనూ ఒకరిని. సబ్‌ప్లాన్ అమలు కోసం జరిగిన యత్నాలలో భాగంగా సబ్‌ప్లాన్ నిధుల దారి మళ్ళింపు, అమలులో లోపాలపై నేను రాసిన వార్తాకథనం 2001 మార్చి 29న ఒక దినపత్రికలో అచ్చయింది. అప్పుడు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఆ వార్తాకథనాన్ని ఆనాటి ప్రధాన ప్రతిపక్ష నాయకులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అసెంబ్లీలో స్వయంగా పేపర్‌ని చూపించి మరీ ప్రభుత్వాన్ని నిలదీసిన సందర్భాన్ని చరిత్ర మరువదు. శాసనసభలో ఆనాడు వైఎస్ ప్రస్తావించడంతో అది రాజకీయ ఎజెండాలోకి చేరింది. సబ్‌ప్లాన్ అవసరం, దాని అమలు తీరుతెన్నులపై మొదట గళం విప్పింది వైఎస్ఆర్ అనే వాస్తవాన్ని ఎన్నటికీ విస్మరించడానికి లేదు. 2004లో వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే 'సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్' ఆధ్వర్యంలో వైఎస్ఆర్‌ని కలిసి సమర్థంగా సబ్‌ప్లాన్ అమలుచేయాలని అభ్యర్థించాం.

కొత్త కోణం



ఒకవైపు ప్రభుత్వంతో ఈ విషయమై సంప్రదిస్తూనే, రెండోవైపు సబ్‌ప్లాన్ విషయంలో చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఆ క్రమంలోనే 2007లో సీపీఎం నాయకత్వంలోని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సబ్‌ప్లాన్ అమలు కోసం అప్పటి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి. రాఘవులు నేతృత్వంలో అక్టోబర్‌లో నిరాహార దీక్షలు జరిగాయి. ఆ సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ స్పందించి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు కోసం నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేయడానికి అంగీకరించారు. ఆ తర్వాత నోడల్ ఏజెన్సీతో పాటు సబ్ ప్లాన్ చట్టం కోసం విశాలమైన ఉద్యమం జరిగింది. దాదాపు 150కి పైగా సంఘాలతో ఏర్పాటైన ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో 2012 మార్చిలో 72 గంటల దీక్ష జరిగింది. ఇందులో కేవీపీఎస్, డీబీఎఫ్, సీడీఎస్, ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ ఫోరం, దళిత, ఆదివాసీ, సంఘాలతో పాటు సీపీఎం, సీపీఐ, టీఆర్ఎస్, బీజేపీ, వైఎస్ఆర్‌సీపీ, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీలు తమ మద్దతును తెలియజేశాయి. వీటన్నింటితో పాటు, అధికార కాంగ్రెస్ పార్టీలోని ఎస్సీ, ఎస్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఉద్యమానికి మద్దతు తెలిపారు. దీనితో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 2012 డిసెంబర్ 2న చట్టం అసెంబ్లీ ఆమోదం పొందింది. గెజిట్‌లో జనవరి 23 నుంచి అమలులోకి వచ్చింది. ఈ ఉద్యమ ప్రస్థానంలో చాలా మంది వ్యక్తులతో పాటు సంస్థలూ పాల్గొన్నాయి. ఆ వివరాలన్నీ ఇక్కడ ప్రస్తావించడం సాధ్యం కాదు. అయితే చట్టం ఏర్పడిన నేపథ్యం అర్థం కావడానికే ఈ ప్రాథమిక విషయాల ప్రస్తావన.

సబ్‌ప్లాన్ అనే ఒక అంశం రూపొందడానికి చారిత్రక నేపథ్యం ఉంది. ఈరోజు షెడ్యూల్డ్ కులాలుగా పిలువబడుతున్న అంటరాని కులాల సామాజిక, విద్య అభివృద్ధి కోసం ప్రత్యేక పాఠశాలలు, పథకాలు ఉండాలని మొదట మాట్లాడిన సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే. బ్రిటిష్ ప్రభుత్వం 1882లో ఏర్పాటు చేసిన హంటర్ కమిషన్‌కు ఆయన ఇచ్చిన విజ్ఞాపనలో అంటరాని కులాలైన మహర్, మాంగ్, మాతంగ్‌లకు ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. భారతదేశంలో ఇది మొట్టమొదటి ఆలోచన. ఆ తర్వాత సాహూ మహరాజ్, శాయాజీరావు గైక్వాడ్‌లు రిజర్వేషన్‌లు మొదలు పెట్టారు. అనంతర కాలంలో భారతదేశ చిత్రపటం మీదకి వచ్చిన బాబాసాహెబ్ అంబేడ్కర్ 1927లో బొంబాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్న సమయంలో కౌన్సిల్‌లో మాట్లాడుతూ, అణగారిన వర్గాలైన అంటరాని కులాల పిల్లల విద్యాభివృద్ధికి ప్రత్యేక హాస్టల్స్ నిర్మించాలని ప్రతిపాదించారు. నేటి మన రెసిడెన్షియల్ పాఠశాలల వ్యవస్థకు అదే పునాది. అలాగే 1932 సెప్టెంబర్ 24న గాంధీ–అంబేడ్కర్‌ల మధ్య కుదిరిన పూనా ఒడంబడికలోని 9వ అంశంలో అంటరాని కులాల విద్యార్థుల విద్య కోసం ప్రతి రాష్ట్రం, కేంద్రం కళాశాల నిధులను కేటాయించాలని ఉంది. ఇది ఒక రకంగా మొట్టమొదటి బడ్జెట్ ప్రస్తావన. 1944లో బాబాసాహెబ్ అంబేడ్కర్ బ్రిటిష్ ఇండియా ప్రభుత్వంలో మంత్రిగా ఉంటూ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, విదేశీ విద్య ప్రోత్సాహం, ఉద్యోగాల రిజర్వే షన్లు సాధించారు. వీటన్నింటి అనుభవాలను దృష్టిలో పెట్టుకొని 1950 జనవరి 26వ తేదీన అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 46ను చేర్చి ప్రభుత్వాలు షెడ్యూల్డ్ కులాల, తెగల అభివృద్ధి కోసం సత్వరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అయితే ప్రప్రథమ ప్రధాని నెహ్రూ కాలంలో ఇటువైపు అడుగులు పడలేదు. 1970 తర్వాత అప్పటి ప్రధాని ఆనాటి రాజకీయ, ఉద్యమ ప్రభావా లతో 1974 ఎస్టీ సబ్‌ప్లాన్‌ను, 1980లో ఎస్సీ కాంపోనెంట్ ప్లాన్‌ను ప్రారంభించారు. 2006లో ఎస్సీ కాంపోనెంట్ ప్లాన్‌ను ఎస్సీ సబ్ ప్లాన్‌గా మార్చారు.

అయితే ఈ పథకాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. 2001లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో వైఎస్.రాజశేఖర్ రెడ్డి లేవనెత్తేంత వరకు దీని గురించిన అవగాహన ఎవ్వరికీ లేదనడంలో సందేహం అక్కర్లేదు. 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చట్టం ఏర్పడిన తర్వాత కర్ణాటకలో, ఉత్తరాఖండ్, రాజస్థాన్‌లలో ఇటువంటి చట్టాలు అమలులోకి వచ్చాయి. పంజాబ్ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. ఈ క్రమంలో.. ఈ ఏడాదితో కాల పరిమితి తీరిన 'ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని మరో ఇరవై ఏళ్లు పొడిగిస్తూ ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆర్డినెన్స్‌కు చొరవ చూపారు. దళితుల, ఆదివాసుల అభివృద్ధికి... ప్రత్యేకించి నివాస, మౌలిక సదుపాయాల, విద్యావకాశాల మెరుగు కోసం, ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలను చేపట్టడం ద్వారా వారు ప్రగతి సాధించడానికి ఈ చట్టం పొడిగింపు ఉపకరిస్తుంది. ఈ ఉన్నత లక్ష్యసాధనలో మరిన్ని ముందడుగులు పడాలని ఆశిద్దాం.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్: 81063 22077

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బ్రిటన్‌కు చెడ్డపేరు



ఒక భారతీయ జర్నలిస్టు బీబీసీలో ఆరేళ్లు పని చేశారు. తర్వాత అక్కడ మానేసి, ప్రస్తుతం బాల్టిమోర్‌లో ఉంటున్నారు. బీబీసీని విడిచి పెట్టడానికి కారణమేంటని నేను ఆయన్ని అడిగినప్పుడు భారత్‌ను చెడుగా చూపించే కథనాలను రాయాలని తనపై వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేకపోయానని చెప్పారు.

– స్వామీ ముకుందానంద్, గ్లోబల్ గురు

మరో ఉత్పాతమా?



తదుపరి మహమ్మారిని ఎదుర్కోవడానికి సిద్ధం కావాలని బిల్ గేట్స్ ఆస్ట్రేలియాను హెచ్చరించారు. అది మనిషి సృష్టేనట.

– లిజ్ చర్చిల్, కాన్‌స్పిరసీ థియరిస్టు

అదే నిజమైతే..



అదానీ స్టాక్ మార్కెట్ మాయోపాయాల కార్పొరేట్ కుంభకోణాన్ని హిండెన్‌బర్గ్ నివేదిక బహిర్గతం చేసింది. అదానీని, హిండెన్‌బర్గ్‌ని నిందించకండి. అసలు దోషులు ఆర్బీఐ, ఎఫ్.ఎం, సెబి.

– ముంజునాథ్ హెచ్‌కె, ట్వీటిజెన్

అసమాన దర్శకత్వం



ఆస్కార్ 'ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరీలో భారత్, పాక్‌ల అధికారిక ఎంట్రీలు.. 'చెల్లో షో, 'జాయ్‌ల్యాండ్' తాజా రౌండ్ వడపోతలో నామినేషన్‌కు నోచుకోలేదు! అయితేనేం, ఈ రెండు చిత్రాల దర్శకులు పాన్ నళిన్, సైమ్ సాధిక్ అసమానమైన ప్రతిభను కనబరిచారు. రెండు టీమ్‌లకు నా అభినందనలు.

– అసీమ్ ఛబ్రా, మూవీ క్రిటిక్

వాళ్ల పనేనా?




పది వేల మందికి పైగా ఉద్యో గులను తీసివేసిన కొద్ది రోజుల్లోనే బుధవారం నాడు మైక్రోసాఫ్ట్ విభాగాలైన ఎక్స్‌బాక్స్ లైవ్, టీమ్స్, ఔట్‌లుక్, మైన్‌క్రాఫ్ట్, స్పెక్ట్రమ్ సేవల్లో తీవ్ర అంతరాయం సంభవించింది. అయినప్పటికీ.. తొలగించిన సిబ్బందిని ట్విట్టర్ తిరిగి తీసుకున్నట్టు... మైక్రోసాఫ్ట్ చేయదనే అనుకుంటున్నా.

– దీపక్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

వ్యవస్థకు రక్షణ రాజ్యాంగమే!

ఇవ్వాళ భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు. మన రాజ్యాంగం అతి దీర్ఘమైన రాజ్యాంగంగా పేరు పొందింది. దీని రచనను పూర్తి చేయడానికి 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజులు పట్టింది. రాజ్యాంగం భారతదేశ అత్యున్నత చట్టం. ఈ పత్రం ప్రాథమిక రాజకీయ నియమావళి, ప్రభుత్వ వ్యవస్థ నిర్మాణం, విధానాలు, అధికారాలు, ప్రభుత్వ సంస్థల విధులను గుర్తించేలా నిర్దేశించింది. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, పౌరుల విధులనూ నిర్దేశించింది.

రాజ్యాంగమే భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించేది. అదే ప్రభుత్వం, పౌరుల మధ్య... నమ్మకం, సమన్వయాన్ని సృష్టిస్తుంది. రాజ్యాంగాన్ని తెలుసుకోవడం భారత పౌరుని ప్రాథమిక విధుల్లో ఒకటి. అప్పుడే సార్వభౌమ గణతంత్ర సభ్యునిగా, భారతదేశంలోని ప్రతి పౌరుడూ ప్రతిరోజూ వినియోగించుకోవలసిన రాజ్యాంగ హక్కులను పొందుతాడు. ప్రతి పౌరుడి అభివృద్ధి అతని హక్కులు, విధులపై అతనికి ఉన్న అవగాహనపైనే ఆధారపడి ఉంటుంది.



ఏ దేశ రాజ్యాంగం అయినా దేశ ప్రగతి కోసం మంచి పాలన, ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వాన్ని ఇవ్వాలి. మన రాజ్యాంగం ప్రకారం జరిగిన ఈ 72 సంవత్సరాల పాలనా కాలంలో దేశం ఎంతో ప్రగతి సాధించింది. స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో మనం 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాం. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం విషయంలో 5వ ర్యాంకులో ఉన్నాం. తయారీ రంగంలో 30వ ర్యాంకులో ఉన్నాం. ఇక వివిధ ఆహార ధాన్యాల, తృణధాన్యాల ఉత్పత్తిలో మనం మొదటి 5 స్థానాన్ని ఆక్రమించాం.

కానీ దురదృష్టవశాత్తు ఇప్పటికీ మనం 20 శాతం పేదరికంలోనే ఉన్నాం. 12 శాతం నిరుద్యోగిత రాజ్యమేలుతోంది. విపరీతమైన ఆదాయ అసమానతలూ ఉన్నాయి. వివిధ ప్రపంచ సూచికలలో మనం ఆందోళనకరమైన స్థానాల్లో ఉన్నాం. ఉదాహరణకు ఉగ్రవాద సూచికలో 8వ స్థానం, అవినీతిలో 28వ ర్యాంక్, హ్యాపీ ఇండెక్స్‌లో 44 ర్యాంక్‌లో ఉన్నాం. అభివృద్ధి, సంక్షేమం – రెండింటి కోసం అమలు చేసిన కార్యక్రమాలు, పథకాలు చాలానే ఉన్నా ఇప్పటికీ దీర్ఘకాలిక సమస్యలు ఉన్నాయి. ఎందుకంటే విధానాలు ఉత్తమమైనవే కానీ వాటి అమలులో మాత్రం లోపాలు ఉన్నాయి. ఈ ఆర్థిక సమస్యలన్నింటినీ మనం ఎప్పటికప్పుడు అధిగమించాలి. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ, వ్యవసాయ చట్టాలు వంటి ఇటీవలి విధానాలు ఆర్థిక వ్యవస్థలో ప్రతిష్టంభన సృష్టించాయి. అయితే ఈ సమస్యలన్నీ తగిన రాజ్యాంగ సవరణలతో పరిష్కరించబడతాయి. సానుకూల ఫలితాలను, సమాజ అభ్యున్నతికి హామీ ఇచ్చే విధానాలను సులభంగా స్థాపించగలిగే విధంగా మన చట్టాలను సవరించడం కొనసాగించాలి.

రాజ్యాంగాన్ని సముచితంగా అమలు చేయడానికి రాజకీయ రంగంలో, కార్యనిర్వాహక యంత్రాంగంలో నైతిక విలువలు ఉండాలి. ప్రజలు అవసరమైన చోట ప్రశ్నించే అవకాశం ఉండాలి. ప్రతి పౌరుడూ ఇతరుల హక్కులను గౌరవించాలి. చట్టబద్ధంగా, నైతికంగా తన విధులను నిర్వర్తించాలి. అప్పుడు ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగ సారాన్ని ఆస్వాదించగలరు.

– డాక్టర్ పి.ఎస్. చారి, మేనేజ్‌మెంట్ స్టడీస్ నిపుణులు । 83090 82823

గణతంత్ర దినాన... తెలుగు ప్రభలు

సందర్భం



నేలపూడి స్టాలిన్ బాబు

భారతదేశం విభిన్న సంస్కృతి సంప్రదాయాల సమాహారం. వందల ఏళ్ల నాటి సంప్రదాయాలను నేటికీ కొనసాగించడం దేశం గర్వించదగ్గ విషయం. సంక్రాంతి పర్వదినాలలో భాగంగా కోనసీమ ప్రాంతంలో నిర్వహించే ప్రభల తీర్థాలు అత్యంత విశిష్టమైనవే కాక 400 సంవత్సరాల చరిత్ర కలిగినవి. ఈ ఏడాది ఢిల్లీలో జరిగే ప్రధాన గణతంత్ర వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ప్రభల తీర్థం' ఇతివృత్తంగా తయారుచేసిన శకటాన్ని ప్రదర్శిస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం, జగ్గన్న తోటలో నిర్వహించే ప్రభల తీర్థం కోనసీమలో అత్యంత ముఖ్యమైన సాంస్కృతిక వేడుక. క్రీ.శ 17వ శతాబ్దంలో ప్రభల తీర్థాన్ని ప్రారంభించారని అంటారు. 11 గ్రామాల నుండి వచ్చిన ఏకాదశ రుద్రులు ఇక్కడ కొలువై ఉంటారని ప్రతీతి. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభల తీర్థం విశిష్టతను కొనియాడుతూ నిర్వాహకులకు లేఖను రాశారు. సంప్రదాయబద్ధంగా, భక్తి శ్రద్ధలతో వెదురు, తాటి కర్రలను, రంగు రంగుల కొత్త బట్టలు, నూలుదారాలను, కొబ్బరి తాళ్ళను, రంగు కాగితాలను, నెమలి పింఛాలను ఉపయోగించి ఒక అందమైన ప్రభను తయారు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆ యా గ్రామాల నుండి ఉత్సవ ప్రదేశానికి అంగరంగ వైభవంగా భుజాలపై ఆ ప్రభలను మోసుకు వస్తారు. కుల మతాలకు అతీతంగా ఈ తీర్థానికి భక్తులు హాజరవ్వడం విశేషం. ప్రతియేటా సంక్రాంతి పర్వదినాల్లో కనుమ నాడు ఈ తీర్థాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

కోనసీమ వ్యాప్తంగా దాదాపు 200 గ్రామాల్లో ప్రభల తీర్థాలను నిర్వహిస్తారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలలోనే కాక కృష్ణా జిల్లాలోనూ ప్రభల సంప్రదాయం ఉన్నది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ ప్రాంతాలకు చెందిన ప్రజలు దేశ, విదేశాలలో ఎక్కడ ఉన్నా... సంక్రాంతి సమయానికి మాత్రం వారి వారి స్వగ్రామాలకు చేరుకొని, ప్రభల తీర్థాలలో పాల్గొంటారు. మేళ తాళాలు, సంప్రదాయ నృత్యాల నడుమ బాణసంచా కాలుస్తూ సంప్రదాయ సంగీత వాద్యాలు, 'గరగ' జానపద కళారూపం వంటివాటిని ప్రదర్శిస్తూ వేడుకలు చేసుకుంటారు. సంప్రదాయ కళలకు, వాటినే నమ్ముకుని జీవిస్తున్న కళాకారులకు ఈ ఉత్సవాలు ప్రోత్సాహం ఇస్తాయి. చిన్న చిన్న బొమ్మలు, జీళ్ళు, కర్జూరం, గృహోపకరణాలు వంటివాటిని అమ్ముకుని జీవించే అనేక మంది చిరు వ్యాపారులకు ఆర్థికంగా చేయూత ఇస్తున్నాయి ఈ తీర్థాలు.



ప్రభల తీర్థ మహోత్సవాల్లో కొలువుదీరే ప్రభలలో వాకల గురువు (52 అడుగుల ఎత్తు), తొండవరం (51 అడుగుల ఎత్తు) ప్రభలు రాష్ట్రంలోనే అత్యంత ఎత్తైన ప్రభలుగా గుర్తింపబడ్డాయి. ఇంత ఎత్తైనప్రభలను తయారు చేయడం, వాటిని గ్రామస్థులు తమ భుజస్కంధాలపై ఎత్తుకుని కొబ్బరి, వరి పొలాలు, కాలువలు దాటుకుంటూ తీర్థం జరిగే ప్రదేశానికి తీసుకురావడం ఎంతో శ్రమతో కూడిన పని. పెద్ద ప్రభలకు బాసటగా పిల్ల ప్రభలను కొలువుదీరుస్తారు. వీటిని స్వయంగా 10 నుండి 15 ఏళ్ల వయసు ఉన్న చిన్నారులు తయారు చేస్తారు.

సమాజంలో శాంతి, లోక కల్యాణం కోసం ప్రజలు ఏకాదశ రుద్రులను ప్రార్థిస్తారు. రైతులను సంఘటితం చేసేందుకు, వారి ఐక్యతను పెంపొందించేందుకు ఇవి ఉపయోగపడతాయని భావిస్తారు. ఇంతటి సాంస్కృతిక ప్రాధాన్యం కలిగిన ప్రభల తీర్థాలను ప్రతిబింబిస్తూ... గణతంత్ర దినోత్సవంలో ప్రదర్శించ తలపెట్టిన రాష్ట్ర శకటం ఎంతో ఆకర్షణీయంగా ఉంది. శకటం ముందు భాగంలో కోనసీమ జిల్లాలో సంక్రాంతి పర్వదినాల సందర్భంగా అలంకరించినట్లుగా ఉన్న ఒక గూడు ఎడ్ల బండిపై రైతు కుటుంబం ప్రయాణిస్తున్నట్లుగా చిత్రించారు. అలాగే కోనసీమ ప్రకృతి అందాలను ప్రతిబింబించే విధంగా వరి పొలం గట్టుపై ఈ బండి వెళుతున్నట్లుగాను, వరి ధాన్యాన్నీ, ఈ ప్రాంతంలో పండే కొన్ని కూరగాయలను, పొలాలను కూడా చిత్రించారు. దాని వెనుకే శోభాయమానంగా అలంకరించిన ప్రభలను, బోయీలు మోస్తున్న పల్లకీని ప్రదర్శిస్తున్నారు. ప్రభలను రైతులు పూజించే విధానాన్నీ, కోనసీమలో సంప్రదాయ 'గరగ నృత్యం' విశిష్టతనూ తెలిపేవిధంగా ప్రదర్శన ఉంటుంది. వెనుక భాగంలో కోనసీమ కొంగుబంగారం కొబ్బరి చెట్లు ఎటూ ఉంటాయనుకోండి!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ శకటం ప్రదర్శించడం ద్వారా తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట వేసింది. తద్వారా రైతు పండుగకు అగ్రతాంబూలం ఇచ్చింది.

వ్యాసకర్త సామాజిక రాజకీయ విశ్లేషకులు
మొబైల్: 83746 69988

అన్నదమ్ముల బంధం

మహా భారతం నీతి కథల పుట్ట. తవ్విన కొద్దీ కొత్త కొత్తవి వింత వింతవి బయట పడుతూనే ఉంటాయి. నేటి కాలానికీ అన్వయించుకోదగ్గ సందేశం వీటిల్లో ఉండటం వీటి ప్రత్యేకత. వాటిల్లో ఒక కథ తాబేలు – ఏనుగుకు సంబంధించినది. ఆది పర్వం ద్వితీయాశ్వాసంలో కశ్యప ప్రజాపతి తన కుమారుడు గరుత్మంతునకు చెబుతాడు దీన్ని.

పూర్వం ఒకప్పుడు ఇద్దరన్నదమ్ములు ఉండేవారు. అన్న పేరు విభావసు. తమ్ముడి పేరు సుప్రతీకుడు. తండ్రి తదనంతరం తనకు సంక్రమించిన ఆస్తి మొత్తం తన దగ్గరే ఉంచుకొని, తమ్ముడికి ఇవ్వవలసింది అన్న పంచి ఇవ్వలేదు. తమ్ముడికి ఓపిక నశించి ఓ రోజు గట్టిగా అడిగాడు. అన్న శీఘ్ర కోపి. కోపం విచక్షణా జ్ఞానాన్ని హరిస్తుంది అని కదా అంటారు. తమ్ముణ్ణి తీవ్ర స్వరంతో శపిస్తాడు. 'నీవు వచ్చే జన్మలో తాబేలుగా పుడతావు' అని. తమ్ముడు ఊరుకోకుండా 'నీవు ఏనుగువై పుడతావు' అని ప్రతి శాపమిస్తాడు. ఆ విధంగా మరుజన్మలో ఒకరు సరస్సులో పెద్ద తాబేలుగా, మరొకరు దాపున ఉన్న అడవిలో పెద్ద ఏనుగుగా పుడతారు. పూర్వ జన్మ సంస్కారం ఎక్కడకు పోతుంది? వారి వెంటే వచ్చింది. ఈ జన్మలో కూడా వారు బద్ధ శత్రువులై ఒకరినొకరు ద్వేషించుకొంటూ, కలహించుకొంటూ ఉంటారు. సరస్సులో ఉన్న తాబేలును చంపాలని ఏనుగు, ఏనుగును చంపాలని తాబేలు ఎప్పుడూ విశ్వ ప్రయత్నం చేస్తుంటాయి. ఇదీ కథ.



ఈ కథ చెప్పి కశ్యపుడు కొడుకుతో, 'నీవు వెళ్ళి నీ ఆకలి తీరేట్టు ఆ రెండింటినీ భక్షించు' అంటాడు. గరుడుడు తక్షణం ఆ పని చేస్తాడు.

ఈ కథ ఏం చెప్తుంది? సొంత అన్నదమ్ముల మధ్య చిచ్చుకు ఆస్తి పంపకాలు ముఖ్య కారణమౌతాయి. బయట వ్యక్తి ఎవరో అన్నదమ్ముల తగాదాల్లో తలదూర్చి ఇద్దరినీ నష్టపరచి, తాను లాభం పొందుతాడు – తాబేలు, ఏనుగు గొడవల్లో గరుత్మంతుడు లాభం పొందినట్లు. ఆస్తి తగాదాలు ఏళ్ళ తరబడి కొనసాగుతాయి. తరాలు మారినా ద్వేషం చల్లారకుండా రాజుకొంటూనే ఉంటుంది. అలా కాకుండా ఉండాలంటే, తమ్ముల పట్ల అన్న... తండ్రిలా ప్రవర్తించాలి. తండ్రి లేని లోటు తీర్చాలి. శ్రీరాముడు తమ్ముల పట్ల చూపిన పితృవాత్సల్యం, తమ్ములు శ్రీరాముని పట్ల చూపిన ప్రేమ, గౌరవాలు ఈ కాలంలో అందరికీ ఆదర్శం కావాలి.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం,. తిథి: శు.పంచమి సా.4.50 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: ఉత్తరాభాద్ర రా.1.11 వరకు, తదుపరి రేవతి, వర్జ్యం: ప.11.21 నుండి 12.54 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.22 నుండి 11.07 వరకు, తదుపరి ప.2.50 నుండి 3.33 వరకు, అమృతఘడియలు: రా.8.33 నుండి 9.32 వరకు, వసంతపంచమి, శ్రీపంచమి; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.48

మళ్లీ అధ్యయనం కుదరదు

- పోలవరం బ్యాక్ వాటర్‌పై తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు తేల్చిచెప్పిన సీడబ్ల్యూసీ
- బ్యాక్ వాటర్ వల్ల ముంపు ఉండదని స్పష్టీకరణ
- ఇదే విషయాన్ని కేంద్ర జల్ శక్తి శాఖకు నివేదిస్తామని వెల్లడి
- భద్రాచలం, మణుగూరు కర్మాగారం ఎఫ్ఆర్ఎల్ పరిధిలోకి రావన్న ఏపీ
- క్షేత్రస్థాయిలో చూపించడానికి సిద్ధమని స్పష్టీకరణ
- ఏపీ అధికారులతో కలిసి పరిశీలనకు వెళ్లాలని తెలంగాణకు సీడబ్ల్యూసీ సూచన
- ఆరు వాగులపై అధ్యయనం చేయాలన్న సీడబ్ల్యూసీ చైర్మన్
- ప్రభుత్వంతో చర్చించి చెబుతామన్న ఏపీ ఈఎన్సీ

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంపై మళ్లీ అధ్యయనం చేయడం కుదరదని ఒడిశా, తెలంగాణ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తేల్చిచెప్పింది. అది ముగిసిన అధ్యాయమని బుధవారం ఢిల్లీలో జరిగిన పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంపై నియమించిన సాంకేతిక కమిటీ సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్ వోరా చెప్పారు. సీడబ్ల్యూసీ చైర్మన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏపీ, తెలంగాణ, ఒడిశాల ఈఎన్సీలు సి.నారాయణరెడ్డి, నాగేంద్రరావు, అశుతోస్ దాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఛత్తీస్‌గఢ్ ఈఎన్సీ రాతపూర్వకంగా నివేదిక పంపారు. గోదావరి చరిత్రలో ఇప్పటిదాకా గరిష్ఠంగా 36 లక్షల క్యూసెక్కుల ప్రవాహమే వచ్చిందని వోరా గుర్తు చేశారు. అయినప్పటికీ, 50 లక్షల క్యూసెక్కుల వరద వస్తుందని అంచనా వేసి పోలవరం ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేసే గరిష్ఠ వరద ప్రవాహం (స్టాండర్డ్ ప్రాజెక్ట్ ఫ్లడ్ - ఎస్పీఎఫ్)ను పరిగణనలోకి తీసుకుని బ్యాక్ వాటర్ ప్రభావంపై ఆదిలోనే అధ్యయనం చేశామని వివరించారు. బ్యాక్ వాటర్ వల్ల ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లలో ఎలాంటి ముంపు ఉండదని తేలిందన్నారు. గోదావరికి 58 లక్షల క్యూసెక్కుల వరద వస్తుందన్న తెలంగాణ, ఒడిశాలు చేస్తున్న వాదనల ఆధారంగా మళ్లీ అధ్యయనం చేసే ప్రశ్నే లేదని స్పష్టంచేశారు. ఇదే అంశాన్ని వివరిస్తూ కేంద్ర జల్ శక్తి శాఖకు నివేదిక ఇస్తామని వెల్లడించారు. భద్రాచలం, మణుగూరులపై కూడా బ్యాక్ వాటర్ ప్రభావం ఉండదని, అందువల్ల ముంపు ముప్పెలా ఉంటుందని తెలంగాణను ప్రశ్నించారు. భద్రాచలం, మణుగూరు ఎఫ్ఆర్ఎల్ పరిధిలో లేనే లేవని ఏపీ ఈఎన్సీ తేల్చిచెప్పారు. పోలవరం ఎఫ్ఆర్ఎల్‌ను గుర్తిస్తూ సర్వే రాళ్లు కూడా వేశామని, వాటిని చూపించడానికి సిద్ధమని చెప్పారు. సందేహాలు నివృత్తి చేసుకోవాలంటే ఏపీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలంగాణ ఈఎన్సీకి సీడబ్ల్యూసీ చైర్మన్ సూచించారు.

ఎఫ్ఆర్ఎల్ పరిధిలో ఉంటే పరిహారం ఇస్తాం

గతేడాది జూలై, ఆగస్టులో వరదల వల్ల బూర్గంపహాడ్‌తోపాటు ఆరు గ్రామాలు, 891 ఎకరాలు ముంపునకు గురయ్యాయని తెలంగాణ ఈఎన్సీ చెప్పగా, సీడబ్ల్యూసీ చైర్మన్ తోసిపుచ్చారు. స్థానిక పరిస్థితుల వల్లే ఆ ప్రాంతం ముంపునకు గురైందని తేల్చిచెప్పారు. దీనిపై ఏపీ ఈఎన్సీ స్పందిస్తూ.. గరిష్ఠ నీటి మట్టం (ఎఫ్ఆర్ఎల్) పరిధిలో ఉంటే బూర్గంపహాడ్ గ్రామాన్ని తమ రాష్ట్రంలో విలీనం చేయాలని, లేదంటే భూసేకరణ చట్టం 2013 ప్రకారం ముంపు భూమికి, నిర్వాసితులకు పరిహారం ఇవ్వడానికి సిద్ధమని చెప్పారు. దీంతో తెలంగాణ అధికారులు మిన్నకుండిపోయారు.

ఎన్జీటీ ఆదేశాలకే పరిమితం

కిన్నెరసాని, ముర్రేడుతో పాటు 36 వాగుల్లోకి బ్యాక్‌వాటర్ ఎగదన్ని ముంపునకు దారితీస్తోందని, దీనిపై అధ్యయనం చేసి, కరకట్టలు నిర్మించాలన్న తెలంగాణ వాదనపై ఏపీ ఈఎన్సీ అభ్యంతరం తెలిపారు. తొలుత కేవలం కిన్నెరసాని, ముర్రేడువాగులకు బ్యాక్ వాటర్ ప్రభావంపై అధ్యయనం చేస్తే చాలని కోరారని, ఇప్పుడు 36 వాగులపై అధ్యయనం కోరుతున్నారని అన్నారు. కిన్నెరసాని, ముర్రేడు వాగులకు బ్యాక్ వాటర్ ప్రభావంపై అధ్యయనం చేయగా పరిగణించదగ్గ ప్రభావం ఉండదని వెల్లడైందని తెలిపారు. ఇదే విషయాన్ని తెలంగాణకూ తెలిపామని గుర్తు చేశారు. ఎన్జీటీ ఆదేశాల మేరకు కిన్నెరసాని, ముర్రేడు వాగులపై బ్యాక్ వాటర్ ప్రభావాన్ని గుర్తించడానికి సిద్ధమని స్పష్టం చేశారు. తెలంగాణ భూభాగం నుంచి కలిసే ఆరు వాగులకు బ్యాక్ వాటర్ ప్రభావంపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ నేతృత్వంలో సంయుక్త సర్వే చేయాలని సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా ఏపీ ఈఎన్సీకి సూచించారు. దీనిపై తమ ప్రభుత్వంతో చర్చించి, చెబుతామని ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి చెప్పారు.

డయాఫ్రమ్ వాల్ సామర్థ్యం తేల్చే పరీక్షలకు శ్రీకారం

- పోలవరంలో నేటి నుంచి పరీక్షలు

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ గ్యాప్–2లో గోదావరి వరదలకు దెబ్బతిన్న పునాది డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చే పరీక్షలకు నేషనల్ హైడ్రోపవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) నిపుణుల బృందం శ్రీకారం చుట్టింది. పోలవరం ప్రాజెక్టు వద్ద బుధవారం పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో శివ్‌నందకుమార్, సభ్య కార్యదర్శి ఎం.రఘురాం, పోలవరం సీఈ సుధాకర్‌బాబు, ఎస్‌ఈ నరసింహమూర్తిలతో ఎన్‌హెచ్‌పీసీ ఈడీ ఎస్.ఎల్.కపిల్, సీనియర్ మేనేజర్లు ఎ.విపుల్ నాగర్, ఎస్.కె.పాండే, ఎం.పి.సింగ్ సమావేశమయ్యారు. డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చేందుకు హైరెజల్యూషన్ జియోఫిజికల్ రెసిస్టివిటీ ఇమేజింగ్, సెస్మిక్ టోమోగ్రఫీ విధానాల్లో పరీక్షలు నిర్వహించడంపై చర్చించారు. తర్వాత గ్యాప్–2 డయాఫ్రమ్ వాల్‌పై ప్రతి మీటరుకు ఒకచోట 20 మిల్లీమీటర్ల (ఎంఎం) వ్యాసంతో 1.5 అడుగుల లోతువరకు జలవనరుల శాఖ అధికారులు వేసిన రంధ్రాల్లోకి ఎలక్ట్రోడ్‌లను అమర్చి హైరెజల్యూషన్ జియోఫిజికల్ రెసిస్టివిటీ ఇమేజింగ్ విధానంలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ పనులకు సమాంతరంగా డయాఫ్రమ్ వాల్‌కు ఒక మీటరు ఎగువన, ఒక మీటరు దిగువన 60 ఎంఎం వ్యాసంతో 30 నుంచి 40 అడుగుల లోతువరకు ప్రతి 40 మీటర్లకు ఒకటి చొప్పున తవ్విన బోరు బావుల్లోకి ఎలక్ట్రోడ్‌లను పంపి సెస్మిక్ టోమోగ్రఫీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. గురువారం ప్రారంభించే ఈ పరీక్షలు పూర్తవడానికి కనీసం 15 రోజుల సమయం పడుతుంది. ఆ తర్వాత ఈ రెండు పరీక్షల ఫలితాలను విశ్లేషించడానికి కనీసం 30 రోజుల సమయం పడుతుందని అధికారవర్గాలు వెల్లడించాయి. మొత్తంమీద 45 రోజుల్లోగా డయాఫ్రమ్ వాల్ భవితవ్యం వెల్లడికానుందని తెలిపాయి.



డయాఫ్రమ్‌వాల్ సామర్థ్యాన్ని తేల్చేందుకు పరీక్షలు నిర్వహిస్తున్న ఎన్‌హెచ్‌పీసీ బృందం

ఫిబ్రవరి 20 కల్లా ఈ-క్రాప్ పూర్తిచేయాలి

- వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్

సాక్షి, అమరావతి: రబీ ఈ–క్రాప్ నమోదు ఫిబ్రవరి 20 కల్లా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరు హరికిరణ్ ఆదేశించారు. ఆయన బుధవారం గుంటూరు నుంచి అన్ని జిల్లాలు, డివిజన్లు, మండల వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–క్రాప్ జాబితాలను సోషల్ ఆడిట్‌లో భాగంగా ఫిబ్రవరి 28 వరకు ఆర్బీకేల్లో ప్రదర్శించి, వచ్చే అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత మార్చి 7వ తేదీన తుది జాబితాలను వెల్లడించాలని చెప్పారు. పీఎం కిసాన్ లబ్ధిదారులందరూ 13వ విడత పెట్టుబడి సాయం కోసం ఈకేవైసీ, బ్యాంక్ ఖాతాలను నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఇండియా (ఎన్‌పీసీఐ)తో మ్యాపింగ్ చేసే ప్రక్రియలను ఫిబ్రవరి 10 కల్లా పూర్తి చేయాలన్నారు. ఈ సదుపాయాలను సమీప ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) సహకారంతో త్వరితగతిన పూర్తిచేసేందుకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రబీ సీజన్‌కు సంబంధించి జనవరి నెలకు 2.07 లక్షల టన్నుల యూరియా అవసరం కాగా 1.85 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి చేరిందని చెప్పారు.

క్లుప్తంగా

మరోసారి 36 ఉపగ్రహాలు
ప్రయోగానికి 'వన్‌వెబ్' ఏర్పాట్లు

న్యూఢిల్లీ: ఒకేసారి 36 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించేందుకు గ్లోబల్ కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్ సంస్థ వన్‌వెబ్ సిద్ధమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఇస్రో వాహక నౌక మార్క్–3 నుంచి ఈ ఏడాది మార్చి తొలి వారంలో ఈ ప్రయోగం చేపట్టనున్నారు. 36 ఉపగ్రహాలు తమ ఫ్యాక్టరీ నుంచి బయలుదేరాయని, వాటి గమ్యస్థానం భారత్ అంటూ వన్‌వెబ్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మాసిమిలియానో లాడోవెజ్ ట్వీట్ చేశారు. వన్‌వెబ్ సంస్థ గత అక్టోబర్ 22న శ్రీహరికోటలో ఇస్రో వాహక నౌక ఎల్‌వీఎం–3 నుంచి 36 శాటిలైట్లను అంతరిక్షంలోకి ప్రయోగించడం తెలిసిందే.

ఉక్రెయిన్‌కు అత్యాధునిక యుద్ధ ట్యాంకులు: జర్మనీ

బెర్లిన్: తమ మిత్ర దేశాలకు కచ్చితంగా సహకరిస్తామని జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్ హామీ ఇచ్చారు. రష్యా సైన్యంపై పోరాడుతున్న ఉక్రెయిన్‌కు అత్యాధునిక లియోపార్డ్–2 ఏ6 యుద్ధ ట్యాంకులు అందజేస్తామని బుధవారం ప్రకటించారు. ఉక్రెయిన్‌కు తమ సొంత ఆయుధాగారం నుంచి తొలుత ఒక కంపెనీలు ట్యాంకులను (14 వాహనాలు) పంపించనున్నట్లు జర్మనీ ప్రభుత్వం ఒక తాజాగా ప్రకటనలో వెల్లడించింది. ఉక్రెయిన్‌కు మొత్తం 88 యుద్ధ ట్యాంకులను త్వరలో సమకూర్చాలని జర్మనీతోపాటు మిత్రదేశాలు నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఉక్రెయిన్‌కు సాయం అందించే విషయంలో తమ మిత్ర దేశాలతో కలిపి పని చేస్తున్నామని ఒలాఫ్ షోల్జ్ వెల్లడించారు. తమ దేశంలో తయారైన అత్యాధునిక యుద్ధ ట్యాంకులను ఉక్రెయిన్ సైన్యం మరోసారి రష్యా సేనలపై ఎక్కుపెట్టబోతోందని జర్మనీ సైనికాధికారి ఎకెహార్ట్ బ్రోస్ చెప్పారు. రష్యా దండయాత్రను అడ్డుకొనేలా ఉక్రెయిన్‌కు బాసటగా నిలవాల్సిన బాధ్యత పశ్చిమ దేశాలపై ఉందన్నారు. ఇదిలా ఉండగా, ఉక్రెయిన్‌కు అందుతున్న విదేశీ సైనిక సాయంపై రష్యా అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ దేశాలు వినాశకరమైన నిర్ణయాలు తీసుకుంటున్నాయని హెచ్చరించారు.

పాక్ ప్రభుత్వోద్యోగుల జీతంలో 10 శాతం కోత !

ఇస్లామాబాద్: ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్ ప్రభుత్వోద్యోగుల జీతభత్యాల్లో 10 శాతం కోత పెట్టాలని యోచిస్తోందట! మంత్రుల ఖర్చులను 15 శాతం తగ్గించాలని, స్వతంత్ర మంత్రులు, సహాయక మంత్రులు, సలహాదారులను 78 నుంచి 30కి కుదించాలని ప్రధాని షహబాజ్ షరీఫ్ ఏర్పాటుచేసిన జాతీయ వ్యయ నియంత్రణ కమిటీ యోచిస్తోంది. ఈ మేరకు ప్రధానికి తుది నివేదిక ఇవ్వనుందని జియో న్యూస్ కథనం పేర్కొంది.

గణతంత్ర పరేడ్‌లో... స్వదేశీ వెలుగులు

గర్జించనున్న మేడిన్ ఇండియా ఆయుధాలు ● తొలిసారి స్వదేశీ తుపాకులతో గౌరవ వందనం

74వ గణతంత్ర వేడుకలు స్వదేశీ వెలుగులతో మెరవనున్నాయి. సంప్రదాయ గౌరవ వందనంలో బ్రిటిష్ కాలపు 25–పౌండర్ గన్స్ స్థానంలో స్వదేశీ 105 ఎంఎం తుపాకులు సగర్వంగా గర్జించనున్నాయి. పరేడ్‌లో ప్రదర్శించే ఆయుధాలన్నీ మన దేశంలో తయారైనవే! బ్రిటన్ వలస పాలన నీడల నుంచి బయటపడి పూర్తిగా భారతీయత ఉట్టిపడేలా ఆత్మనిర్భర్ భారత్ సత్తాను సగర్వంగా చాటేలా గణతంత్ర వేడుకలను జరిపేందుకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. చైనాతో ఉద్రిక్తతల వేళ మన సాయుధ సత్తాను చాటడానికి కవాతులో మేడిన్ ఇండియా ఆయుధాలను ప్రదర్శించబోతున్నారు. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా దేశీయంగా అభివృద్ధి చేసిన అగ్ని, ఆకాశ్, నాగ్ క్షిపణులతో పాటు బ్రహ్మోస్, అర్జున్ యుద్ధ ట్యాంకులు, ప్రచండ హెలికాప్టర్లు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి...



బ్రహ్మోస్
ప్రపంచంలో మొట్టమొదటి సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి. భారత రక్షణ అభివృద్ధి పరిశోధన రంగ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన బ్రహ్మోస్‌ను విమానాలు, నౌకలు, జలాంతర్గాములు, భూ ఉపరితలం... ఇలా ఎక్కడి నుంచైనా ప్రయోగించవచ్చు. ధ్వని కంటే మూడు రెట్లు వేగంతో ప్రయాణించగలదు. వంద శాతం కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదిస్తుంది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన క్షిపణిగా గుర్తింపు పొందింది. శత్రు దేశాల రాడార్‌ల నుంచి కూడా సులభంగా తప్పించుకోగల ఈ క్షిపణి శత్రు దేశాల వెన్నులో వణుకు పుట్టిస్తోంది.

అగ్ని


దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన క్షిపణి. కాలక్రమేణా ఆధునిక సాంకేతికతతో రూపు మార్చుకుంటూ వచ్చింది. అగ్ని 5 వెర్షన్లను రూపొందించిన తర్వాత ఇటీవల అణ్వాయుధ సామర్థ్యంతో అగ్ని ప్రైమ్ ఖండాంతర క్షిపణిని తయారు చేశారు. 2 వేల కి.మీ. దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలదు.

నాగ్


శత్రు యుద్ధ ట్యాంకులను ధ్వంసం చేయడానికి రూపొందించిన క్షిపణి. రాత్రి పూట కూడా సమర్థంగా పని చేయగలదు. 4 కి.మీ. దూరంలోని ట్యాంకుల్ని గురి తప్పకుండా నాశనం చేస్తుంది. ఒకసారి పేల్చితే లక్ష్యాన్ని దానంతట అదే వేటాడుతూ వెళ్లే సామర్థ్యం ఉంది. బరువు తక్కువ గనుక దీన్ని మోసుకుపోవడం కూడా సులభం.

ప్రచండ


ఎత్తైన పర్వత ప్రాంతాల్లో మోహరించగలిగే తేలికపాటి హెలికాప్టర్. హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) అభివృద్ధి చేసింది. సముద్ర మట్టానికి 16,400 అడుగుల ఎత్తులో అలవోకగా టేకాఫ్, ల్యాండింగ్ ప్రత్యేకత. దీనితో రెండు శక్తిమంతమైన ఇంజిన్లు, అత్యంత ఆధునిక సౌకర్యాలుంటాయి. రాత్రి పూట కొండల మధ్య ప్రయాణించగలిగే సత్తాతో పాటు నిమిషానికి 800 రౌండ్లు కాల్పులు జరిపే సామర్థ్యముంది. చైనా డ్రోన్లను కూడా కూల్చివేయగలవు. నేలపై ఉన్న ట్యాంకర్లను సైతం ధ్వంసం చేయగలవు.

ఆకాశ్


ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించిన భారత్ తొలి క్షిపణి ఆకాశ్. భూతలం నుంచి గగనతలానికి ప్రయోగించే ఈ క్షిపణి 25 కి.మీ. దూరంలోని లక్ష్యాలను కచ్చితంగా ఛేదించగలదు. 95% పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించారు. ఇందుకు పాతికేళ్లు పట్టింది. 2014లో వైమానిక దళానికి, 2015లో ఆర్మీకి అందజేశారు. వీటిని విదేశాలకు విక్రయించడానికీ సన్నాహాలు జరుగుతున్నాయి.

కే–9 వజ్ర


స్వీయ చోదక శతఘ్ని వ్యవస్థ. 2018లో తొలిసారిగా ఆర్మీకి అందజేశారు. మైదాన ప్రాంతాల్లో అత్యంత సమర్థంగా పని చేస్తుంది. ప్రస్తుతం లద్దాఖ్ సరిహద్దుల్లో మోహరించారు. 155 ఎంఎం కెనాన్ కలిగిన ఈ శతఘ్ని 18 నుంచి 52 కి.మీ. దూరం దాకా గుళ్ల వర్షం కురిపించగలదు. దీనికున్న అత్యంత శక్తిమంతమైన ఇంజిన్ గంటకి 67 కి.మీ. వేగంతో పని చేస్తుంది.

అర్జున్


ఈ యుద్ధ ట్యాంకు సరిహద్దుల్ని కాపుకాసే విశ్వసనీయమైన నేస్తం. 2011లో మన అమ్ముల పొదిలో చేరింది. దీని ఫీచర్లను మరింత ఆధునీకరించి అర్జున్ ఎంకే1ఏను అభివృద్ధి చేశారు. రాత్రిళ్లూ సమాన సామర్థ్యంతో పని చేయడం దీని ప్రత్యేకత. బరువు తక్కువ కావడంతో మైదాన, కొండ ప్రాంతాల్లో ఒకేలా కదలగలవు. చెన్నైలోని హెవీ వెహికల్స్ ఫ్యాక్టరీ దీన్ని తయారు చేసింది.

ఇంకా ఏల్‌హెచ్ ధ్రువ్, ఏఎల్‌హెచ్ రుద్ర తదితరాలను కూడా పరేడ్‌లో ప్రదర్శిస్తారు. ఇక ఈ సారి రిపబ్లిక్ డే పరేడ్‌లో కొత్తగా సైన్యంలో చేర్చుకున్న అగ్నివీరులు అదనపు ఆకర్షణ కానున్నారు. సరిహద్దు భద్రతా బలగాల్లో పనిచేస్తున్న మహిళా కమాండర్లు, నేవీలో సేవలందిస్తున్న 144 మంది మహిళా అధికారులు నారిశక్తిని సగర్వంగా చాటనున్నారు.

రక్షణ రంగానికి స్వదేశీ హంగులు

ప్రధానిగా నరేంద్ర మోదీ పగ్గాలు చేపట్టాక రక్షణ రంగంలో స్వావలంబనకు అత్యధిక ప్రాధాన్యమిచ్చారు. ఆయుధాల కోసం విదేశాల మీద ఆధారపడటం తగ్గించి దేశీయంగా తయారు చేయడంపై దృష్టి కేంద్రీకరించారు. రష్యా వంటి దేశాల సాంకేతిక సహకారంతో దేశీయంగా ఆయుధాల ఉత్పత్తి ముమ్మరమైంది. 2021లో సాయుధ బలగాలు తమకు కేటాయించిన నిధుల్లో 64% స్వదేశీయంగా తయారైన ఆయుధాల కొనుగోలుకు వినియోగిస్తే గతేడాది 68% నిధులు వినియోగించాయి. ఆర్మీ అత్యధికంగా 72% నిధులను మేడిన్ ఇండియా ఆయుధాలపైనే వెచ్చించింది. దేశీయంగా రక్షణ పరికరాల ఉత్పత్తి విలువను 2025 కల్లా 2,500 కోట్ల డాలర్లకు తీసుకువెళ్లే లక్ష్యం దిశగానూ వడివడిగా అడుగులు పడుతున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ప్రాంతీయ భాషల్లో సుప్రీం తీర్పులు
నేటి నుంచే..

న్యూఢిల్లీ: ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం నుంచి సర్వోన్నత న్యాయస్థానం పౌరులకు కొత్త వెసులుబాటు కల్పించనుంది. షెడ్యూల్ భాషల్లోనూ న్యాయస్థానం తీర్పులను వెలువరిస్తామని బుధవారం సుప్రీంకోర్టు తెలిపింది. ఎలక్ట్రానిక్ సుప్రీంకోర్టు రిపోర్ట్స్(ఈ–ఎస్‌సీఆర్) ప్రాజెక్టులో భాగంగా ఇకపై రాజ్యాంగంలో పేర్కొన్న 22 భాషల్లోనూ తీర్పులను అందుబాటులో ఉంచుతామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చబడిన తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కశ్మీరీ, కొంకణి, మలయాళం, మణిపురి, మరాఠీ, నేపాలీ, ఒరియా, పంజాబీ, సంస్కృతం, సింధీ, ఉర్దూ, బోడో, సంథాలీ, మైథిలీ, డోగ్రీ భాషల్లో తీర్పులను ప్రజలు ఉచితంగా పొందొచ్చు. ' ఈ–ఎస్‌సీఆర్ ప్రాజెక్ట్ ద్వారా 34,000 తీర్పులు పొందొచ్చు. వాటిలో ఇప్పటికే 1,268 తీర్పులు ప్రాంతీయ భాషల్లోనూ ఉన్నాయి. తీర్పుల్లో 1091 హిందీలో, 21 ఒడియాలో, 14 మరాఠీ, 4 అస్సామీ, ఒకటి గారో, 17 కన్నడ, ఒకటి ఖాసీ, 29 మలయాళం, 3 నేపాలీ, 4 పంజాబీ, 52 తమిళం, 28 తెలుగు, 3 ఉర్దూ భాషల్లో ఉన్నాయి.' గురువారం నుంచి 13 భాషల్లో 1,268 తీర్పులు సుప్రీంకోర్టు వెబ్‌సైట్, మొబైల్ యాప్, నేషనల్ జ్యుడీషియల్ డాటా గ్రిడ్ వెబ్‌సైట్‌లో జనవరి 26వ తేదీ నుంచి అందుబాటులో వస్తాయి. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీదాకా వెలువరిచిన తీర్పులను న్యాయవాదులు, లా విద్యార్థులు, సాధారణ జనం అందరూ వీటిల్లో ఉచితంగా చూసుకోవచ్చు' అని సీజే చెప్పారు.

'జామియా'లో డాక్యుమెంటరీ కలకలం


న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై 'ఇండియా: ద మోదీ క్వశ్చన్' పేరిట బీబీసీ రూపొందించిన వివాదాస్పద డాక్యుమెంటరీని ప్రదర్శించేందుకు విద్యార్థి సంఘం నాయకులు ఏర్పాట్లు చేయడం ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో కలకలం రేపింది. బుధవారం సాయంత్రం 6 గంటలకు ఈ డాక్యుమెంటరీ ప్రదర్శిస్తామని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌ఎఫ్‌ఐ) నేతలు ప్రకటించారు. దీంతో పలువురు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

డాక్యుమెంటరీ ఎందుకొచ్చింది?
తిరువనంతపురం: బీబీసీ డాక్యుమెంటరీని కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ తప్పుబట్టారు. 'జీ20 కూటమికి భారత్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ఇదే సమయానికి బీబీసీ డాక్యుమెంటరీ తేవడం ఏంటి?' అని ప్రశ్నించారు.

ములాయంకు పద్మవిభూషణ్

ఆరుగురికి రెండో అత్యున్నత పురస్కారం ● 9 మందికి పద్మభూషణ్ ● 91 మందికి పద్మశ్రీ


మహలనబిస్


శ్రీనివాస్ వర్ధన్


బాలకృష్ణ దోషీ


ఎస్ఎల్ భైరప్ప


దీపక్‌ధర్


సుమన్ కల్యాణ్‌పుర్


కపిల్ కపూర్

సాక్షి, న్యూఢిల్లీ: 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రతిష్టాత్మక పద్మ పురస్కారాలను ప్రకటించింది. 2023 సంవత్సరానికి ఆరుగురికి దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మవిభూషణ్ దక్కింది. 9 మందికి పద్మభూషణ్, 91 మంది పద్మశ్రీ అవార్డులు దక్కాయి. అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న ఈసారి ఎవరికీ ప్రకటించలేదు. ఇటీవల మరణించిన ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ దివంగత నేత ములాయంసింగ్ యాదవ్‌తో పాటు ప్రముఖ తబల వాయిద్య కళాకారుడు జాకీర్ హుస్సేన్, మాజీ విదేశాంగ మంత్రి, కర్ణాటక మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ పద్మ విభూషణ్ గ్రహీతల్లో ఉన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చినజీయర్ స్వామితో పాటు ప్రఖ్యాత పారిశ్రామికవేత్త కుమారమంగళం బిర్లా, సుధామూర్తి, గాయకురాలు వాణీ జయరాం తదితరులు పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికైన వారిలో ఉన్నారు. ఇక తెలుగు రాష్ట్రాల నుంచి 10 మందికి పద్మశ్రీ పురస్కారం లభించింది. వీరిలో ఏపీ నుంచి ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, సామాజిక సేవకుడు సంకురాత్రి చంద్రశేఖర్ సహా ఏడుగురు, తెలంగాణ నుంచి సాహితీవేత్త బి.రామకృష్ణారెడ్డితో పాటు మొత్తం ముగ్గురున్నారు. అలాగే ఆధ్యాత్మిక రంగంలో కమలేశ్ డి.పటేల్‌కు కూడా తెలంగాణ కోటాలో పద్మభూషణ్ దక్కడం విశేషం. మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా దూదేకుల ఖాదర్ వలీకి కర్ణాటక కోటాలో పద్మశ్రీ లభించింది. పద్మ అవార్డుల విజేతల్లో 19 మంది మహిళలు, ఇద్దరు విదేశీ/ఎన్ఆర్ఐ కేటగిరీకి చెందినవారున్నారు. పద్మ పురస్కారాల విజేతలను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. తమ తమ రంగాల్లో వారు చేసిన కృషి సాటిలేనిదంటూ ప్రశంసించారు. పద్మ అవార్డుల గ్రహీతలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్రపతి భవన్‌లో ఏటా మార్చి లేదా ఏప్రిల్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేస్తారు.

పద్మ విభూషణ్
ములాయంసింగ్ యాదవ్ (మరణానంతరం), జాకీర్ హుస్సేన్, ఎస్ఎం కృష్ణ, ఆర్కిటెక్ట్ బాలకృష్ణ దోషీ (మరణానంతరం), ఓఆర్ఎస్ సృష్టికర్త దిలీప్ మహలనబిస్ (మరణానంతరం), ఇండో–అమెరికన్ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ వర్ధన్

పద్మభూషణ్
చినజీయర్ స్వామి (ఆధ్యాత్మిక రంగం), కుమారమంగళం బిర్లా (వాణిజ్యం, పరిశ్రమలు), వాణీ జయరాం (కళ), సుధామూర్తి (సామాజిక సేవ), కమలేష్ డి.పటేల్ (ఆధ్యాత్మిక రంగం), ఎస్ఎల్ భైరప్ప (కళ), దీపక్‌ధర్ (సైన్స్ అండ్ ఇంజనీరింగ్), సుమన్ కల్యాణ్‌పుర్ (కళ), కపిల్ కపూర్ (సాహిత్యం–విద్య)

పద్మశ్రీ
ఏపీ నుంచి: సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి (కళ), సంకురాత్రి చంద్రశేఖర్ (సామాజిక సేవ), గణేశ్ నాగప్పకృష్ణరాజనగర (సైన్స్ అండ్ ఇంజనీరింగ్), సీవీ రాజు (కళ), అబ్బారెడ్డి నాగేశ్వరరావు (సైన్స్ అండ్ ఇంజనీరింగ్), కోట సచ్చిదానంద శాస్త్రి (కళ), ప్రకాశ్ చంద్రసూద్ (సాహిత్యం–విద్య).
తెలంగాణ నుంచి: మోదడుగు విజయ్ గుప్తా (సైన్స్ అండ్ ఇంజనీరింగ్), హనుమంతరావు పసుపులేటి (వైద్యం), బి.రామకృష్ణారెడ్డి (సాహిత్యం–విద్య).

పద్మశ్రీ దక్కిన ప్రముఖుల్లో మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఖాదర్ వలీతో పాటు స్టాక్ మార్కెట్ మాంత్రికుడు రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా (మరణానంతరం), సినీ నటి రవీనా టాండన్ తదితరులున్నారు.

ఈజిప్ట్‌తో బంధం బలోపేతం

- ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు
- అధ్యక్షుడు సిసితో మోదీ భేటీ
- ఐదు ఒప్పందాలపై సంతకాలు
- పలు రంగాల్లో మరింత సహకారం
- ఐదేళ్లలో 1,200 కోట్ల డాలర్లకు ద్వైపాక్షిక వాణిజ్యం



న్యూఢిల్లీ: ఈజిప్టుతో ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భారత్ నిర్ణయించింది. గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్ సిసి (68)తో ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం సమావేశమయ్యారు. రక్షణ, భద్రత, వర్తకం రంగాలతో పాటు ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో కూడా పరస్పరం మరింతగా సహకరించుకోవాలని నేతలు నిర్ణయించారు. ముఖ్యంగా సీమాంతర ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. 700 కోట్ల డాలర్లున్న ద్వైపాక్షిక వర్తకాన్ని ఐదేళ్లలో 1,200 కోట్ల డాలర్లకు పెంచాలని నిర్ణయించారు. ఆహార, ఇంధన, ఎరువులు తదితర రంగాలపై రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ప్రభావం తదితరాలు చర్చకు వచ్చాయి. ఐటీ, సైబర్ సెక్యూరిటీ, యువత, సమాచార, సాంస్కృతిక రంగాలకు సంబంధించి ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ఐదు ఒప్పందాలు కుదిరాయి. ''ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక బంధం స్థాయికి పెంపొందించుకోవాలని భేటీలో నిర్ణయించాం. ఇరు దేశాల వ్యూహాత్మక సహకారం ఆసియా, ఆఫ్రికా ఖండాల్లో శాంతికి, ప్రగతికి బాటలు పరుస్తుంది'' అని మోదీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచమంతటా ఉగ్రవాదం పెచ్చరిల్లుతుండటంపై ఇరు దేశాలూ ఆందోళనతో ఉన్నాయి. ఇది మానవాళి భద్రతకు అతిపెద్ద సమస్యగా మారిందన్న వాస్తవాన్ని అంగీకరిస్తున్నాయి. ఉగ్రవాద భావజాల వ్యాప్తికి సైబర్ స్పేస్ దుర్వినియోగం చేస్తున్న తీరుకు అడ్డుకట్ట వేసేందుకు చేతులు కలపాలని నిర్ణయించాం'' అన్నారు. కరోనా, యుద్ధంతో దెబ్బ తిన్న ఆహార, ఫార్మా సరఫరాలను బలోపేతం చేయడంపై చర్చించామన్నారు. చర్చలు అత్యంత ఫలప్రదంగా సాగినట్టు విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వట్రా తెలిపారు.


ఇదే తొలిసారి
గణతంత్ర ఉత్సవాలకు ఈజిప్టు అధ్యక్షున్ని ఆహ్వానించడం ఇదే తొలిసారి. ఈజిప్టు సైనిక బృందం కూడా గణతంత్ర పరేడ్‌లో పాల్గొంటోంది. మూడో ఇండియా–ఆఫ్రికా ఫోరం శిఖరాగ్రంలో పాల్గొనేందుకు సిసి 2015లో తొలిసారి భారత్‌లో పర్యటించారు. తర్వాత ఏడాదికే మరోసారి పర్యటించారు.

యువతే అతిపెద్ద లబ్ధిదారులు

అభివృద్ధి చెందిన భారతదేశంలో యువతే అతిపెద్ద లబ్ధిదారులుగా మారబోతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే అతిపెద్ద బాధ్యత సైతం వారిపైనే ఉందన్నారు. గణతంత్ర పరేడ్‌లో పాల్గొననున్న ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ''అమృతకాలంలో దేశ ఆకాంక్షలు, కలలకు యువత ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నేటితరానికి ఎన్నెన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. భారతదేశం సాధిస్తున్న ఘనతల్లోనే ప్రపంచం తన భవిష్యత్తును వెతుక్కుంటోంది. జాతి లక్ష్యాలు, ఆకాంక్షలతో యువతను ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అనుసంధానిస్తున్నాయి. యువత మాట్లాడడం ప్రత్యేకమైన అనుభూతినిస్తోంది. భారత్ సారథ్యం వహిస్తున్న జి–20 కూటమి గురించి పాఠశాలలు, కళాశాలల్లో చర్చించుకోవాలి'' అని సూచించారు. స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనాలని యువతను కోరారు.

స్వలింగ సంపర్కం నేరం కాదు: పోప్

- వారిని చర్చిల్లోకి రానివ్వండి
- క్యాథలిక్ బిషప్‌లకు విజ్ఞప్తి



వాటికన్ సిటీ: స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించే చట్టాలను పోప్ ఫ్రాన్సిస్ తీవ్రంగా తప్పుబట్టారు. ''ఆ చట్టాలు పూర్తిగా అనైతికమైనవి. స్వలింగ సంపర్కం నేరం కాదు. దేవుడు తన పిల్లలందరినీ సమానంగా, బేషరతుగా ప్రేమిస్తాడు'' అని అసోసియేటెడ్ ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. ''స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణించే చట్టాలను కొందరు క్యాథలిక్ బిషప్‌లు కూడా సమర్థిస్తున్నారని నాకు తెలుసు. కానీ నా విజ్ఞప్తల్లా ఒక్కటే. స్వలింగ సంపర్కుల పట్ల కాస్త మృదువుగా వ్యవహరించాలి. వారిని కూడా చర్చిల్లోకి అనుమతించాలి. వారిని స్వాగతించి గౌరవించాలి తప్ప వివక్ష చూపి అవమానించరాదు'' అని ఆయన సూచించారు. అయితే, స్వలింగ సంపర్కం పాపమేనని పోప్ పేర్కొనడం విశేషం. ''ఇది ఒక దృక్కోణం. కాకపోతే ఈ విషయంలో సాంస్కృతిక నేపథ్యాలు తదితరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ మాటకొస్తే ఇతరులపై జాలి, దయ చూపకపోవడమూ పాపమే. కాబట్టి నేరాన్ని, పాపాన్ని విడిగానే చూడటం అలవాటు చేసుకుందాం'' అన్నారు. క్యాథలిక్ బోధనలు స్వలింగ సంపర్కాన్ని తప్పుడు చర్యగానే పేర్కొంటున్నా స్వలింగ సంపర్కులను కూడా ఇతరులతో సమానంగా గౌరవించాలని చెబుతాయి. క్యాథలిక్ చర్చి ప్రకారం స్వలింగ వివాహాలు నిషిద్ధం. దాదాపు 67 దేశాల్లో స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణిస్తున్న విషయం తెలిసిందే. వీటిలోనూ 11 దేశాల్లో ఇందుకు మరణశిక్ష కూడా విధించే ఆస్కారముందని ఈ చట్టాలను రద్దు చేయాలంటూ ఉద్యమిస్తున్న హ్యూమన్ డిగ్నిటీ ట్రస్ట్ పేర్కొంది. అమెరికాలో కూడా 12కు పైగా రాష్ట్రాలు దీన్ని నేరంగానే పరిగణిస్తున్నాయి. ఇలాంటి చట్టాలను రద్దు చేయాలని ఐక్యరాజ్యసమితి కూడా ప్రపంచ దేశాలకు ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసింది.

చర్చలకు చక్కని వేదిక

- జీ20 సారథ్యంపై రాష్ట్రపతి
- జాతినుద్దేశించి ప్రసంగం



న్యూఢిల్లీ: పెరుగుతున్న భూతాపం, పర్యావరణ మార్పు వంటి కీలక అంశాలపై చర్చకు, వాటి పరిష్కారానికి జీ20 సదస్సు సరైన వేదిక అని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభిప్రాయపడ్డారు. బుధవారం ఢిల్లీ నుంచి ఆమె భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తొలిసారిగా జాతినుద్దేశించి ప్రసంగించారు. ఆమె ఏమన్నారంటే...

- దశాబ్దాలుగా పలు పథకాల ద్వారా భారత దేశం సాధించిన సర్వతోముఖాభివృద్ధి, పౌరుల సృజనాత్మక ఆవిష్కరణల ఫలితంగా నేడు ప్రపంచం భారత్‌కు సమున్నత గౌరవం ఇస్తోంది.
- పలు దేశాల కూటములు, ప్రపంచ వేదికలపై మన జోక్యం తర్వాత దేశం పట్ల సానుకూలత పెరిగింది. ఫలితంగా దేశానికి అపార అవకాశాలు, నూతన బాధ్యతలు దక్కాయి.
- ఈ ఏడాదికి జీ20 కూటమికి అధ్యక్షత వహించడం ద్వారా మెరుగైన ప్రపంచం, భవ్య భవిష్యత్తుకు బాటలు పరిచేందుకు భారత్‌కు సువర్ణావకాశం దొరికింది. భారత నాయకత్వంలో ప్రపంచం మరింత సుస్థిరాభివృద్ధి సాధించగలదని గట్టిగా నమ్ముతున్నా.
- ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతులు జీ20 దేశాల్లోనే ఉంది. ప్రపంచ జీడీపీకి 85 శాతం ఈ దేశాలే సమకూరుస్తున్నాయి. భూతాపం, పర్యావరణ పెను మార్పులుసహా పుడమి ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై చర్చలకు, పరిష్కారానికి జీ20 చక్కని వేదిక.
- దేశాలు ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై ఎక్కువగా ఆధారపడాల్సిన తరుణమొచ్చింది. సౌర, ఎలక్ట్రిక్ విద్యుత్ సంబంధ విధాన నిర్ణయాలు అమలుచేస్తూ ఈ దిశగా వివిధ దేశాలకు భారత్ నాయకత్వ లక్షణాలను కనబరుస్తోంది. ఈ క్రమంలో సాంకేతికత బదిలీ, ఆర్థిక దన్నుతో సంపన్న దేశాలు ఆపన్న హస్తం అందించాలి.
- వివక్షాపూరిత పారిశ్రామికీకరణ విపత్తులను తెస్తుందని గాంధీజీ ఏనాడో చెప్పారు. సాంప్రదాయక జీవన విధానాల్లోని శాస్త్రీయతను అర్థంచేసుకుని పర్యావరణ అనుకూల అభివృద్ధిని సాధించాలి.
- రాజ్యాంగ నిర్మాతలు చూపిన మార్గనిర్దేశక పథంలోని మనం బాధ్యతాయుతంగా నడవాలి. రాజ్యాంగ ముసాయిదా కమిటీకి నేతృత్వం వహించిన డాక్టర్ అంబేడ్కర్‌కు మనం సదా రుణపడి ఉండాలి. ఆ కమిటీలో 15 మంది మహిళలుసహా అన్ని మతాలు, వర్గాల వారికీ ప్రాధాన్యత దక్కడం విశేషం.
- దేశంలో నవతరం విడివిడిగా, ఐక్యంగానూ తమ పూర్తి శక్తిసామర్థ్యాలను సంతరించుకునే వాతావరణం ఉండాలి. దీనికి విద్యే అసలైన పునాది. 21వ శతాబ్ది సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా నూతన జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ) రూపొందించారు. విద్యా బోధనలో సాంకేతికతను లోతుగా, విస్తృతంగా వినియోగించాలని ఎన్ఈపీ స్పష్టంచేస్తోంది.

లఖీంపూర్ ఖేరీ కేసులో మిశ్రాకు బెయిల్

న్యూఢిల్లీ: రైతులతో పాటు మొత్తం 8 మందిని బలిగొన్న లఖీంపూర్ ఖేరీ కేసులో కేంద్ర మంత్రి అజయ్ కుమార్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాకు సుప్రీంకోర్టు బుధవారం 8 వారాల మధ్యంతర బెయిలిచ్చింది. ''పాస్‌పోర్టును ట్రయల్ కోర్టుకు సమర్పించాలి. బెయిల్ సమయంలో ఉత్తరప్రదేశ్, ఢిల్లీల్లో ఉండొద్దు. ఎక్కడ ఉండేదీ ట్రయల్ కోర్టుకు, స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలపాలి. అక్కడ వారానికోసారి వ్యక్తిగతంగా హాజరై అటెండెన్స్ నమోదు చేయాలి'' అని ఆదేశించింది. సాక్షులు తదితరులను ప్రభావితం చేయకుండా ఉండేందుకే ఈ షరతు విధిస్తున్నట్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జె.కె.మహేశ్వరి ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్‌ను, అతని కుటుంబాన్ని బెదిరించేందుకు ప్రయత్నిస్తే బెయిల్ రద్దు చేస్తామని హెచ్చరించింది. మరో నలుగురు నిందితులకూ మధ్యంతర బెయిల్ ఇచ్చింది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

7

గురువారం । 26 । జనవరి । 2023



రిపబ్లిక్ కాంతులు.. విద్యుత్ ధగధగలతో మెరిసిపోతున్న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం

వేడుకకు వేళాయె

పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా



దేశం మనదే.. తేజం మనదే ఎగురుతున్న జెండా మనదే.. అంటూ ప్రతి భారతీయుడు సగర్వంగా తలెత్తుకునేలా భారత సర్వోన్నత రాజ్యాంగం అమలులోకి వచ్చి.. గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిన శుభదినం ఈ రోజు. దేశ వ్యాప్తంగా రిపబ్లిక్ డే ను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం ముస్తాబైంది. బుధవారం ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ అట్టహాసంగా జరిగాయి. శకటాలు తుదిరూపు సంతరించుకున్నాయి. పలు ప్రభుత్వ భవనాలు విద్యుత్ దీపాలంకరణలతో మెరిసిపోతున్నాయి. కృష్ణా జిల్లా స్థాయి కార్యక్రమానికి బందరు పరేడ్ గ్రౌండ్స్ సిద్ధమైంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



బందరు పరేడ్ గ్రౌండ్స్‌లో సిద్ధమైన స్టాళ్లు



త్రివర్ణశోభితంగా విజయవాడలోని ఏపీ స్టేట్ బిల్డింగ్

న్యూస్‌రీల్

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 2.10 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ. 2.10 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులు, ముడుపుల రూపంలో సమర్పించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను బుధవారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 16 రోజులకు గాను 38 హుండీల ద్వారా రూ. 2,10,31,198ల నగదుతో పాటు 393 గ్రాముల బంగారం, 4.834 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. ఇక ఈ-హుండీ ద్వారా రూ. 70,593 విరాళాలు దేవస్థానానికి భక్తులు సమర్పించారన్నారు. కానుకల లెక్కింపులో సేవా సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బారాయుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మోపిదేవి(అవనిగడ్డ): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్ కుమార్ శర్మ, ఆలయ వేదపండితులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ బ్రహ్మత్వంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉభయదేవేరులతో ఆశీనులైన సుబ్రహ్మణ్యేశ్వరుడికి వేదపండితులు పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం రాత్రి 7 గంటలకు యాగశాల ప్రవేశం, విష్వక్సేనపూజ పుణ్యాహవాచనం, రుత్విగ్వరణ, అంకురారోపణ, వాస్తుపూజ, ధ్వజారోహణ, బలిహరణ, ధ్వజపట ప్రతిష్టాపన, నీరాజన మంత్రపుష్పాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

విద్యుత్ బీసీ ఉద్యోగులకు విశాఖలో బిల్డింగ్



సాక్షి, అమరావతి: విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘానికి విశాఖలో శాశ్వత భవన నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించేలా కృషిచేస్తానని పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు హామీ ఇచ్చారు. విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 17వ డైరీని మంత్రి బుధవారం విజయవాడలో ఆవిష్కరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యుత్ కార్యాలయాల ఆవరణలో మహాత్మా జ్యోతీరావ్ పూలే విగ్రహాల స్థాపనకు, బీసీ ఉద్యోగులను కీలక పోస్టుల్లో నియమించడానికి, సాధారణ బదిలీల్లో అన్ని యూనియన్ అసోసియేషన్లతో పాటు సమానంగా బీసీ యూనియన్ నాయకులకు ట్రాన్స్‌ఫర్ నుంచి మినహాయింపు కలిగించడానికి కూడా ప్రభుత్వం ద్వారా ప్రయత్నం చేస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పరిశ వెంకటేశ్వరావు, జనరల్ సెక్రటరీ వి.అనూరాధ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేంద్రం శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ గుణవంతుడు, అడ్వయిజర్ చంద్రమౌళి, 13 ఉమ్మడి జిల్లాల కార్యవర్గ సభ్యులు, బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మీనాక్షికి శాప్ ఎండీ అభినందన

సాక్షి, అమరావతి: రాష్ట్రపతి చేతుల మీదుగా రాష్ట్రీయ బాల పురస్కార్-2023 అవార్డు అందుకున్న కోలగట్ల అలనా మీనాక్షిని శాప్ ఎండీ ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో అభినందించారు. ఆసియా నేషన్స్ కప్ చెస్ చాంపియన్‌షిప్- 2022లో అండర్-14 బాలికల జట్టులో దేశం తరపున ప్రాతినిధ్యం వహించడం, అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్ అండర్-10 విభాగంలో ప్రపంచ నంబర్ 2 ర్యాంకు సొంతం చేసుకోవడం మీనాక్షి ప్రతిభకు నిదర్శనమని తెలిపారు.

ఆటలు.. భవితకు బాటలు

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ● అట్టహాసంగా 'సాక్షి ప్రీమియర్ లీగ్' ప్రారంభం ● తొలి రోజు రెండు మ్యాచ్‌లలో హోరాహోరీ పోరు



ఆంధ్ర లయోల కళాశాల, గవర్నమెంట్ ఐటీఐ మధ్య హోరాహోరీగా సాగుతున్న మ్యాచ్



బ్యాటింగ్ చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో సాక్షి అడ్మిన్ డీజీఎం కేఎస్ అప్పన్న, బీఎం యశోదరాజు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ తదితరులు

విజయవాడ స్పోర్ట్స్: 'సాక్షి ప్రీమియర్ లీగ్'(ఎస్పీఎల్) నాల్గో సీజన్ ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి క్రికెట్ పురుషుల పోటీలు ప్రారంభమయ్యాయి. 12 జూనియర్, 27 సీనియర్ జట్లు తలపడే ఈ పోటీలను కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. పది రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో జట్లు నాకవుట్ పద్ధతిలో తలపడతాయి.

క్రీడాకారులదే ఉజ్వల భవిష్యత్తు..
క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. క్రీడా నైపుణ్యం సాధించేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు దోహదం చేస్తాయన్నారు. అంతర్జాతీయ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్న సాక్షి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో సాక్షి అడ్వర్టైజ్‌మెంట్ జీఎం బొమ్మారెడ్డి వెంకటరెడ్డి, అడ్మిన్ డీజీఎం కేఎస్ అప్పన్న, బీఎం యశోదరాజు, కృష్ణాజిల్లా క్రికెట్ అసోసియేషన్(కేడీసీఏ) అడహాక్ కమిటీ ఛైర్మన్ టి.త్రినాథరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వి.రత్నప్రసాద్ పాల్గొన్నారు.

నేటి మ్యాచ్‌లు..

1. డీజేఆర్ డిప్లొమా కాలేజీ Vs ఎస్ఆర్ జూనియర్ కాలేజీ టీం-2
2. ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ టీం-1 Vs ఎస్ఆర్ జూనియర్ కాలేజీ టీం-1
3. ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ టీం-2 బెంజిసర్కిల్ Vs పీబీ సిద్ధార్థ జూనియర్ కాలేజీ
4. కేబీఎస్ జూనియర్ కాలేజీ Vs ఆంధ్రా లయోల జూనియర్ కాలేజీ

వార్ వన్ సైడ్..

జూనియర్స్ విభాగం నిర్ణీత 10 ఓవర్ల తొలిమ్యాచ్‌లో ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ టీం-2 బెంజిసర్కిల్ జట్టు తన ప్రత్యర్థి శాతావాహన జూనియర్ కాలేజీ జట్టుపై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌ను సాక్షి జీఎం బి. వెంకటరెడ్డి టాస్ వేసి ప్రారంభించారు. టాస్ గెలిచిన శాతావాహన జట్టు బౌలింగ్ ఎంచుకోవడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఎన్ఆర్ఐ జట్టు బౌండరీల మోత మోగించింది. ఓపెనర్లు అఖిల్‌భరత్, రోహిత్ కెవిన్ 9.4 ఓవర్ వరకు భాగస్వామ్యం కొనసాగించి 103 పరుగులు భారీ స్కోర్ సాధించారు. అఖిల్‌భరత్ 39 బాల్స్‌కు తొమ్మిది ఫోర్లతో 60(నాటౌట్) పరుగులు సాధించాడు. 19 పరుగులు సాధించిన రోహిత్ మరో రెండు బంతులు మిగిలి ఉండగా రన్ అవుట్‌గా వెనుదిరిగాడు. కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన శాతావాహన బ్యాట్స్‌మెన్‌లను ఎన్ఆర్ఐ బౌలర్లు కట్టడి చేశారు. ఆల్‌రౌండర్ రోహిత్‌కెవిన్, రెహ్మాన్, ప్రణయ్ రెండు వికెట్లు చొప్పున తీశారు. దీంతో శాతావాహన జట్టు 9.3 ఓవర్లకు 53 పరుగులు మాత్రమే చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా అఖిల్ ఎంపికయ్యాడు.



విజయం సాధించిన ఎన్ఆర్ఐ కళాశాల జట్టు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అఖిల్

చివరి బంతి వరకూ పోరు..

ఆంధ్రా లయోల జూనియర్ కాలేజీ, ప్రభుత్వ ఐటీఐ కాలేజీ జట్ల మధ్య పోరు ఉత్కంఠ రేపింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఐటీఐ జట్టు నిర్ణీత పది ఓవర్లకు ఐదు వికెట్లు నష్టపోయి72 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్‌లు షణ్ముఖరామ్ 22 పరుగులతో రాణించాడు. సాధారణ లక్ష్యంతో బరిలో దిగిన లయోల జట్టు బ్యాట్స్‌మెన్‌లను కట్టడి చేసేందుకు ఐటీఐ జట్టు బౌలర్లు విశ్వప్రయత్నాలు చేశారు. తొమ్మిదో ఓవర్‌కు లయోల జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసింది. చివరి ఓవర్‌లో విజయానికి మరో తొమ్మిది రన్స్ అవసరం ఉండగా.. ఆఖరి బంతికి లయోల కాలేజీ జట్టు విజయం సాధించింది. లయోల బ్యాట్స్‌మెన్‌లు హరి 21, ఇర్ఫాన్ 17 పరుగులతో రాణించారు. ఈ మ్యాచ్‌లో నాలుగు వికెట్లు తీసిన ఐటీఐ కాలేజీ బౌలర్ ప్రవీణ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికయ్యాడు.

● ముందస్తు షెడ్యూల్ ప్రకారం మూడో మ్యాచ్‌లో ఎస్ఆర్ జూనియర్ కాలేజీ టీం-1, మిక్ డిప్లొమా కాలేజీ జట్లు తలపడాల్సి ఉంది. మిక్ కాలేజీ జట్టు గైర్హాజరు కావడంతో ఎస్ఆర్ జూనియర్ కాలేజీ జట్టును విజేతగా ప్రకటించారు.



విజేతగా నిలిచిన ఆంధ్ర లయోలా కళాశాల జట్టు



మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ ప్రవీణ్

ఓటుతోనే మెరుగైన సమాజం సాధ్యం

కృష్ణా జేసీ అపరాజితసింగ్



వృద్ధ ఓటర్లను సన్మానిస్తున్న జేసీ అపరాజితసింగ్, డీఆర్వో వెంకటేశ్వర్లు తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కృష్ణా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని 2011లో ప్రారంభించారన్నారు. ఓటు ప్రాధాన్యం గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 14,61,634 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 18 ఏళ్లు పూర్తయిన యువకులు 8,114 మంది మాత్రమే ఓటు హక్కు నమోదు చేసుకున్నారన్నారు. ఇంకా ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన వారు చాలా మంది ఉన్నారని, వారు కూడా నమోదు కావాలన్నారు. అనంతరం బాలబాలికలకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు జేసీ ప్రశంస పత్రాలను అందజేశారు. కొత్తగా నమోదైన యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులను అందించారు. ఎక్కువసార్లు ఓటు వేసిన వారిని ఘనంగా సత్కరించారు. కలెక్టరేట్‌లో ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ జి. చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఓటర్ల ప్రతిజ్ఞను జేసీ చేయించారు.

ఓటర్ల అవగాహన ర్యాలీ..
ఓటు హక్కు ప్రతి ఒక్కరు తెలుసుకునేలా అవగాహన కార్యక్రమాన్ని ర్యాలీ ద్వారా నిర్వహించారు. మచిలీపట్నంలోని లక్ష్మీటాకీస్‌సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఓటు హక్కు పొందుదాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం.. యువతా మేలుకో నీ భవిష్యత్తు మలుచుకో.. అనే నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు.

46 మంది పోలీసులకు ప్రశంస పత్రాలు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణాజిల్లా పోలీసుశాఖలో అత్యుత్తమ సేవలను అందించిన 46 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం ప్రశంస పత్రాలను ప్రకటించింది. గురువారం జిల్లా పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో జరగనున్న 74వ గణతంత్ర వేడుకల్లో వీరికి జిల్లా ఎస్పీ పి. జాషువా చేతులమీదుగా ప్రశంస పత్రాలను అందించనున్నారు.

ఊపిరికి భరోసా

● క్యూ కడుతున్న రోగులు
● ప్రతి రోజూ 150 నుంచి 200 ఓపీ
● పోస్టు కోవిడ్ దుష్ఫలితాల వారే ఎక్కువ
● ఆధునిక సాకర్యాలతో ఉత్తమ సేవలు

విజయవాడ జీజీహెచ్‌లో శ్వాసకోశ రోగులకు మెరుగైన చికిత్స

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రిలోని పల్మనాలజీ(శ్వాసకోశ వ్యాధుల వైద్యం) విభాగానికి రోగులు క్యూ కడుతున్నారు. సోమవారం నుంచి శనివారం వరకూ నిర్వహించే అవుట్ పేషెంట్స్ విభాగానికి ప్రతిరోజూ 150 నుంచి 200 మంది రోగులు వస్తున్నారు. వారిలో ఎక్కువ మంది పోస్టు కోవిడ్‌కు సంబంధించిన వారే ఉంటున్నారు. ఇక్కడ వైద్యులు అత్యుత్తమ సేవలు అందిస్తుండటంతో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచే కాకుండా ఏలూరు, గుంటూరు జిల్లాలకు చెందిన రోగులు సైతం వస్తున్నారు.

ఏఏ సమస్యలు వస్తున్నాయి..
పల్మనాలజీ విభాగానికి వస్తున్న వారిలో ఎక్కువ మంది రోగులు ఈ సమస్యలతోనే వస్తున్నారు.
● ఊపిరితిత్తులు మూసుకు పోవడం
● దీర్ఘకాలికంగా ఆస్తమా
● ఊపిరితిత్తుల్లో నీరు చేరడం
● ఎలర్జిక్ సమస్యలు ఉన్న వారు
● చుట్ట, బీడీ వంటి ధూమపానంతో వచ్చే సమస్యలకు గురైన వారే ఎక్కువగా వస్తున్నారు.

రోగికి ఉన్న సమస్యను బట్టి చెస్ట్ ఎక్స్‌రే, చెస్ట్ సీటీస్కాన్ వంటివి చేయించి వారి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేస్తున్నారు. ఇన్‌పేషెంట్లుగా చేరాల్సి వస్తే ఆస్పత్రిలో అడ్మిట్ చేస్తున్నారు. లేదంటే మందులు రాస్తున్నారు.



పల్మనాలజీ ఓపీ విభాగంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు



వార్డులో ఆధునిక సౌకర్యాలు
పల్మనాలజీ వార్డులో అత్యాధునిక సౌకర్యాలతో 35 పడకలు ఉన్నాయి. పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా వార్డులు ఉన్నాయి. అక్కడ తీవ్రమైన శ్వాస ఇబ్బందులు తలెత్తిన వారికి వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయి. ఊపిరితిత్తులు మూసుకుపోయిన వారిని పరీక్షించేందుకు స్పైరోమెట్రీ, దగ్గు ఆయాసం ఎక్కువగా ఉన్న వారిని పరీక్షించేందుకు బ్రాంకోస్కోపీ వంటి పరికరాలు ఉన్నాయి. అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉండటంతో రోగులకు మెరుగైన సేవలు అందించగలుగుతున్నారు.

నిపుణులైన వైద్యుల సేవలు
ఈ విభాగంలో ఒక అసోసియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు పనిచేస్తున్నారు. వీరితో పాటు ఆరుగురు పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు సేవలు అందిస్తుంటారు. ఇక్కడ కోవిడ్ సమయంలో విశేష సేవలు అందించిన ప్రొఫెసర్ ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో వేరొకరిని నియమించాల్సి ఉంది.

ప్రతిరోగికి మెరుగైన వైద్యం



ప్రభుత్వాస్పత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో పాటు, వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో ఉండటంతో రోగులకు సకాలంలో సేవలు అందించగలుగుతున్నారు. కోవిడ్ దుష్ఫలితాలతో రోగులు ఇంకా వస్తూనే ఉన్నారు.

–డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, సూపరింటెండెంట్, జీజీహెచ్, విజయవాడ

అంబేడ్కర్ ఆశయం జగన్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున, చిత్రంలో ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యేలు కైలే అనీల్ కుమార్, కొక్కిలిగడ్డ రక్షణనిధి, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్

రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున

పటమట(విజయవాడతూర్పు): దేశంలో వేళ్లూనుకున్న అసమానత్వాన్ని తుడిచేసేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని తీసుకొస్తే.. ఆయన ఆశయాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సాకారం చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పటమట 12వ డివిజన్‌లోని కృష్ణానగర్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో దళిత, గిరిజన, మైనార్టీ, బీసీలు అభివృద్ధి సాధిస్తున్నారన్నారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ దళిత సామాజిక వర్గాలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజలు తేడా గమనించాలి..
వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, పామర్రు ఎమ్మెల్యే కైలే అనీల్‌కుమార్ మాట్లాడుతూ దళితులుగా ఎవరు పుట్టాలని కోరుకుంటారని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు దళిత సామాజికవర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే.. దళితులందరూ నా రక్తసంబంధీకులని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించి, అధికార పీఠంపై కూర్చోబెట్టారన్నారు. చంద్రబాబు దత్తపుత్రుడు ఎస్సీల పథకాల గురించి, సబ్‌ప్లాన్ గురించి అవగాహన రాహిత్యంగా మాట్లాడుతున్నారని, చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్టు మినహా ఏఒక్క అంశాన్ని కూడా తాను సొంతంగా మాట్లాడలేని పవన్ కళ్యాణ్ దళితుల గురించి మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, ఎస్సీ కమిషన్ సభ్యులు కాలేపుల్లారావు, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి ఉప్పులేటి దేవీప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం



సాక్షి, అమరావతి: విద్యుత్ సంస్థల ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ డైరీని విజయవాడలో మంత్రి బుధవారం ఆవిష్కరించారు. రాష్ట్ర విద్యుత్ రంగానికి జాతీయ స్థాయిలో ఇటీవల ఆరు అవార్డులు లభించాయని, ఈ ఘనతను సాధించడం వెనుక ఉద్యోగుల కృషి ఉందన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.మహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.మల్లికార్జున, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ డీపీ వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలాజీ, ఏపీఈపీడీసీఎల్ డిస్కం సెక్రటరీ లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని బాలుడి మృతి



షేక్ అమీర్(ఫైల్)

గుడివాడరూరల్: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొని బాలుడు మృతి చెందిన ఘటన గుడివాడలో బుధవారం రాత్రి జరిగింది. 12వ వార్డు యానాదుల కాలనీలో ఇంటి వద్ద ఆడుకుంటున్న షేక్ అమీర్ (3) అటువైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడు తండ్రి షేక్ కాలేషా లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బాలుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



గన్నవరం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సుందరంగా అలంకరించారు. ట్రాన్సిట్ టెర్మినల్‌తో పాటు గార్డెన్‌ను త్రివర్ణ పతాక రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

మూడు ద్విచక్ర వాహనాలు దగ్ధం



అగ్నికి ఆహుతైన ద్విచక్ర వాహనాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఇంటి ముందు పార్కింగ్ చేసిన మూడు ద్విచక్ర వాహనాలు దగ్ధమైన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. కృష్ణలంక, బాలాజీనగర్‌లోని బాలుడు చిమ్మన్న వీధికి చెందిన చోడిశెట్టి కిరణ్‌కుమార్ తన ద్విచక్ర వాహనాన్ని మంగళవారం రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. అతని ఇంటిలో అద్దెకు ఉంటున్న వాత్సవాయి మౌనిక, దాసరి దుర్గాప్రసాద్, దాసరి సంధ్యాదేవి కూడా వారి ద్విచక్ర వాహనాలను ఆ పక్కనే పార్కింగ్ చేశారు. బుధవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఆగంతకుడు ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాల్లో నుంచి పెట్రోల్ తీసేసి వాటిపై పోసి నిప్పంటించాడు. ఆ సమయంలో పెద్ద శబ్దం రావడంతో కిరణ్‌కుమార్ బయటకు వచ్చి చూడగా తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనాలు మంటల్లో కాలిపోతూ కనిపించాయి. చుట్టుపక్కల వారి సాయంతో నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. అప్పటికే మూడు వాహనాలు పూర్తిగా దగ్ధమవగా, మరొక వాహనం స్వల్పంగా కాలిపోయింది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. సమీపంలోని సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించి వాహనాలకు నిప్పంటించిన ఆగంతకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ధాన్యం కొనుగోలులో మిల్లర్ల పాత్ర లేదు

ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లా రైతులకు జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్‌అజయ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పలు సూచనలు చేశారు. ఆర్‌బీకే ఎఫ్‌టీఓ పొందిన తర్వాత రైతులు మిల్లలకు వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు నిమిత్తం రైతుకు చెల్లించాల్సిన ధరను, ఎఫ్‌టీఓలో నమోదుచేసిన తేమ, ఇతర నాణ్యత ప్రమాణాల ప్రకారం మాత్రమే నిర్ణయిస్తారని తెలిపారు. తూకం, తేమ శాతం లేదా ఇతర నాణ్యతా ప్రమాణాల నిర్ధారణ విషయంలో మిల్లర్లకు ఎటువంటి పాత్రా లేదన్నారు. మిల్లర్లు తరుగు కింద ధాన్యం తగ్గించినా, రైతు నుంచి డబ్బు డిమాండ్ చేసిన లేదా ఇతరత్రా విషయాలపై ఫిర్యాదు చేయాలన్నా, టోల్ ఫ్రీ నంబర్ 1967 ను వినియోగించుకోవాలని సూచించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కృష్ణానది ఒడ్డున పిండాల ఘాట్ వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం వెలుగుచూసింది. కృష్ణానది నీటిలో మహిళ మృత దేహం ఉందని స్థానికులు వీఆర్వో బేబీకి సమాచారం ఇచ్చారు. వీఆర్వో ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి వయసు 40 నుంచి 50 ఏళ్లలోపు ఉంటుందని భావిస్తున్నారు. ఒంటిపై బ్లూ కలర్ చీర, జాకెట్, చేతికి ఎరుపు రంగు గాజులు ఉన్నాయి. ఈ ఘటనపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కేంద్ర ప్రభుత్వం ఏపీని ఆదర్శంగా తీసుకోవాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఎంపీ కృష్ణయ్య. చిత్రంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ పోతుల సునీత

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య సూచించారు. విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో 'హలో బీసీ.. చలో విజయవాడ' పేరిట బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. బీసీల డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 8, 9 తేదీల్లో పార్లమెంట్ ఎదుట నిరసన కార్యక్రమం తలపెట్టామని తెలిపారు. ఏపీలో బీసీ కులాలకు చెందిన విద్యార్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల స్కూళ్లు, కళాశాలల్లో చక్కగా చదువుకుంటున్నారని చెప్పారు.

బీసీ బిల్లు పెట్టిందే ఏపీ

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో బీసీ కులాలకు చెందిన వారు ముఖ్యమంత్రులు అయ్యారని, కానీ.. వారు పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టలేదని కృష్ణయ్య చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టించారని గుర్తు చేశారు. గతంలో పాలించిన టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఎందుకు ప్రవేశపెట్టలేదని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలను కుటుంబ సభ్యుల మాదిరిగా చూస్తున్నారని, మిగిలిన పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గానే చూస్తున్నాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోకపోతే ఇప్పుడు అమలవుతున్న పథకాలన్నీ రద్దవుతాయన్నారు. కేంద్రం బీసీల కోసం ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కావాలని వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో పోరాడతామన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలు ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలతో నేరుగా బంధం ఏర్పడిందని, దానిని ఎవరూ విడదీయలేరని అన్నారు. చంద్రబాబు హయాంలో మన రాష్ట్రం విద్యా విషయాల్లో 14వ స్థానంలో ఉండేదని, వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రెండో స్థానంలోకి వచ్చిందని చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం ఏపీ కన్వీనర్ బోను దుర్గానరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఎమ్మెల్సీ పోతుల సునీత, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న సిసోడియా

సాక్షి ప్రతినిధి, విజయవాడ: గణతంత్ర వేడుకలకు విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం సుందరంగా ముస్తాబైంది. స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా బుధవారం పరిశీలించారు. సిసోడియాకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, రాష్ట్ర ప్రొటోకాల్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యరెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాతీయ పతాక ఆవిష్కరణ, సాయుధ దళాల గౌరవ వందనం, శకటాల ప్రదర్శన, గవర్నర్ ప్రసంగం ఉత్తమ శకటాలకు బహుమతులు తదితర అంశాలతో కూడిన రిహార్సల్ పరిశీలించారు. పూర్తి స్థాయి రిహార్సల్స్ లో పాల్గొన్న సిసోడియా అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. పొరపాట్లకు ఆస్కారమివ్వకుండా కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని అక్కడున్న అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమానికి హాజరయ్యే సాధరణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒడిశా రాష్ట్ర ప్రత్యేక దళం ఈ ఏడాది కవాతుతో పాల్గొంటుందన్నారు. జిల్లా సంయుక్త పాలనాధికారి నుపూర్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, గవర్నర్ ఏడీసీలు దీపక్‌శర్మ, ఈశ్వరరావు సీసోడియా వెంట ఉన్నారు.

మాజీ ఎంపీ కేపీ రెడ్డయ్య అందరివాడు



రెడ్డయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ బాలశౌరి



ఎమ్మెల్యే పార్థసారధిని పరామర్శిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు

ఎంపీ వల్లభనేని బాలశౌరి

కారకంపాడు(మొవ్వ): మాజీ ఎంపీ కొలుసు పెద రెడ్డయ్య అందరి వాడని బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల వారు కూడా రాజకీయాలకు అర్హులని ఆయన నిరూపించి, నేటి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. మారుమాల గ్రామంలో జన్మించి ఢిల్లీ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడు రెడ్డయ్య అని పలువురు నాయకులు పేర్కొన్నారు. కేపీ రెడ్డయ్య స్వగ్రామమైన మొవ్వ మండలం కారకంపాడులోని ఆయన స్వగృహంలో బుధవారం పెద్దకర్మ, సంస్మరణ కార్యక్రమాలు జరిగాయి. రెడ్డయ్య కుమారులు పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, కొలుసు వీర వెంకట సుబ్బారావు, కొలుసు కృష్ణకాంత్ యాదవ్ శాస్త్రోక్తంగా కర్మకాండలు నిర్వహించారు. రెడ్డియ్య కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పరామర్శించారు. మంత్రులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, జోగి రమేష్, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కైలే అనిల్‌కుమార్, కొక్కిలిగడ్డ రక్షణనిధి, వల్లభనేని వంశీమోహన్, దూలం నాగేశ్వరరావు, సింహాద్రి రమేష్, వసంత వెంకట కృష్ణ ప్రసాద్, బుర్రా మధుసూదన్ యాదవ్, కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ పి.జాషువా, వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు ఎం.వి.ఎస్.నాగిరెడ్డి తదితరులు పాల్గొని కేపీ రెడ్డయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తైక్వాండో రాష్ట్ర జట్టు ఎంపిక



తైక్వాండో జూనియర్ రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్స్: జాతీయ తైక్వాండో జూనియర్ బాలబాలికల పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి పి.అచ్యుత్‌రెడ్డి తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను రాష్ట్ర జట్లకు ఎంపిక చేశామన్నారు. బాలుర జట్టుకు మహ్మద్ ఆసీక్, యోన, అమర్‌నాథ్, దిలీప్, విష్ణుమూర్తి, నయీమ్, విక్రమ్, చైతన్యఆదిత్య, చరణ్‌తేజ, దర్శిల్, బాలికల జట్టుకు బాలసత్యవతి, అయేష, శేతశ్రీ, జుబేద, శ్వేత, సాయిప్రీతి, కీర్తన, కణజ్యోష్న, పర్ణిక, అమృతవర్షిణి ఎంపికయ్యారని, ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలిలో జరిగే జాతీయ పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని అన్నారు. ఈ జట్లకు కోచ్, మేనేజర్‌గా ఎస్.నయబ్‌రసూల్, ఎస్.అబ్దుల్‌మజాద్ వ్యవహరిస్తున్నారన్నారు. జట్లకు ఎంపికైన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) తైక్వాండో కోచ్ పసుపులేటి గౌరీశంకర్ అభినందించారు.

వైఎస్సార్ హెల్త్ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ బాల్ బ్యాడ్మింటన్ మహిళల పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయ క్రీడా విభాగం కార్యదర్శి డాక్టర్ ఇ.త్రిమూర్తి తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన బి.జ్యోతిక, పి.అమూల్య, ఎన్. శ్రీశ్రేత, టి.సిరి, ఎన్.రాజేశ్వరి, ఎ.ప్రవల్లిక జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు చెన్నైలోని బి.ఎస్.అబ్దుల్ రెహ్మాన్ క్రెసెంట్ యూనివర్శిటీలో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు.

28న అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక

ఏపీ సీఎం కప్ అథ్లెటిక్స్ స్త్రీ, పురుషుల రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను ఈ నెల 28వ తేదీన ఎంపిక చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎస్.ఎ.అజీజ్ తెలిపారు. విజయవాడలోని ఆంధ్రా లయోల కాలేజీ మైదానంలో ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు జట్ల ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయన్నారు. లాంగ్‌జంప్, హైజంప్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, 100, 200, 400, 800 మీటర్ల రన్నింగ్, 100x100, 400x400 రిలే క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. 18 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులు ఈ ఎంపిక పోటీలకు అర్హులని, ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆరోజు మధ్నాహ్నం మూడు గంటలకు ఎంపిక ప్రాంగణంలో సంప్రదించాలని సూచించారు.

బీచ్ సాకర్ రాష్ట్ర జట్టు ఎంపిక

బీచ్ సాకర్ హీరో జాతీయ పురుషుల చాంపియన్‌షిప్‌కు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన సి.హెచ్. ఆకాష్‌మనోహర్, రెడ్డి నరేంద్ర, ఎస్.ధనుష్, ఎం.శ్రీహరి, టి.రోషన్, కె.మహేష్, ఎం. లోకేష్, కె.నవీన్, ఎ.అవినాష్, దీపక్‌చందు, ఎండీ.అజీజ్, సి.హెచ్.మధు, రాహుల్, పి. శామ్యూల్‌రాజ్, దిలీప్‌ను జట్టుకు ఎంపిక చేశామన్నారు. ఈ నెల 26 నుంచి గుజరాత్‌లోని సూరత్ డుమాస్ బీచ్‌లో జరిగే పోటీల్లో జట్టు పాల్గొంటుందన్నారు. గ్రూప్ సీలో చోటు దక్కించుకున్న రాష్ట్ర జట్టు తొలి లీగ్ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ జట్టుతో, రెండో లీగ్ మ్యాచ్‌లో మిజోరాంతో, మూడో లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీతో రాష్ట్ర జట్టు తలపడుతుందన్నారు.

కొణకంచికే సొంతమైన విజయస్థూపాలు

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో పెనుగంచిప్రోలు మండలంలోని కొణకంచి గ్రామానికి గొప్ప చరిత్ర ఉంది. ఈ గ్రామం కేంద్రంగా జాతీయోద్యమం ఉధృతంగా సాగింది. గ్రామంలోని జాతీయోద్యమ విజయ స్థూపాలు నేటి తరంలో ఉద్యమ స్ఫూర్తిని నింపుతున్నాయి. 1948లో గ్రామం మధ్యలో 46 అడుగుల విజయ స్థూపం, 1950లో రిపబ్లిక్ డే చిహ్నంగా 18 అడుగుల స్థూపాన్ని నిర్మించారు. ఈ స్థూపాలు ఒక్క కొణకంచిలోనే కనిపిస్తాయి.



46 అడుగుల స్వాతంత్ర్యోద్యమ విజయస్థూపం



18 అడుగుల రిపబ్లిక్ డే స్థూపం

సిటీ ఆర్మ్‌డ్ ఆర్ఐ సూర్యనారాయణకు పోలీస్ మెడల్



ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికైన సూర్యనారాయణను అభినందిస్తున్న సీపీ రాణా

విజయవాడ స్పోర్ట్స్: ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్ సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.సూర్యనారాయణను వరించింది. విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మ్‌డ్ ఆర్ఐగా చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయన్ను 2023 ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక చేసింది. 1998లో కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరిన సూర్యనారాయణ 2008లో ఆర్ఎస్ఐగా, 2017లో సీఐగా ఉద్యోగోన్నతులు పొంది పలు ప్రాంతాల్లో సేవలందించారు. పోలీస్ శాఖ ద్వారా ఆయన చేసిన సేవలకు గానూ ఇప్పటి వరకు 149 అవార్డులు, రివార్డులను అందుకున్నారు. ఈ ఏడాది ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికైన సూర్యనారాయణను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బుధవారం అభినందించారు.

క్లుప్తంగా

సంక్రాంతి ఆదాయం రూ.35.40 లక్షలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): సంక్రాంతి పండుగకు ఆటోనగర్ ఆర్టీసీ డిపోకు రూ.35.40 లక్షల ఆదాయం వచ్చిందని డిపో డీఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రత్యేకంగా 94 సర్వీస్‌లను నడిపామన్నారు. ఈ సర్వీసుల ద్వారా మొత్తం 8,976 మంది వివిధ ప్రాంతాలకు ప్రయాణించారని.. ఇందుకు గాను 82 వేల కిలోమీటర్లు బస్సులు తిరిగాయని చెప్పారు. ఆదాయానికి సహకరించిన ఆర్టీసీ సిబ్బందికి డీఎం కృతజ్ఞతలు తెలిపారు.

గణతంత్ర వేడుకలు, తేనీటి విందుకు బందోబస్తు



విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగే గణతంత్ర వేడుకలు, రాజ్ భవన్‌లో జరిగే తేనీటి విందు కార్యక్రమాలకు 1,600 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. ఈ రెండు ప్రాంతాలను బుధవారం పరిశీలించిన అడిషనల్ డీజీలు రవిశంకర్‌అయ్యర్, డాక్టర్ శంకబ్రటబగ్చిలకు బందోబస్తు వివరాలను సీపీ రాణా వివరించారు. గణతంత్ర వేడుకలకు ఈ ఏడాది 400 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండానే వాహన రాకపోకలు దారి మళ్లిస్తున్నామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పూర్తి భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపార

నేడు మాంసం విక్రయాలు బంద్

పటమట(విజయవాడతూర్పు): గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం నగర వ్యాప్తంగా మాంసం విక్రయాలు బంద్ చేస్తున్నామని, కబేళా కూడా మూసేస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని అన్ని చికెన్, మటన్ షాపులు, చేపల మార్కెట్లు అన్నింటికీ సెలవు ప్రకటించామన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

లైంగిక వేధింపుల కేసులో ఇద్దరి అరెస్ట్

ఆటోనగర్(విజయవాడతూర్పు): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను పటమట పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం పటమట తోటావారివీధిలో నివాసముండే బాలికను అదే ప్రాంతానికి చెందిన సలీం అనే యువకుడు గతేడాది నవంబర్‌లో బాలికకు మాయమాటలు చెప్పి భూమిక అనే మహిళ సహకారంతో తన నివాసానికి తీసుకువెళ్లి పలు మార్లు లైంగిక వేధింపులకు గురిచేశాడు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితులు బుధవారం తోటవారివీధిలో ఉన్నట్లు సమాచారం అందటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుణదల(విజయవాడతూర్పు): ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ఇద్దరు మహిళలు గాయపడిన సంఘటన మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని రమేష్ ఆస్పత్రి సమీపంలో బుధవారం సాయంత్రం జరిగింది. మాచవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రామలింగేశ్వరనగర్‌కు చెందిన మర్లపాటి ప్రియాంక (27), గాయత్రినగర్‌కు చెందిన మోటమర్రి సుధారాణి (44) ఇద్దరు రింగ్ రోడ్డు సమీపంలోని రమేష్ ఆస్పత్రి వద్ద రోడ్డుపై నడచి వెళుతున్నారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనం వేగంగా వచ్చి వీరిని ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు రోడ్డుపై పడి గాయాలపాలయ్యారు. ఇది గమనించిన స్థానికులు మహిళలను 108 సహాయంతో సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి కారణమైన వ్యక్తిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న రూరల్ పోలీసు స్టేషన్ పరిధి రాధానగర్‌కు చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాది షేక్ మహ్మద్ అలీ తండ్రి, మృతుడు షేక్ బాబు(52) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద ఉంటున్నాడన్నారు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో బెడ్ రూమ్‌లో ఫ్యానుకు చీరతో ఉరివేసుకొని వేలాడుతున్నట్లు మృతుడి భార్య చూసిందన్నారు. మృతుడి కుమారుడు మహ్మద్ అలీ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచేలా పాలన

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటున్న దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్ దుర్గ తదితరులు

పటమట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పాలన అందిస్తున్నారని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 14వ డివిజన్, 61వ సచివాలయం పరిధిలోని పుట్ట రోడ్డు ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలకు అందుతున్న సంక్షేమ లబ్ధి వివరాల కరపత్రాలను అవినాష్ అందించారు.

రూ.40 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లక్షల్లో లబ్ధి చేకూరిందన్నారు. గడప గడపకు వస్తున్న తమ పార్టీ నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పడుతూ మంగళ హారతులతో స్వాగతం పలుకుతుండటం సంతోషమని చెప్పారు. ఇటీవలే 14వ డివిజన్‌లో రూ.40 లక్షల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశామని, త్వరలోనే ఆ పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రతిపక్ష టీడీపీ అనుకూల మీడియా, సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తూ, నారా లోకేష్ పాదయాత్రకు ప్రభుత్వం భయపడుతుందనే ప్రచారం చేస్తున్నారని లోకేష్ పాదయాత్రలపై ఆ పార్టీ అధినాయకత్వానికే నమ్మకంలేదని, దీనిపై ప్రభుత్వం ఎందుకు పట్టించుకుంటుంది అని ఎద్దేవా చేశారు. నాడు వైఎస్సార్, జగన్ చేసిన పాదయాత్రలు చరిత్ర లో నిలిచిపోయాయని, టీడీపీ నాయకులు తలకిందులుగా తపస్సు చేసిన లోకేష్‌కు ఆ ఆదరణ రాదని విమర్శించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు అవినాష్ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 14వ డివిజన్ కార్పొరేటర్ చింతల సాంబయ్య, డివిజన్ అధ్యక్షుడు కెటికం దుర్గాప్రసాద్, నాయకులు బాలాజీ, మేఘ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు .

పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చాలి

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు పారిశుద్ధ్య సమస్యను తెలుపుతున్న మహిళ

భవానీపురం(విజయవాడపశ్చిమ)/పటమట(విజయవాడతూర్పు): డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని మెరుగుపరచాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం అధికారులతో కలిసి సర్కిల్–1 పరిధిలో గల 44, 51 డివిజన్లలోని విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్, వాగు సెంటర్, నెహ్రూ బొమ్మ సెంటర్ తదితర వీధులు, కొండ ప్రాంతంలో పర్యటించారు. ఆయా డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ విధానం, స్థానిక సమస్యలను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొండ ప్రాంత వాసులకు రోడ్లు, డ్రెయిన్లు, మెట్లు, తాగునీటి సరఫరా తదితర వసతులపై ఆరా తీశారు. స్థానికులు ఇకపై చెత్తాచెదారం కాలువల్లో పడేయకుండా చూడాలని అధికారులకు సూచించారు. డివిజన్‌లో పరిసరాలు పరిశుభ్రంగా తీర్చిదిద్దటంతో పాటు మెట్ల మార్గంలోగల వాటర్ పైప్‌లైన్లను కాంక్రీట్‌తో మూసివేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అనంతరం ఆయన 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్‌తో కలిసి కొత్తపేట కేటీరోడ్‌లో పూర్తి చేసిన సీసీ రోడ్డును పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ఇతర ఐఏఎస్ అధికారులు హాజరు కానున్న దృష్ట్యా అక్కడ ఏర్పాట్ల పురోగతిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పలు ఆదేశాలు ఇచ్చారు. కళాక్షేత్రం ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా ఏర్పాటు చేసిన మొక్కలను పరిశీలించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ పర్యటనలో కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, జోనల్ కమిషనర్–1 కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సూర్యనారాయణమూర్తి, శానిటరీ సూపర్‌వైజర్ ఓబేశ్వరరావు, శానిటరీ ఇనస్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారి పరిశీలన

నగర పరిశుభ్రతలో భాగంగా పరిసరాల పరిశుభ్రతతో పాటు మురుగు కాల్వల నిర్వహణ కూడా సక్రమంగా జరగాలని స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్), కె.సత్యవతి, మలేరియా–6 పరిధిలోని గాంధీనగర్ సత్యనారాయణపురం ఏరియాలో పర్యటించి మురుగు కాలువల నిర్వహణ గురించి సూచనలు చేశారు. నూతన నిర్మాణాలు జరిగే ప్రదేశాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు డ్రెయిన్లలో పడి మురుగునీరు పారుదలకు ఆటంకంగా మారుతున్నాయన్నారు. భవన నిర్మాణ యజమానులతో సంప్రదించి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో బయాలజిస్ట్ సూర్యకుమార్, మలేరియా ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



లయోల కాలేజీలో మాట్లాడుతున్న సరస్వతిరాజు అయ్యర్

గుణదల(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా రాజ్యాంగ బద్ధంగా మన నేతలను మనమే ఎన్నుకోవచ్చని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సోషియాలజీ, సోషల్ వర్క్ డీన్ సరస్వతిరాజు అయ్యర్ అన్నారు. ఆంధ్రలయోల కళాశాలలో ఓటర్ల దినోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో ఓటు అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ఓటు ద్వారానే మన భవిష్యత్‌ను మనమే నిర్ణయించుకోవచ్చని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా యువతరం ఓటుపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో లయోల కళాశాల పూర్వపు రెక్టర్ ఫాదర్ సెబాస్టియన్, కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ అనిల్ కుమార్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి శామ్యూల్ దయాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధార్థలో వేడుకలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మాగాంధీ రోడ్డులోని శ్రీ దుర్గామల్లేశ్వర మహిళా కళాశాలలో వేడుకలు నిర్వహించారు. ఆ కళాశాల రాజనీతి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.కల్పన మాట్లాడుతూ.. దేశ భవిత యువతపై ఆధారపడి ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదై, సమర్థవంతమైన ప్రభుత్వం ఎన్నుకోవడంలో భాగస్వాములు కావాలన్నారు. సదస్సులో కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి, రాజనీతి విభాగాధిపతి జి.పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను సత్కరించారు.

విలేజి కండ్రికలో సిమెంటు రోడ్డు నిర్మాణం

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరపాలక సంస్థ 64వ డివిజన్‌కు మంజూరు చేసిన లక్షా 20 వేల రూపాయల నిధులతో విలేజి కండ్రికలో సిమెంటు రోడ్డు నిర్మాణం పనులు బుధవారం చేపట్టారు. కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వీఎంసీ డివిజన్‌కు 20 లక్షల రూపాయలను మంజూరు చేసిందని, వాటితో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రోడ్డు నిర్మాణం పనులను ఇంజినీరింగ్ అధికారులు సైతం పరిశీలించారు.



జీజీహెచ్‌లో మహిళా సిబ్బందికి పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నిత్యం రోగులకు వైద్యసేవలు అందించడంలో బిజీగా ఉండే మహిళా వైద్య ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవానికి పురస్కరించుకుని పలు రకాల పోటీలు నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో అన్ని కేడర్ల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, కబడ్డీ, టెన్నీస్ వంటి పలు పోటీల్లో మహిళా సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. నిత్యం పని వత్తిడిలో ఉండే సిబ్బందికి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించామన్నారు. వృత్తితో పాటు, వారిలోని నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఇదొక వేదికగా పేర్కొన్నారు. ఆయా క్రీడల్లో సిబ్బంది ఎంతో ప్రతిభను కనబర్చారని ఆమె తెలిపారు. పోటీల్లో విజేతలకు రిపబ్లిక్ డే రోజున బహుమతులు అందజేస్తామన్నారు. పోటీలను రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యు.శోభ, అసిస్టెంట్ డైరెక్టర్ కె.విజయలక్ష్మి తదితరులు పర్యవేక్షించారు.



● గణతంత్ర వెలుగులు

గణతంత్ర వేడుకలకు నగరం ముస్తాబైంది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, హోటల్స్, పార్కులను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.



విద్యుత్ వెలుగులో రైల్వే స్టేషన్

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ కేఎస్ఎస్ ప్రసాద్ ఫౌండేషన్, మాంటిస్సోరి ఓల్డ్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. సూర్యారావు పేటలోని ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ చైర్మన్ కిలారు స్వప్న మాట్లాడుతూ.. ఈచ్ వన్ హెల్ప్ వన్ అనే ఆశయంతో 2004లో కేఎస్ఎస్ ప్రసాద్ రూ.కోటి వ్యయంతో ఫౌండేషన్‌ను స్థాపించారన్నారు. తనతో కలిసి చదువుకున్న మిత్రులతో కలిసి మాంటిస్సోరి ఓల్డ్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్(ఎంఓఎస్‌టీ)పేరుతో రూ.1.09 కోట్ల మూలధనంతో మరో ట్రస్ట్‌ను 2012లో స్థాపించారన్నారు. ఆనాటి నుంచి ప్రతి ఏటా స్కాలర్‌షిప్‌లు అంజేస్తున్నామని చెప్పారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేఎస్ఎస్ మరణానంతరం ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తున్నామన్నారు. జనవరి 25న ప్రసాద్ జయంతి రోజున విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందులో భాగం కేఎస్ఎస్ ఫౌండేషన్, మాంటిస్సోరి ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్ట్ తరఫున 38 మంది విద్యార్థులకు రూ7.80 లక్షలు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో మాంటిస్సోరి ఓల్డ్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని రంగప్రసాద్, సెక్రటరీ డాక్టర్ జాస్తి విజయకృష్ణ, జయరామ్, సి.రమేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



పటమట 12వ డివిజన్‌లోని కృష్ణానగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ బుధవారం రాత్రి జరిగింది. మంత్రి మేరుగ నాగార్జున, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, కొక్కిలిగడ్డ రక్షణనిధి, వైఎస్సార్ సీపీ నేతలు దేవినేని అవినాష్, బొప్పన భవకుమార్, స్థానిక నాయకులు పాల్గొని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.

ఏఎంసీ బలోపేతానికి కృషి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగరంలో ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) బలోపేతానికి సభ్యులంతా కృషి చేయాలని ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. ఆ కమిటీ నగర యూత్ ప్రధాన కార్యదర్శిగా పూర్ణానందంపేటకు చెందిన షేక్ గౌస్‌బాషాను ఎంపిక చేశారు. దీనికి సంబంధించిన నియామకపత్రాన్ని సింగ్‌నగర్‌లోని ఏఎంసీ కార్యాలయంలో బుధవారం ఆయన గౌస్‌భాషాకు అందజేశారు. ఏఎంసీ నాయకులు ఎండీ కాలేషా, ఎండీ హాఫ్, సయ్యద్ మౌలాలి, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

భవానీ ద్వీపంలో ఉత్సాహంగా ఎకో వాక్



భవానీ ద్వీపంలో వాకింగ్ చేస్తున్న సందర్శకులు



బోటులో వెళ్తున్న పర్యాటకులు



సెల్ఫీ తీసుకుంటున్న పర్యాటకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నూతన ఏడాది నుంచి వరుసగా నిర్వహిస్తున్న ఈవెంట్లతో పర్యాటకులు, సందర్శకులు ఆకర్షితులు కావడంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖలో నూతనోత్సాహం నెలకొంది. అదే స్ఫూర్తితో జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం విజయవాడ భవానీ ద్వీపంలో పర్యావరణ పర్యాటకంలో భాగంగా ఏర్పాటు చేసిన 'ఎకో వాక్' వాకర్స్‌ను విశేషంగా ఆకట్టుకుంది. కృష్ణానది తీరాన ఆహ్లాదకరమైన పచ్చని పరిసరాల నడుమ ఉత్సాహభరితంగా సాగిన 'ఎకో వాక్'ను వాకర్స్ అసోసియేషన్ నిర్వహించగా విజయవాడ అడ్వంచర్ క్లబ్, సన్‌రైజ్ వాకర్స్ లయోలా కళాశాల, సన్‌రైజ్ వాకర్స్ క్లబ్, లయన్స్ క్లబ్, వైహెచ్ఏఐ సభ్యులు ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ టూరిజం అథారిటీ ఎండీ, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈఓ కె.కన్నబాబు మాట్లాడుతూ పర్యాటకులను ఆకర్షించే విధంగా పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియ చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక శాఖ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ టూరిజ ఆధ్వర్యంలో భవానీ ద్వీపంలో నిర్వహించిన ఎకో వాక్ అద్భుతంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం అథారిటీ డెప్యూటీ సీఈఓ వి.రాముడు, భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బలరాంరెడ్డి పాల్గొన్నారు. కాగా జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా విశాఖ బీచ్‌లో వాక్‌ను జేసీ విశ్వనాథన్, టూరిజం రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్ ప్రారంభించారు. నెల్లూరులోని మైపాడు బీచ్‌లో బీచ్ క్లీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏలూరు, పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశం, అన్నమయ్య జిల్లాల్లో ఎకో వాక్స్, 3కె రన్, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

క్లుప్తంగా...

రూ.రెండు వేల కోట్లు ఇచ్చినా అసెంబ్లీ కూడా కట్టలేదు

చంద్రబాబు తీరుపై బీజేపీ ఆగ్రహం

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన అనంతరం 2014లో కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు తన చేతగాని పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారని బీజేపీ ఆరోపించింది. పార్లమెంట్ కొత్త భవనాన్ని ప్రధాని మోదీ రూ.వెయ్యి కోట్లతో కొద్దినెలల వ్యవధిలోనే నిర్మాణం పూర్తి చేస్తే.. కేంద్రం నుంచి రూ.2 వేల కోట్లు తీసుకున్న చంద్రబాబు కనీసం శాసనసభకు శాశ్వత నిర్మాణం పూర్తి చేయలేదని విమర్శించింది. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఈ కారణంగా రాష్ట్రంలో ఇప్పుడు మూడు రాజధానుల అంశం తెరపైకి వచ్చిందన్నారు. వివిధ సందర్భాల్లో తెలుగుదేశం పార్టీ రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పదులకొద్దీ ప్రజలు మరణించినా ఆ పార్టీలో ఎటువంటి మార్పు లేకుండా అదే తరహాలో కార్యక్రమాలు కొనసాగించడం వల్లే ప్రభుత్వం అప్రజాస్వామిక జీవో నంబరు 1 తీసుకొచ్చిందని విమర్శించారు. మూడు దశాబ్దాలు రాష్ట్రంలో వివిధ కారణాల వల్ల పొత్తులు పెట్టుకుని బీజేపీ నష్టపోయిందని వ్యాఖ్యానించారు.

లైంగిక వేధింపులపై రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్

సాక్షి, అమరావతి: కర్నూలు జిల్లా డోన్‌లో టీడీపీ నేత లైంగిక వేధింపులపై రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. టీడీపీ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు గోడి అరుణ మీడియా ముందు వెల్లడించిన అంశాలపై రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కర్రి జయశ్రీరెడ్డి ఆరా తీశారు. పోలీస్ అధికారులతో మాట్లాడి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సీబీఐ నోటీసులు

పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి విచారణకు హాజరు కావాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సీబీఐ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 24వ తేదీన హైదరాబాద్‌లోని సీబీఐ కార్యాలయానికి రావాలని మొదటిసారి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సీబీఐ అధికారులు నోటీసులిచ్చారు. అయితే జిల్లాలో ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాల వల్ల హాజరు కాలేనని, నాలుగు రోజులు సమయం కావాలని వైఎస్ అవినాష్‌రెడ్డి సీబీఐ అధికారులకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు కడప నుంచి సీబీఐ అధికారులు పులివెందులలోని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఇంటికి వచ్చారు. ఈ నెల 28న హైదరాబాద్‌లోని సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలంటూ నోటీసులు తెచ్చారు. ఇంట్లో ఎంపీ అందుబాటులో లేకపోవడంతో ఆయన తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డికి ఆ నోటీసులు అందజేసినట్లు తెలుస్తోంది.

గళం పేరుతో గరళం

- లోకేశ్‌ను ప్రజలు నిలదీస్తారనే రాద్ధాంతం : ఎమ్మెల్సీ తలశిల
- నాడు సుప్రీం తీర్పునకు లోబడి 30 షరతులతో వైఎస్ జగన్ పాదయాత్రకు అనుమతి



సాక్షి, అమరావతి: యువగళం పేరుతో గరళం చల్లేందుకు వస్తున్న టీడీపీ నేత నారా లోకేశ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం కోరారు. లోకేశ్ పాదయాత్రకు పోలీస్‌శాఖ అతి సాధారణ షరతులతో అనుమతిస్తే టీడీపీ నేతలు, ఎల్లో మీడియా రాద్ధాంతం చేస్తున్నాయని ఆయన చెప్పారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్రకు సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి 30 షరతులతో 2017, నవంబర్ 4న డీజీపీ అనుమతి ఇచ్చారని గుర్తు చేశారు. జగన్ పాదయాత్రకు సబ్ డివిజన్లవారీగా డీఎస్పీల అనుమతి తీసుకున్నామని తెలిపారు. సీఎం జగన్ ప్రభుత్వం చేకూర్చిన మేలును గుర్తు చేసుకుంటూ పాదయాత్రలో ప్రజలు అడుగడుగునా లోకేశ్‌ను నిలదీస్తారనే భయంతో టీడీపీ నేతలు ముందుగానే సాకులు వెతుకుతున్నారని వ్యాఖ్యానించారు. మంగళగిరిలో ఘోరంగా ఓడిపోయిన నారా లోకేశ్ ఎమ్మెల్సీ పదవీకాలం కూడా కొద్ది రోజుల్లో పూర్తి కానుందని తలశిల పేర్కొన్నారు. అలాంటి అనామకుడి పాదయాత్రతో ప్రజానాయకుడు వైఎస్ జగన్ పాదయాత్రను ఎల్లో మీడియా, టీడీపీ నేతలు పోల్చడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వారాహి వాహనం పూజ పేరుతో స్వామీజీ అవతారం ఎత్తినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారని చెప్పారు.

టీడీపీ నేత సోమిరెడ్డి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన సీబీఐ

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు నాలుగో అదనపు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పత్రాల చోరీ కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని మరోమారు విచారించారు. రెండు గంటలపాటు ఈ కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.

సిరుల 'పట్టు'



చిత్తూరు జిల్లా వి.కోట మండలం రామాపురం గ్రామానికి చెందిన ఈ రైతు పేరు జి.కుమార్. ఐదెకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారు. ఒకసారి పంట సాగు చేయడానికి ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు అవుతుండగా.. ఏటా ఐదారు పంటలు తీస్తున్నామని కుమార్ చెప్పారు. ఇలా ఐదెకరాల్లో ప్రతి పంటకూ రూ.2 లక్షల వరకు ఆదాయం లభిస్తోందని కుమార్ వెల్లడించారు. పట్టు పురుగుల పెంపకం సున్నితమైన అంశమని, చిన్న పిల్లల మాదిరిగా వాటిని పెంచుతామని వివరించారు. వాటికి తగిన ఉష్ణోగ్రత, సమపాళ్లలో వెలుతురు ఉండేలా చూసుకుంటే పట్టు పురుగుల పెంపకం కష్టమేమీ కాదన్నారు. తాను మల్బరీ సాగు చేపట్టి పట్టు పురుగులు పెంచడం చేపట్టిన నాటినుంచి ఇప్పటివరకు తాను ఏ పంటలోనూ నష్టపోలేదని కుమార్ చెప్పారు.



పట్టు దారం తీస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

రాష్ట్రంలో 1.27 లక్షల ఎకరాల్లో మల్బరీ సాగు

13.35 లక్షల మందికి జీవనోపాధి కల్పిస్తున్న సెరీ కల్చర్

ఈ ఏడాది మరో 12 వేల ఎకరాల్లో మల్బరీ సాగును విస్తరించాలని లక్ష్యం

ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం.. ఇతరులకు 75 శాతం సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వం

రూ.45 కోట్ల మేర రైతులకు రాయితీ ఇచ్చేందుకు ప్రభుత్వ నిర్ణయం

సాక్షి, చిత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రాష్ట్రంలో మల్బరీ సాగు ఊపందుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో మూడేళ్లుగా మల్బరీ సాగు పెరుగుతూ ప్రస్తుతం.. 1,26,828 లక్షల ఎకరాలకు విస్తరించింది. 2022–23 సంవత్సరంలో మరో 12 వేల ఎకరాల్లో సాగును విస్తరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. 'సిల్క్ సమగ్ర–2' కింద వచ్చే ఐదేళ్లలో పట్టు పురుగుల పెంపకం చేపట్టే ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని, ఇతర రైతులకు 75 శాతం సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించింది. పట్టు గూళ్లను విక్రయించే రైతులకు రూ.45 కోట్ల మేర రాయితీ చెల్లించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రస్తుతం 13.35 లక్షల మందికి జీవనోపాధి కల్పిస్తున్న పట్టు పురుగుల పెంపక రంగం (సెరీ కల్చర్) ద్వారా రానున్న రోజుల్లో మరింత మంది రైతుల చేత సాగు చేయించేందుకు కార్యాచరణ చేపట్టింది.

గ్రామీణులకు ఉపాధి మార్గం

వ్యవసాయ, పారిశ్రామిక రంగాల సమ్మేళనంగా ప్రసిద్ధి పొందిన పట్టు పరిశ్రమ ఉపాధి ఆధారిత రంగాల్లో మొదటి స్థానంలో ఉంది. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఈ రంగంలో మార్కెటింగ్ తప్ప మిగిలిన కార్యకలాపాలన్నీ కుటీర పరిశ్రమగానే కొనసాగుతున్నాయి. హెక్టారు మల్బరీ సాగుతో ఏడాది పొడవునా 12 మందికి ఉపాధి కలుగుతోంది. ఈ పంట మహిళలకు ఎంతో అనువుగా ఉంటోంది.



1. మొదటి దశ పట్టు పురుగులు
2. రెండో దశ పట్టు పురుగులు
3. ఐదో దశ పట్టు పురుగులు

సెరీ కల్చర్‌లో చిత్తూరుకు రెండో స్థానం

చిత్తూరు జిల్లాలో 37,631 ఎకరాల్లో మల్బరీ సాగవుతుండగా.. రాష్ట్రంలోనే ఈ జిల్లా రెండో స్థానంలో ఉంది. కుప్పం, పలమనేరుతోపాటు చిత్తూరు ప్రాంతంలో దీని సాగు విస్తరించింది. కుప్పం పరిధిలో 3, పలమనేరు పరిధిలో 10, చిత్తూరు పరిధిలో 2 చాకీ పురుగుల పెంపక కేంద్రాలు ఉండగా.. పెద్ద పురుగుల్ని పెంచే గదులు కుప్పం డివిజన్‌లో 6,500, పలమనేరు డివిజన్‌లో 6,000, చిత్తూరు డివిజన్‌లో 500 కలిపి 13 వేల వరకు ఉన్నాయి. జిల్లాలో రైతులు పండించిన పట్టు గూళ్లను వినియోగించుకునే ఉద్దేశంతో ప్రభుత్వం పట్టు దారం తీసే కేంద్రాలను పునరుద్ధరించింది. వ్యవసాయేతర యూనిట్లు నెలకొల్పేందుకు వచ్చే ప్రైవేట్ రీలర్లకు యంత్ర సామగ్రి కొనుగోలు కోసం ప్రభుత్వం 75% రాయితీ ఇస్తోంది.

ఓవెన్ పీవీసీ ఫ్లెక్సీలపై జోక్యం చేసుకోవద్దు

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు.. విచారణ 22కి వాయిదా

సాక్షి, అమరావతి: ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలు పర్యావరణ పరిరక్షణ చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని హైకోర్టు ప్రాథమికంగా స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం 2021లో జారీ చేసిన నోటిఫికేషన్‌కు సైతం అవి విరుద్ధంగా ఉన్నాయని పేర్కొంది. ఫ్లెక్సీలు, బ్యానర్ల నిషేధం వల్ల ప్రభావితం అవుతున్న వ్యక్తులకు వాదనలను వినిపించుకునే అవకాశం ఇవ్వకుండా నేరుగా నిషేధం విధించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని తెలిపింది. ఓవెన్ పీవీసీ ఫ్లెక్సీ బ్యానర్ల వినియోగం విషయంలో ఏ రకంగానూ జోక్యం చేసుకోవద్దని అధికారులను ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంటూ కేంద్ర పర్యావరణ అటవీ శాఖ కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను ఫిబ్రవరి 22కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ మంతోజు గంగారావు, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్‌ల ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జారీ చేసిన జీవోలు 65, 75లను సవాలు చేస్తూ పలు ఫ్లెక్సీ ముద్రణ కంపెనీలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయడం తెలిసిందే. దీనిపై పిటిషనర్ల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ ప్రభుత్వం ఏకపక్షంగా నిషేధం విధించిందన్నారు. అడ్వొకేట్ జనరల్(ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ చట్ట నిబంధనల ప్రకారమే ఫ్లెక్సీలపై నిషేధం విధించినట్లు తెలిపారు.

సబ్‌ప్లాన్ నిధుల మళ్లింపు వ్యవస్థీకృతమైపోయింది

- గత మూడేళ్లలో ప్రభుత్వం రూ.20 వేల కోట్ల నిధులను ఖర్చు చేయలేదు
- రూ.21,500 కోట్లను వివిధ కార్యక్రమాలకు మళ్లించింది
- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌పై చర్చలో పవన్ కళ్యాణ్ ధ్వజం



సాక్షి, అమరావతి: ప్రభుత్వ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల మళ్లింపు అనేది గత 40 ఏళ్లుగా వ్యవస్థీకృతం అయిపోయిందని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. గత పదేళ్లుగానే ఎంతో కొంత అది అమలవుతోందన్నారు. వైసీపీ ప్రభుత్వం గత మూడేళ్లలో రూ.20 వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేయలేదని ఆరోపించారు. వివిధ కార్యక్రమాలకు ఈ మూడేళ్లలో రూ.21,500 కోట్లు దుర్వినియోగం చేసిందని విమర్శించారు. ఆ నిధులను ఎవరూ తినలేదని.. అయితే సబ్‌ప్లాన్ దెబ్బకొట్టి ఈ మొత్తం దుర్వినియోగమయ్యాయన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్–వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం' పేరుతో చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి వ్యవస్థీకృతమైన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అంశంలో అధికారంలోకి వస్తే తాను కూడా అన్నీ ఒకేసారి చేస్తానని చెప్పడం లేదన్నారు. తనకు ఇంకా పరిపాలన అనుభవం లేదు కాబట్టి కచ్చితమైన మాట ఇవ్వలేకపోతున్నానని చెప్పారు. అయితే ఈ అంశంలో లోపాలు సరిచేయడంపై పారదర్శకంగా ఉంటానని తెలిపారు. జనసేన అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీలకు సాధికారిత కల్పిస్తానన్నారు. నిలిచిపోయిన ప్రతి పథకాన్ని పునరుద్ధరిస్తామని వెల్లడించారు. సబ్ ప్లాన్ అమలుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర జనాభాలో ఎస్సీ, ఎస్టీలు 21 శాతం ఉండి.. తమకు నిధులు ఇవ్వండి అని చేయి చాచే స్థితి ఉండడం చాలా బాధాకరమని తెలిపారు. ఇంత జనాభా ఉండి కూడా ఇంకా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కావాలి.. పథకాలు రావాలని కోరుకుంటున్నారన్నారు. తాము ఎందుకు అధికారం చేపట్టకూడదనే ఆలోచన చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా వర్గాల జనాభాకు తగ్గట్టు బడ్జెట్ కేటాయింపులు ఉండాలన్నారు.

ప్రజారాజ్యం, బీఎస్పీ వైఫల్యానికి లోపాలు..

మనం, మన కులమే అనుకుంటే ఒకే చట్రంలో ఇరుక్కుపోతామని పవన్ వ్యాఖ్యానించారు. మన రెండు చేతుల్లో ఒకదాన్ని పైన ఉండే కులాలకు చేయూత నివ్వాలన్నారు. మన కులాల కోసం మరొక చేతిని అందించుకోవాలని సూచించారు. ప్రజారాజ్యం, బీఎస్పీ ఎదగకపోవడానికి వాటిలో లోపాలు ఉండటమే కారణమన్నారు. బీజేపీతో జనసేన కలిసి ఉందని ఒక ఆలోచనను పెట్టుకున్నవారు దాన్ని తొలగించుకోవాలని చెప్పారు. 'నేను ఎవరితో ఉన్నానన్నది మీకు అనవసరం. నేను మీకు చేశానా... లేదా... అన్నదే ప్రధానం. చేయకపోతే నన్ను చొక్కా పట్టుకొని అడగండి.. అప్పుడు నేను సమాధానం చెబుతా' అని వ్యాఖ్యానించారు. కాగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌పై చర్చకు ముందు పవన్ కళ్యాణ్ విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. తన వారాహి వాహనానికి పూజలు చేశారు. అనంతరం వాహనంపైకి ఎక్కి రాష్ట్రంలోని రాక్షస పాలన అంతం చేయడమే వారాహి ముఖ్య లక్ష్యమన్నారు.

పవన్.. నిజాలు తెలుసుకో

- 'ఈనాడు' తప్పుడు రాతలే మీ లెక్కలా?
- మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున ధ్వజం
- ఇవాళే సబ్‌ప్లాన్ గుర్తుకు వచ్చిందా?
- దళిత ద్రోహి చంద్రబాబును ఎలా సమర్థిస్తావు?



మంత్రులు సురేష్, నాగార్జున

సాక్షి, అమరావతి: చంద్రబాబు దర్శకత్వంలోనే పవన్ కళ్యాణ్ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌పై సమావేశం నిర్వహించారని పురపాలక, సాంఘిక సంక్షేమ శాఖల మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున మండిపడ్డారు. సబ్ ప్లాన్‌పై ఈనాడు పత్రిక తప్పుడు రాతలతో ఎక్కాలు అప్పజెబుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సంతృప్త స్థాయిలో.. ఎక్కడా అవినీతికి తావు లేకుండా ఎస్సీ, ఎస్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్ని పథకాలు అమలు చేస్తున్నారనే విషయాన్ని పవన్ తెలుసుకోవాలన్నారు. పవన్‌కు లెక్కలు, నిజాలు తెలియకపోతే తాము చెబుతామన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వారు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన చూసి ఓర్వలేక రామోజీరావు తప్పుడు రాతలు రాస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాకే ఎస్సీ, ఎస్టీలకు అధిక లబ్ధి చేకూరిందన్నారు. రామోజీ తన స్వగ్రామంలో ఏ వర్గానికి ఎంత లబ్ధి జరిగిందో తెలుసుకోవాలని హితవు పలికారు. ఐదేళ్లలో ఎస్సీలకు టీడీపీ ప్రభుత్వం ఖర్చు చేసింది కేవలం రూ.33,635 కోట్లేనన్నారు. అదే తమ ప్రభుత్వం ఈ మూడున్నరేళ్లలోనే ఎస్సీల సంక్షేమం కోసం రూ.48,909 కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఎస్టీల కోసం కేవలం రూ.12,487 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే, తమ ప్రభుత్వం ఈ మూడున్నరేళ్లలోనే రూ.15,589 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. ఇవాళే పవన్‌కు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ గుర్తుకు వచ్చిందా? అని నిలదీశారు. చంద్రబాబు సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించినప్పుడు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. దత్తపుత్రుడు అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జనాభా ప్రాతిపదికన సబ్ ప్లాన్‌ను గతంలో ఎలా వినియోగించారో పవన్ తెలుసుకోవాలన్నారు. దళిత ద్రోహి, దళిత వ్యతిరేకి అయిన చంద్రబాబును పవన్ ఎలా సమర్థిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ వర్చువల్‌గా పాల్గొన్నారు.

తొలి రోజు రూ.10 కోట్లు!

- రేపటి నుంచి లోకేశ్ పాదయాత్ర
- ప్రతి పంచాయతీ నుంచి 300 మందిని తరలించాలని ఆదేశాలు



కుప్పంలోని కమతమూరు రోడ్డులో నారా లోకేష్ బహిరంగ సభ ప్రాంగణం

కుప్పం(చిత్తూరు జిల్లా): టీడీపీ నేత నారా లోకేశ్ కుప్పం నుంచి శుక్రవారం ప్రారంభిస్తున్న యువగళం పాదయాత్రకు రూ.10కోట్ల భారీ వ్యయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. తొలిరోజు కేవలం సభా ప్రాంగణంలో వేదిక, కటౌట్లు, హోర్డింగులకు రూ.5 కోట్ల మేర ఖర్చు చేస్తున్నారు. జన సమీకరణ కోసం మరో రూ.5 కోట్లు వెచ్చిస్తున్నట్లు సమాచారం. కుప్పంలోని కమతమూరు రోడ్డులో టీడీపీ నేతలకు చెందిన 10 ఎకరాల విస్తీర్ణంలో బహిరంగ సభకు వారం రోజులుగా ఏర్పాట్లు చేస్తున్నారు. పాదయాత్రకు కుప్పం నియోజకవర్గంలో ఒక్కో పంచాయతీ నుంచి 300 మందిని తరలించాలని టీడీపీ క్యాడర్‌కు అధిష్టానం ఆదేశాలు జారీచేసింది. చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ జన సమీకరణపై క్యాడర్‌తో నేరుగా మాట్లాడుతున్నారు. బహిరంగ సభకు వచ్చిన వారికి నగదు, బిర్యానీ ప్యాకెట్ ఇచ్చేలా టీడీపీ చర్యలు చేపట్టింది.

తొలిరోజు పాదయాత్ర ఇలా..

నారా లోకేశ్ గురువారం రాత్రి కుప్పం చేరుకుని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో బస చేస్తారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు కుప్పం మున్సిపాలిటీ లక్ష్మీపురంలోని వరదరాజులు దేవాలయంలో పూజలు నిర్వహించి పాదయాత్ర ప్రారంభిస్తారు. కమతమూరు రోడ్డులో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం గుడుపల్లె మండలం శెట్టిపల్లి చేరుకుంటారు. రాత్రి పీఈఎస్ మెడికల్ కళాశాల ఎదుట ఓ ప్రైవేట్ స్థలంలో లోకేశ్ బస చేస్తారు. రెండో రోజు అక్కడి నుంచి శాంతిపురం మండలంలోకి ప్రవేశిస్తారు.

'ఈనాడు' తప్పుడు కథనాలు : ఎస్పీ

చిత్తూరు అర్బన్: నారా లోకేశ్ పాదయాత్రపై ఈనాడు తప్పుడు కథనాలను ప్రచురించిందని చిత్తూరు ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోకేశ్ పాదయాత్రకు సాధారణ షరతులతో అనుమతి ఇచ్చామని తెలిపారు.

తెలుగు నేలపై విరిసిన పద్మాలు

సంగీతం.. దేవుడిచ్చిన వరం

తన సంగీతంతో శ్రోతలను ఉర్రూతలూగిస్తూ ఇటీవల '80వ గోల్డెన్ గ్లోబ్ అవార్డు', '28వ క్రిటిక్స్ చాయిస్ అవార్డు'అందుకున్న ఎంఎం కీరవాణి తాజాగా పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. కీరవాణి నాలుగో ఏటనే తండ్రి వేలు పట్టుకుని సంగీతం వైపు తొలి అడుగులేశారు. ఆరేళ్లప్పుడు రాయచూరులోని దత్తప్ప అనే విద్వాంసుడి వద్ద సంగీతం అభ్యసించారు. వయోలిన్‌పై పట్టు సాధించారు. ఇంజనీర్ కావాలని శ్రమించినా సీటు రాలేదు. ఆ తర్వాత కీరవాణి'జాలీ ఫ్రెండ్స్'అనే ఆర్కెస్ట్రా ట్రూపులో చేరి, పాటలు పాడారు. చెన్నైకి వెళ్లి సినిమా అవకాశాల కోసం ప్రయత్నించారు. ఆ తర్వాత సంగీత దర్శకుడు చక్రవర్తి వద్ద అసిస్టెంట్‌గా చేరారు. తర్వాత వేటూరి వద్ద అసిస్టెంట్‌గా చేరారు. వేటూరి సిఫార్సుతో కీరవాణికి 'మనసు–మమత'సినిమాకి సంగీత దర్శకునిగా తొలి అవకాశం వచ్చింది. ఆయన ఇప్పటివరకు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో 250కి పైగా సినిమాలకు సంగీతం అందించారు.

సేవామూర్తి చంద్రశేఖర్



కాకినాడ రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ అవార్డు కాకినాడకు చెందిన సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్‌కు లభించింది. ఆయన 1943 నవంబర్ 20న సింగరాయకొండలో అప్పల నరసయ్య, రామయ్యమ్మ దంపతులకు జన్మించారు. కెనడాలో ఉన్నత విద్యను అభ్యసించి అక్కడే స్థిరపడ్డారు. 1985లో విమాన ప్రమాదంలో చంద్రశేఖర్ భార్య మంజరి, కుమారుడు కిరణ్, కుమార్తె శారద మృతి చెందారు. దీంతో ఇండియాకు వచ్చేసిన ఆయన 1989లో సంకురాత్రి ఫౌండేషన్‌ను స్థాపించారు. కాకినాడ రూరల్ మండలం పెనుమర్తి వద్ద కంటి ఆస్పత్రి, విద్యాలయం స్థాపించి సేవలు అందిస్తున్నారు.

హరికథా సామ్రాజ్య సార్వభౌమ..



తెనాలి: తెలుగునాట ప్రసిద్ధి చెందిన హరికథకుడు.. కోట సచ్చిదానందశాస్త్రి భాగవతార్. రామాయణ, భారత, భాగవతాలను శ్రావ్యంగా, జనరంజకంగా గానం చేస్తూ విశేష ప్రాచుర్యం కల్పించారు. తన సేవలకు గుర్తుగా తాజాగా పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. సచ్చిదానంద శాస్త్రి స్వస్థలం.. ప్రకాశం జిల్లా అద్దంకి. 14 ఏళ్ల వయసులో తండ్రి మరణంతో పౌరోహిత్యం చేస్తూనే.. స్వయంగా హరికథాగానం సాధన చేశారు. చతురోక్తులు, సరస సంభాషణలతో వీక్షకుల మనసు తనపైన లగ్నమయ్యేవరకు కాలక్షేపం చేసి, కథాంశంతో హరికథను ఆరంభించేవారు. ఆకాశవాణిలో టాప్ ఏ గ్రేడ్ ఆర్టిస్టయ్యారు.

ఆర్చిడ్ మొక్కలపై పరిశోధనలకు నాగేశ్వరరావుకు పద్మశ్రీ



ఏలూరుకు చెందిన డాక్టర్ అబ్బారెడ్డి నాగేశ్వరరావు పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన ఆర్చిడ్ రకానికి చెందిన అరుదైన మొక్కలపై పరిశోధనలు చేస్తున్నారు. సెంటర్ ఫర్ ఆర్చిడ్ జీనీ కన్జర్వేషన్ ఆఫ్ ఈస్టర్న్ హిమాలయన్ రీజియన్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. శాస్త్రవేత్తగా చేసిన పరిశోధనలకుగానూ లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఇప్పటికే తన పేరును నమోదు చేసుకున్నారు. 35 రకాల నూతన ఆర్చిడ్ జాతి మొక్కలను కనుగొన్నారు.

ఏటికొప్పాక కళాకారుడికి పద్మశ్రీ



సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి జిల్లా ఏటికొప్పాక గ్రామానికి చెందిన సీవీ రాజు(చింతలపాటి వెంకటపతి రాజు)కు పద్మశ్రీ పురస్కారం లభించింది. ఆయన రూపొందించిన ఏటికొప్పాక బొమ్మలు బాగా ప్రాచుర్యం పొందాయి. మొదట సీవీ రాజుది వ్యవసాయ వృత్తే అయినా... 1988లో బొమ్మల తయారీని చేపట్టారు. పిల్లల ఆట వస్తువులు, కుంకుమ భరణిలు డిజైన్ చేసి ఎగుమతి చేశారు. 2020లో మన్ కీ బాత్‌లో ప్రధానమంత్రి మోదీ.. రాజుతో సంభాషించారు. మళ్లీ గత ఆదివారం కూడా రాజు తయారుచేసిన బొమ్మలను ప్రధాని ప్రశంసించారు. బొమ్మల తయారీలో నైపుణ్యానికి రాష్ట్రపతి అవార్డు రాజుకు లభించింది. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లోనూ చోటు దక్కించుకున్నారు.

విజయగుప్తాకు పద్మశ్రీ



సాక్షి ప్రతినిధి, బాపట్ల: వ్యవసాయ శాస్త్రవేత్తగా ఉన్న విజయగుప్తా అందించిన సేవలకు పద్మశ్రీ దక్కింది. విజయగుప్తా మంచినీటి చేపల పెంపకం కోసం తక్కువ ఖర్చుతో కూడిన పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశారు. నీలి విప్లవం ద్వారా చేపల ఉత్పత్తిని పెంచిన ఘనతను సొంతం చేసుకున్నారు. విజయగుప్తా చేసిన విశిష్ట పరిశోధనలకు ఇప్పటికే దేశ,విదేశాల్లో పురస్కారాలను అందుకున్నారు. బాపట్లలో జన్మించిన ఆయన గుంటూరు ఏసీ కళాశాలలో బీఎస్సీ, బెనారస్ హిందూ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదివారు. పశ్చిమ బెంగాల్ మత్స్యశాఖలో వివిధ హోదాల్లో పని చేశారు. 22 దేశాల్లో పరిశోధనలు నిర్వహించారు.

ఇద్దరు శాస్త్రవేత్తలకు పద్మశ్రీ

శాస్త్ర విజ్ఞాన రంగంలో కేఎస్ గణేశ్, పీసీ సూద్‌కు పురస్కారాలు



శ్రీసత్యసాయి బాబాతో పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రవీణ్‌చంద్రసూద్ (ఫైల్)

సాక్షి, అమరావతి: శాస్త్ర విజ్ఞాన రంగంలో చేసిన విశిష్ట కృషికి ప్రముఖ శాస్త్రవేత్త కేఎస్ గణేశ్‌కు పద్మశ్రీ పురస్కారం దక్కింది. ప్రముఖ బయో ఆర్గానిక్స్ శాస్త్రవేత్త అయిన కేఎస్ గణేశ్ తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్) వ్యవస్థాపక డైరెక్టర్‌గా ఉన్నారు. కేంబ్రిడ్జ్ వర్సిటీ నుంచి పీహెచ్‌డీ చేశాక భారత్‌కు తిరిగి వచ్చి 1980లో హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాలిక్యులర్ బయాలజీలో చేరారు. భారత్‌లో మొదటి డీఎన్ఏ సింథసిస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. డీఎన్ఏ గుర్తింపులో రసాయన సూత్రాలు, డీఎన్ఏ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై విశేష పరిశోధనలు నిర్వహించారు.

అణు భౌతిక శాస్త్రంలో పీసీ సూద్‌కు..

అణు భౌతిక శాస్త్రంలో చేసిన విశేష కృషికిగాను పీసీ సూద్‌కు పద్మశ్రీ లభించింది. పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్‌లో భౌతిక శాస్త్రవేత్తగా ఆయన పనిచేస్తున్నారు. న్యూక్లియర్ ఫిజిక్స్, థియోరాటికల్ ఫిజిక్స్, ఎలిమెంటరీ పార్టికల్ ఫిజిక్స్‌ల్లో పరిశోధనలు చేశారు. న్యూక్లియర్ స్ట్రక్చర్ అంశంలో 300కుపైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. వాటిలో 158 పత్రాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

మృదు మధురమైన కంఠస్వరం.. వాణీజయరామ్ సొంతం

'తెలి మంచు కరిగింది తలుపు తీయనా ప్రభూ'.. ఎంత కమ్మని గొంతు. ఉషోదయం వేళ మనసుని ఉల్లాసంగా తట్టిలేపే మృదు మధురమైన కంఠస్వరం వాణీ జయరామ్ సొంతం. 'స్వాతి కిరణం'లోని ఈ పాటను తమిళ పొన్ను (అమ్మాయి) వాణీ జయరామ్ స్పష్టంగా తెలుగులో పాడిన తీరు అద్భుతం. 'శంకరాభరణం'సినిమాలో 'పలుకే బంగారమాయెనా..'అని పాడితే 'మీ పాటే మధురమాయెనే..'అని శ్రోతలు కితాబునిచ్చారు. 'అందెల రవమిది పదములదా..'అంటూ 'స్వర్ణకమలం'కి పాడితే శ్రోతల మనసులు నాట్యం చేశాయి. ఐదు దశాబ్దాలకు పైబడిన కెరీర్‌లో వాణీ జయరామ్ పదివేల పాటలు పాడారు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ, గుజరాతీ, మరాఠీ, బెంగాలీ.. ఇలా దాదాపు 20 భాషల్లో పాడారు. ఎనిమిదవ ఏటనే ఆమె ఆల్ ఇండియా రేడియో కార్యక్రమంలో పాల్గొన్నారు. కర్ణాటక సంగీతం, హిందుస్తానీ అభ్యసించిన ఆమె చదువుని నిర్లక్ష్యం చేయలేదు. డిగ్రీ పూర్తయ్యాక చెన్నైలో ఆమెకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత హైదరాబాద్‌కి బదిలీ అయ్యారు. 1969లో జయరామ్‌ని పెళ్లి చేసుకున్నాక కొన్నేళ్ల పాటు ముంబైలో ఉన్నారు. ఏ భాషలో పాడితే అదే ఆమె మాతృభాష అన్నట్లుగా పాడిన వాణీ జయరామ్‌కి ఎన్నో అవార్డులూ రివార్డులూ దక్కాయి. తాజాగా ఆమెను 'పద్మ భూషణ్' వరించింది.

తెలంగాణలో పద్మ పురస్కారాలు దక్కినవారు..

పేరు	రంగం	పురస్కారం
చినజీయర్‌స్వామి	ఆధ్యాత్మికం	పద్మభూషణ్
కమలేష్ డి పటేల్	ఆధ్యాత్మికం	పద్మభూషణ్
పి.హనుమంతరావు	వైద్య సేవలు	పద్మశ్రీ
రామకృష్ణారెడ్డి	సాహిత్యం	పద్మశ్రీ
విజయ్‌గుప్తా	వ్యవసాయం	పద్మశ్రీ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	773	60,205
నిఫ్టీ ▽	226	17,892

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి నాలుగు రాత్రి 8.30 గంటలకు)			
నాస్‌డాక్	11,113	▽	222
డోజోన్స్	33,465	▽	269
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,732	▽	27
డాక్స్	15,056	▽	37
షాంఘై (ముగింపు)	3,265	△	25
నికాయ్	27,395	△	96

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	57,138	▽	184
బంగారం (99.5 స్వచ్ఛత)	56,909	▽	183
వెండి (కేజీ)	67,894	▽	283

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధావనసంశ	80.85	82.52
£	బ్రిటన్ పౌండ్	ధావనసంశ	87.51	90.58
€	యూరో	ధావనసంశ	99.03	102.34
¥	జపాన్ ఎన్ (100)	ధావనసంశ	61.61	63.63
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధావనసంశ	56.87	59.30
S$	సింగపూర్ డాలర్	ధావనసంశ	60.99	63.00
SAR	సౌదీ రియాల్	ధావనసంశ	20.76	22.43
UAE D	యూఏఈ దిర్హామ్	ధావనసంశ	21.32	23.11
¥	చైనా యువాన్	ధావనసంశ	10.90	12.98

లాభాల్లోకి టాటా మోటార్స్



న్యూఢిల్లీ: ఆటో రంగ దేశీ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. రూ. 3,043 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 1,451 కోట్ల నికర నష్టం ప్రకటించింది. విభిన్న మార్కెట్లలో అమ్మకాలు ఊపందుకోవడం ఇందుకు దోహదపడింది. మొత్తం ఆదాయం సైతం రూ. 72,229 కోట్ల నుంచి రూ. 88,489 కోట్లకు ఎగసింది. కాగా.. స్టాండెలోన్ నికర లాభం దాదాపు మూడు రెట్లు జంప్‌చేసి రూ. 506 కోట్లను తాకింది. గత క్యూ3లో కేవలం రూ. 176 కోట్లు ఆర్జించింది.

జేఎల్ఆర్ జూమ్

ప్రస్తుత సమీక్షా కాలంలో టాటా మోటార్స్ లగ్జరీ కార్ల విభాగం జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) ఆదాయం 28 శాతం పుంజుకుని 600 కోట్ల పౌండ్లకు చేరింది. మెరుగుపడ్డ సరఫరాలు, పటిష్ట మోడళ్లు, వీటికి తగిన ధరలు ఉత్తమ పనితీరుకు కారణమైనట్లు కంపెనీ పేర్కొంది. వెరసి 26.5 కోట్ల పౌండ్ల పన్నుకుముందు లాభం ఆర్జించింది. గతేడాది క్యూ3లో 9 మిలియన్ పౌండ్ల పన్నుకు ముందు నష్టం ప్రకటించిన సంగతి తెలిసిందే. చైనాలో లాక్‌డౌన్ల కారణంగా హోల్‌సేల్ అమ్మకాలు ప్రభావితమైనట్లు కంపెనీ పేర్కొంది. జనవరి నుంచి పరిస్థితులు మెరుగుపడగలవని అంచనా వేసింది. చిప్‌ల కొరత తగ్గడం, ఉత్పత్తి, హోల్‌సేల్ అమ్మకాలు పుంజుకోవడం కంపెనీ టర్న్‌అరౌండ్‌కు దోహదం చేసినట్లు జేఎల్ఆర్ తాత్కాలిక సీఈవో అడ్రియన్ మార్డెల్ పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 1 శాతం నష్టంతో రూ.419 వద్ద ముగిసింది.

అదానీ గ్రూప్‌లో అకౌంటింగ్ మోసాలు!

- షేర్ల ధరల్లో అవకతవకలు
- హిండెన్‌బర్గ్ ఆరోపణలు
- ఖండించిన అదానీ గ్రూప్

న్యూఢిల్లీ: దేశీ దిగ్గజం అదానీ గ్రూప్ రూ. 20,000 కోట్ల భారీ ఫాలో ఆన్ ఇష్యూకు (ఎఫ్‌పీవో) వస్తున్న తరుణంలో అమెరికాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ షాకిచ్చింది. అదానీ గ్రూప్ .. అకౌంటింగ్ మోసాలకు, షేర్ల ధరల విషయంలో అవకతవకలకు పాల్పడుతోందంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. దీనితో బుధవారం అదానీ గ్రూప్ షేర్లు భారీగా నష్టపోయాయి. హిండెన్‌బర్గ్ ఆరోపణలను అదానీ గ్రూప్ ఖండించింది. వివరాల్లోకి వెడితే.. అదానీ గ్రూప్ దశాబ్దాలుగా అకౌంటింగ్ మోసాలు, షేర్ల రేట్లకు సంబంధించి మోసాలకు పాల్పడుతోందని హిండెన్‌బర్గ్ ఒక నివేదికలో పేర్కొంది. కరీబియన్ దేశాలు మొదలుకుని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వరకు వివిధ దేశాల్లో అదానీ కుటుంబ సారథ్యంలోని షెల్ కంపెనీలు ఒక పద్ధతి ప్రకారం పని చేస్తున్నాయని హిండెన్‌బర్గ్ తెలిపింది. లిస్టెడ్ కంపెనీల నిధులను దారి మళ్లించేందుకు, మనీ లాండరింగ్, అవినీతి, పన్ను ఎగవేతలకు పాల్పడేందుకు వీటిని ఉపయోగించారని ఆరోపించింది. 'అదానీ గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ గౌతమ్ అదానీ 120 బిలియన్ డాలర్లకు పైగా సంపద సమకూర్చుకున్నారు. ఇందులో 100 బిలియన్ డాలర్లు, గ్రూప్‌లో భాగమైన ఏడు కీలకమైన లిస్టెడ్ కంపెనీల షేర్ల రేట్లు పెరగడం ద్వారా గత మూడేళ్లలోనే పోగుపడ్డాయి. ఈ వ్యవధిలో ఆయా సంస్థల షేర్లు సగటున 819 శాతం మేర ఎగిశాయి' అని ఒక నివేదికలో పేర్కొంది. ఈ నివేదిక పరిశోధనలో భాగంగా అదానీ గ్రూప్‌లోని పలువురు మాజీ సీనియర్ ఉద్యోగులతో పాటు డజన్ల కొద్దీ వ్యక్తులతో మాట్లాడి, వేల కొద్దీ డాక్యుమెంట్లను సమీక్షించి, అరడజను పైగా దేశాల్లో సైట్ విజిట్లు చేశామని హిండెన్‌బర్గ్ వివరించింది. భారీ వేల్యుయేషన్లతో ట్రేడవుతున్న 7 కంపెనీల ఫండమెంటల్స్ బట్టి చూస్తే కనీసం 85 శాతం వరకు షేరు పతనమయ్యే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించింది. అమెరికాలో ట్రేడయ్యే బాండ్లు, ఇతరత్రా డెరివేటివ్ సాధనాల ద్వారా అదానీ గ్రూప్ కంపెనీల్లో తాము షార్ట్ పొజిషన్స్ తీసుకున్నట్లు వెల్లడించింది.



అదానీ గ్రూప్ ఖండన...

హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌ను అదానీ గ్రూప్ ఖండించింది. వాస్తవాలను తెలుసుకునేందుకు తమను సంప్రదించేందుకు ఎటువంటి కనీస ప్రయత్నమూ చేయకుండా నివేదికను విడుదల చేయడం షాక్‌కు గురి చేసిందని వ్యాఖ్యానించింది. భారతదేశ అత్యున్నత న్యాయస్థానాలు కూడా తోసిపుచ్చిన నిరాధార ఆరోపణలు, తప్పుడు సమాచారంతో దీన్ని రూపొందించారంటూ ఒక ప్రకటనలో ఆక్షేపించింది. సరిగ్గా ఎఫ్‌పీవోకు సిద్ధమవుతున్న తరుణంలో దీన్ని విడుదల చేయడం వెనుక గల ఉద్దేశాలను ప్రశ్నించింది. 'అదానీ గ్రూప్ ప్రతిష్టను, ఇష్యూను దెబ్బతీయాలనే ప్రధాన లక్ష్యంతోనే ఇలా చేసినట్లు స్పష్టం అవుతోంది' అని వ్యాఖ్యానించింది. దేశీయంగా అతి పెద్ద పబ్లిక్ ఇష్యూగా పరిగణిస్తున్న ప్రతిపాదిత ఎఫ్‌పీవో జనవరి 27న ప్రారంభమై 31న ముగియనున్న సంగతి తెలిసిందే.

షేర్లకు షాక్..

హిండెన్‌బర్గ్ నివేదికతో అదానీ గ్రూప్ స్టాక్స్‌లో కొన్ని బుధవారం పది శాతం వరకూ క్షీణించాయి. దీంతో ఒక దశలో అదానీ సంపద దాదాపు 6 బిలియన్ డాలర్ల మేర పడిపోయిందని వార్తలు వచ్చాయి. అయితే, ఆ తర్వాత షేర్లు కొంత కోలుకున్నాయి. మొత్తం మీద అదానీ ట్రాన్స్‌మిషన్ షేరు సుమారు 9 శాతం, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ 6%, అదానీ టోటల్ గ్యాస్ 5.5%, అదానీ విల్మర్.. అదానీ పవర్ .. ఎన్‌డీటీవీ తలో 5%, అదానీ గ్రీన్ ఎనర్జీ 3%, ఇటీవల కొనుగోలు చేసిన అంబుజా సిమెంట్స్, ఏసీసీ కూడా 7% పైగా క్షీణించాయి.

సెన్సెక్స్ 774 పాయింట్లు క్రాష్

- సూచీలకు భారీ నష్టాలు
- 18 వేల దిగువకు నిఫ్టీ
- అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు
- రిపబ్లిక్ డే సందర్భంగా నేడు మార్కెట్‌కు సెలవు



ముంబై: దేశీయ స్టాక్ సూచీలు బుధవారం ఒకశాతానికిపైగా నష్టపోయాయి. అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 774 పాయింట్లు పతనమై 60,205 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 226 పాయింట్లు క్షీణించి 18వేల దిగువున 17,892 వద్ద నిలిచింది. ఉదయం ప్రతికూలంగా మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 898 పాయింట్లు క్షీణించి 60,081 వద్ద, నిఫ్టీ 272 పాయింట్లు నష్టపోయి 17,846 వద్ద ఇంట్రాడే కనిష్టాను నమోదు చేశాయి. సెన్సెక్స్ సూచీలో ఏడు షేర్లు మాత్రమే లాభపడ్డాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 1.50%, ఒకశాతం నష్టపోయాయి. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా నేడు ఎక్స్చేంజీలకు సెలవు. డాలర్ మారకంలో రూపాయి విలువ 2 పైసలు క్షీణించి 81.65 స్థాయి వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2394 కోట్ల షేర్లను విక్రయించగా, దేశీయ ఇన్వెస్టర్లు రూ.1378 కోట్ల విలువైన షేర్లను కొన్నారు. సెన్సెక్స్ ఒకశాతానికి పైగా నష్టపోవడంతో ఇన్వెస్టర్లు రూ.3.66 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

నష్టాలు ఎందుకంటే

దేశీయ ప్రధాన ప్రైవేట్ గ్రూప్ అదానీ కంపెనీ షేర్లలో భారీ అమ్మకాలు మార్కెట్ వర్గాలను కలవరపెట్టాయి. రిపబ్లిక్ డే సెలవు నేపథ్యంలో వీక్లీ, వారాంతాపు ఎక్స్‌పైరీ బుధవారమే జరిగింది. దేశీయ అతిపెద్ద ఎఫ్‌పీఓ(అదానీ ఎంటర్‌ప్రైజస్) ప్రారంభం, టీ1 సెటిల్‌మెంట్ అమల్లోకి రానుండటం, వచ్చేవారం(బుధవారం) కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న పరిణామాల నేపథ్యంలో లిక్విడిటీ కోసం ట్రేడర్లు తమ పొజిషన్లను విక్రయించాయి. ఎఫ్ఐఐలు భారత ఈక్విటీల నుంచి ఈ నెలలో ఇప్పటివరకు రూ. 17 వేల కోట్లకు పైగా నిధులను ఉపసంహరించుకున్నారు. బలహీన అంతర్జాతీయ సంకేతాలు, బడ్జెట్ అంచనాలు, ముడి చమురు ధరలు పెరగడం వంటి పరిణామాలు మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- నష్టాల మార్కెట్లోనూ టీవీఎస్ కంపెనీ షేరు దూసుకెళ్లింది. డిసెంబర్ త్రైమాసికంలో మెరుగైన ప్రదర్శన కనబరచడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈలో 5.50 శాతం పెరిగి రూ. 1,038 వద్ద స్థిరపడింది.
- క్యూ3లో ఆకర్షణీయ ఫలితాలను సాధించినప్పటికీ., ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ షేరు విక్రయాల ఒత్తిడికి లోనైంది. నాలుగు శాతం నష్టంతో రూ.715 వద్ద ముగిసింది.
- ఇండస్ టవర్స్ షేరు రెండేళ్ల కనిష్టాన్ని తాకింది. మూడో క్వార్టర్ ఫలితాలు నిరాశపరచడం షేరుకు ప్రతికూలంగా మారింది. బీఎస్ఈలో 7.19% నష్టపోయి రూ. 158.20 వద్ద ముగిసింది.

విమాన టికెట్ డౌన్‌గ్రేడ్ చేస్తే రీయింబర్స్‌మెంట్

ఫిబ్రవరి 15 నుంచి కొత్త నిబంధనలు



న్యూఢిల్లీ: ప్రయాణికులు బుక్ చేసుకున్న టికెట్లను ఎయిర్‌లైన్స్ ఏకపక్షంగా డౌన్‌గ్రేడ్ చేస్తుండటంపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో విమానయాన రంగ నియంత్రణ సంస్థ డీజీసీఏ కొత్త నిబంధనలు రూపొందించింది. వీటి ప్రకారం టికెట్‌ను డౌన్‌గ్రేడ్ చేస్తే, దేశీ రూట్లలో ప్రయాణాలకు సంబంధించి టికెట్ ఖర్చులో 75 శాతం మొత్తాన్ని ప్యాసింజర్లకు ఎయిర్‌లైన్స్ చెల్లించాల్సి ఉంటుంది. అంతర్జాతీయ రూట్ల విషయంలో ప్రయాణ దూరాన్ని బట్టి టికెట్ ఖర్చుల్లో 30–75 శాతం వరకు (పన్నులు సహా) రీయింబర్స్ చేయాలి. ఇవి ఫిబ్రవరి 15 నుంచి అమల్లోకి వస్తాయని డీజీసీఏ సీనియర్ అధికారి బుధవారం తెలిపారు. ప్యాసింజర్లు నిర్దిష్ట తరగతిలో ప్రయాణించేందుకు బుక్ చేసుకున్న టికెట్‌ను విమానయాన సంస్థలు వివిధ కారణాలతో దిగువ తరగతికి డౌన్‌గ్రేడ్ చేస్తున్న ఉదంతాలు ఇటీవల పెరిగిన సంగతి తెలిసిందే.

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ. 1,247 కోట్లు

- క్యూ3లో 77 శాతం అప్..
- కొత్త ఔషధాలు, సానుకూల ఫారెక్స్ ఊతం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో దేశీ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ (డీఆర్ఎల్) నికర లాభం రూ. 1,247 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో నమోదైన రూ. 706 కోట్లతో పోలిస్తే ఇది 77 శాతం అధికం. విదేశీ మారకంపరంగా సానుకూలతలు, కొత్త ఔషధాలను ప్రవేశపెట్టడం తదితర అంశాలు ఇందుకు దోహదపడ్డాయని సంస్థ సీఎఫ్‌వో పరాగ్ అగర్వాల్ వెల్లడించారు. సమీక్షాకాలంలో ఆదాయం 27 శాతం పెరిగి రూ. 5,320 కోట్ల నుంచి రూ. 6,770 కోట్లకు పెరిగినట్లు వివరించారు. గతేడాది సెప్టెంబర్‌లో అమెరికా మార్కెట్లో ప్రవేశపెట్టిన రెవ్‌లిమిడ్ ఔషధం .. కంపెనీ ఆదాయాలకు అర్థవంతమైన రీతిలో తోడ్పడుతోందని ఆయన పేర్కొన్నారు. మూడో త్రైమాసికంలో అయిదు కొత్త ఔషధాలను ప్రవేశపెట్టామని, పూర్తి ఆర్థిక సంవత్సరంలో ఉత్తర అమెరికా మార్కెట్లో 25 కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టే అవకాశం ఉందని వివరించారు. ధరలపరమైన తగ్గుదల ధోరణులు దాదాపుగా గత రెండు త్రైమాసికాల్లో చూసిన విధంగానే ఉన్నట్లు సంస్థ సీఈవో ఎరెజ్ ఇజ్రేలీ పేర్కొన్నారు. అమెరికా, రష్యా మార్కెట్లలో వృద్ధి తోడ్పాటుతో పటిష్టమైన ఆర్థిక పనితీరు కనపర్చగలిగామని డీఆర్ఎల్ కో–చైర్మన్ జి.వి. ప్రసాద్ తెలిపారు.

ఫలితాల్లో ఇతర ముఖ్య విశేషాలు..

- కొత్త ఔషధాల ఆవిష్కరణ, ఉత్పత్తుల రేట్ల పెంపుతో భారత్ మార్కెట్లో ఆదాయం 10 శాతం పెరిగి రూ. 1,130 కోట్లకు చేరింది.
- కీలకమైన ఉత్తర అమెరికా మార్కెట్లో ఆదాయం 64 శాతం వృద్ధి చెంది రూ. 3,060 కోట్లుగా నమోదైంది. వర్ధమాన మార్కెట్లలో ఆదాయం 14 శాతం , యూరప్‌లో అమ్మకాలు ఆరు శాతం పెరిగాయి.
- క్యూ3లో పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై రూ. 480 కోట్లు వెచ్చించారు. పెట్టుబడి వ్యయాలపై కంపెనీ రూ. 1,500 కోట్లు వెచ్చించనుంది.

సోయగాల చేపలతో సిరులు

రాష్ట్రంలో ఏటా మూడు దఫాల్లో అలంకార చేపల సాగు

- బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఎగుమతి
- పెట్టుబడికి మూడు రెట్లు ఆదాయం
- పీఎంఎస్ఎస్‌వై కింద రూ.కోటిన్నర వరకు ఆర్థిక చేయూత
- మహిళలకు 30 శాతం, ఇతరులకు 25 శాతం సబ్సిడీ



సాక్షి, అమరావతి: రంగురంగుల చేపలు.. సోయగాల చేపలు సిరులు కురిపిస్తున్నాయి. ఒకప్పుడు ధనవంతుల ఇళ్లకే పరిమితమైన ఈ అలంకార చేపలు.. ఇప్పుడు మధ్యతరగతి, సామాన్య ప్రజల నివాసాల్లో కూడా కనువిందు చేస్తున్నాయి. దేశీయంగా, అంతర్జాతీయంగా వీటికి గిరాకీ పెరిగింది. అంతర్జాతీయంగా ఏటా రూ.15 వేల కోట్ల వ్యాపారం జరుగుతుంటే.. భారత్‌లో రూ.250 కోట్ల టర్నోవర్ జరుగుతోంది. దేశీయంగా ఈ అలంకార చేపల ఉత్పత్తిలో పశ్చిమబెంగాల్, తమిళనాడు, మహారాష్ట్ర ముందు వరుసలో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 2,500కు పైగా రకాల అలంకార చేపలను ఉత్పత్తి చేస్తుంటే.. మన దేశంలోని మంచి నీటిలో 375, ఉప్పు నీటిలో 165 రకాల చేపలను సాగు చేస్తున్నారు. ఏపీలో ఈ అలంకార చేపల సాగుకు రాయలసీమ కేంద్రంగా ఉంది. ముఖ్యంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వీటి సాగు విస్తరిస్తోంది. కాకినాడ, విశాఖపట్నంలో కూడా పెద్ద యూనిట్లున్నాయి. ఇక్కడ ఏటా మూడు దఫాల్లో సాగు చేస్తూ.. ఒక్కో విడతలో 1.20 లక్షల నుంచి 1.50 లక్షల చేపలను ఉత్పత్తి చేస్తున్నారు. బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

భారీగా ఆదాయం..

300 చదరపు అడుగుల ట్యాంకులో 3–4 సెంటీమీటర్ల సైజున్న 600 నుంచి 800 పిల్లలను వేస్తే నెలకు అంగుళం సైజుకొస్తాయి. రకాల ఆధారంగా గరిష్టంగా 300 నుంచి 500 గ్రాముల వరకు పెరుగుతాయి. అంగుళం సైజుకొస్తే చాలు.. మార్కెటింగ్ చేసుకోవచ్చు. నెలకు 13 వేల చేపల చొప్పున.. ఏటా లక్షకు పైనే పిల్లలు ఉత్పత్తి అవుతాయి. సాధారణ అలంకార చేప ధర రూ.10. కొన్ని రకాలైతే రూ.వందలు, రూ.వేలల్లో కూడా ఉంటాయి. రూ.3.40 లక్షల వరకు పెట్టుబడి పెడితే.. ఏటా రూ.10 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది.


20 రకాలను ఉత్పత్తి చేస్తున్నాం..



1.25 ఎకరాల్లో రూ.93 లక్షలతో క్లస్టర్ యూనిట్ ఏర్పాటు చేశాం. బ్రూడర్, రేరింగ్, లార్వా యూనిట్లతో పాటు 100 ట్యాంకులు, 100 అక్వేరియం యూనిట్లు పెట్టాం. 20 రకాల చేపల్ని ఉత్పత్తి చేస్తున్నాం.

– ఆర్.అలోక్, జె.ధీరజ్, ఆనందజ్యోతి ఆర్నమెంటల్ ఫిషరీస్ ఫామ్, కర్నూలు

రూ.1.50 లక్షలు పెడితే రూ.8 లక్షల ఆదాయం..



ప్రభుత్వ సహకారంతో గతేడాది కర్నూలులో అలంకార చేపల సాగు ప్రారంభించాం. ఎకరాకు ఓ పంటకు 1.50 లక్షల పెట్టుబడి పెడితే.. రూ.8 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ప్రస్తుతం సాగు చేస్తున్న అలంకార చేపల చెరువులను ఆర్నమెంటల్ ఫిష్ కల్చర్ మ్యూజియంగా తీర్చిదిద్దేందుకు యత్నిస్తున్నాం.

– రెడ్డిపోగు అశోక్, మామిదాలపాడు, కర్నూలు జిల్లా





రూ.కోటిన్నర వరకు చేయూత..

రాయలసీమతో పాటు ఉమ్మడి కృష్ణా, గోదావరి, విశాఖ జిల్లాలు అలంకార చేపల సాగుకు అనుకూలమని.. ఏటా కోటి చేపలు ఉత్పత్తి చేసే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేశారు. దీనిని ప్రోత్సహిస్తే కనీసం 25 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెబుతున్నారు. అలంకార చేపల సాగు యూనిట్లకు ప్రధానమంత్రి మత్స్య సమృద్ధి పథకంలో ఎంటర్‌ప్రెన్యూర్స్ స్కీమ్ కింద రూ.25 లక్షల నుంచి రూ.కోటిన్నర వరకు ఆర్థిక చేయూతనిస్తున్నారు. మహిళలకు 30 శాతం, ఇతరులకు 25 శాతం సబ్సిడీ అందిస్తున్నారు.

ఏపీలో విద్యుత్ నష్టాలు తక్కువ

- ఏటీసీ నష్టాలు 2018–19లో 16.36 శాతం
- 2021–22 నాటికి 11.21 శాతానికి తగ్గింపు
- నష్టాల తగ్గింపులో దేశంలోనే మొదటిస్థానం
- 5.15 శాతం నష్టాలు తగ్గించినందుకు కేంద్రం ప్రశంసలు
- 2024–2025 నాటికి ఏటీసీ నష్టాలను 12–15 శాతానికి తగ్గించాలని సూచన
- ఇప్పటికే ఆ లక్ష్యానికి చేరుకున్న రాష్ట్ర డిస్కంలు



అన్ని రాష్ట్రాల విద్యుత్ సంస్థలతో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి ఆర్.కె.సింగ్

సాక్షి, అమరావతి: ప్రజలకు మెరుగైన సేవలందించడంలో దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోటీపడి ఆంధ్రప్రదేశ్ ముందంజలో నిలుస్తోంది. ఆ కోవలోనే విద్యుత్ రంగంలో విప్లవాత్మక చర్యలను అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవడమేగాక జాతీయస్థాయిలో అవార్డులు అందుకుంటోంది. తాజాగా టెక్నికల్, కమర్షియల్ (ఏటీసీ) నష్టాలను తగ్గించడంలో ఏపీ ముందంజలో నిలిచి కేంద్రం నుంచి ప్రశంసలు అందుకుంది. అన్ని రాష్ట్రాల విద్యుత్ సంస్థలతో బుధవారం కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్.కె. సింగ్ వర్చువల్‌గా సమీక్షించారు. రాష్ట్రాల వారీగా విద్యుత్ సంస్థల పనితీరు, రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్) పురోగతిపై చర్చించారు. ఆర్‌డీఎస్ఎస్‌లో ప్రధానంగా పరిగణించే ఏటీసీ నష్టాలు మన రాష్ట్రంలో 2018–19లో 16.36 శాతం ఉండేవి. 2021–22లో అవి 11.21 శాతానికి తగ్గాయి. ఈ కాలంలో మూడుశాతానికి పైగా నష్టాలను తగ్గించిన రాష్ట్రాల జాబితాను కేంద్రమంత్రి ప్రకటించారు. ఈ రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, హరియాణ, జార్ఖండ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మేఘాలయ, పంజాబ్, రాజస్థాన్, త్రిపుర, పశ్చిమబెంగాల్ ఉన్నాయి. 5.15 శాతం నష్టాల తగ్గింపుతో ఏపీ దేశంలోనే మొదటిస్థానంలో నిలిచింది. 2024–2025 నాటికి ఏటీసీ నష్టాలను 12–15 శాతానికి తగ్గించాలని కేంద్రం నిర్దేశించిన లక్ష్యాన్ని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) ఇప్పుడే చేరుకున్నాయి. ఉదయ్ డ్యాష్‌బోర్డ్ ఆధారంగా డిస్ట్రిబ్యూషన్ యుటిలిటీ ఫోరం విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 12 రాష్ట్రాల్లో ఏటీసీ నష్టాలు 25 శాతం కంటే ఎక్కువ, ఆరు రాష్ట్రాలలో 15–25 శాతం మధ్య ఉన్నాయి. రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ సంస్థల పనితీరును అంచనా వేయడానికి కేంద్రం ఈ ఏటీసీ నష్టాలనే ప్రామాణికంగా తీసుకుంటోంది. అవి తక్కువగా ఉన్న, వేగంగా తగ్గించుకుంటున్న రాష్ట్రాలకు మాత్రమే ఆర్‌డీఎస్ఎస్ ద్వారా నిధులు సమకూరుస్తామని స్పష్టం చేసింది. మరోవైపు ప్రీపెయిడ్ మోడ్‌లో స్మార్ట్‌మీటర్లు అమర్చడంపైనా మంత్రి ఆరాతీశారు. వ్యవసాయ ఫీడర్లకు సౌరవిద్యుత్ వినియోగం ప్రయోజనకరమని తెలిపారు. ఏపీ ఈ దిశగా సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ (సెకీ) నుంచి ఏడువేల మెగావాట్ల సౌరవిద్యుత్ కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. దీనివల్ల వ్యవసాయ వినియోగదారులకు పగటిపూట తక్కువ ఖర్చుతో విద్యుత్‌ను అందించవచ్చని మంత్రి వెల్లడించారు.

7 పోక్సో కోర్టులకు జడ్జీలు

గుంటూరు లీగల్: రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో ఏడు పోక్సో కోర్టులకు జిల్లా జడ్జీలను బదిలీపై నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) సునీత బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయా జిల్లా జడ్జీలను అక్కడే ఉన్న పోక్సో కోర్టులకు బదిలీ చేశారు. అనంతపురంలోని ఎస్సీ, ఎస్టీ, ఎనిమిదో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి టి.రాజ్యలక్ష్మి, చిత్తూరులోని ప్రత్యేక మహిళా కోర్టు, ఐదో అదనపు జిల్లా జడ్జి ఎస్.శాంతి, కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని ప్రత్యేక మహిళా కోర్టు, తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి డాక్టర్ షేక్ మహమ్మద్ ఫజులుల్లా, నెల్లూరులోని ప్రత్యేక మహిళా కోర్టు, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి సిరిపిరెడ్డి సుమ, ఒంగోలులోని ప్రత్యేక మహిళా కోర్టు, రెండో అదనపు జిల్లా జడ్జి ఎం.ఎ.సోమశేఖర్, విశాఖపట్నంలోని ప్రత్యేక మహిళా కోర్టు, ఏడో అదనపు జిల్లా జడ్జి జి.ఆనంది, ఏలూరులోని ల్యాండ్ రీఫామ్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్, రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఉమసునందలను పోక్సో కోర్టులకు జడ్జీలుగా బదిలీ చేశారు. బదిలీ అయిన వారు పోక్సో కోర్టులకు జడ్జీలుగా కొనసాగుతూనే, ప్రస్తుతం వారు పనిచేస్తున్న జిల్లా కోర్టులకు ఫుల్ అడిషనల్ చార్జి జడ్జిగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. జనరల్ బదిలీలు జరిగే వరకు ఫుల్ అడిషనల్ చార్జి జడ్జీలుగా కొనసాగాలని తెలిపారు.

సామరస్యమే భారతీయం

- శాంతా బయోటెక్నిక్స్ చైర్మన్ వరప్రసాదరెడ్డి
- వివేకానంద జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం

అనపర్తి: సమన్వయమే సనాతనం, సామరస్యమే భారతీయమని శాంతా బయోటెక్నిక్స్ చైర్మన్ కేఐ వరప్రసాదరెడ్డి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంత్యుత్సవం –2023ను బుధవారం నిర్వహించారు. స్థానిక జీబీఆర్ విద్యాసంస్థల ఓపెన్ ఆడిటోరియంలో సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో వరప్రసాదరెడ్డి మాట్లాడుతూ సంప్రదాయం, కట్టుబాట్లు, జీవన విధానం దేశం విలువలను తేటతెల్లం చేస్తాయన్నారు. నేడు మాతృభాషకు, దానికి తల్లిలాంటి సంస్కృత భాషకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ సమాజం ఉన్నతి సాధించకపోతే వ్యక్తి ఉన్నతి సాధించలేడన్నారు. క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర రావు, గాయని డాక్టర్ శోభారాజు, రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి వినిశ్చలానందజీ మహరాజ్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జీబీఆర్ విద్యాసంస్థల అధినేత తేతలి కొండబాబు ప్రసంగించారు. అనంతరం డాక్టర్ కేఐ వరప్రసాదరెడ్డి, జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, డాక్టర్ శోభారాజుకు స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేశారు. సీనియర్ న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డి, వ్యాపారవేత్తలు మేడపాటి రామలింగారెడ్డి, తేతలి ఉపేంద్రరెడ్డి పాల్గొన్నారు.



వివేకానంద జీవన సాఫల్య పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

పొగమంచుతో విమానాల ల్యాండింగ్‌కు ఆటంకం

విమానాశ్రయం(గన్నవరం): దట్టమైన పొగమంచు కారణంగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం)లో బుధవారం విమానాల ల్యాండింగ్‌కు ఆటంకం ఏర్పడింది. రన్‌వేపై దిగేందుకు విజిబులిటీ లేకపోవడం వల్ల ఒక విమానం వెనక్కి వెళ్లగా మరో రెండు విమానాలు అర గంట పాటు గాలిలో చక్కర్లు కొట్టిన తర్వాత ల్యాండ్ అయ్యాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి విమానాశ్రయ రన్‌వే ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు దుప్పటిలా కప్పివేసింది. షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్ నుంచి ఉదయం 7.35కు ఇక్కడికి వచ్చిన ఇండిగో విమానం రన్‌వే విజిబులిటీ లేక అరగంట గాలిలో చక్కర్లు కొట్టింది. అయినప్పటికీ వాతావరణం అనుకూలించకపోవడంతో ఏటీసీ సూచన మేరకు ఈ విమానం తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయింది. అనంతరం బెంగళూరు నుంచి 8.20 గంటలకు వచ్చిన ఇండిగో విమానం, ఢిల్లీ నుంచి 8.25కు వచ్చిన ఎయిరిండియా విమానానికి కూడా పొగమంచు వల్ల ఇబ్బందులు తప్పలేదు. సుమారు అరగంట గాలిలో చక్కర్లు కొట్టిన ఈ రెండు విమానాలు చివరికి రన్‌వేపై లైటింగ్ ఆధారంగా ఐదు నిమిషాల తేడాతో సురక్షితంగా ల్యాండ్ అయ్యాయి. హైదరాబాద్ వెనక్కి వెళ్లిన ఇండిగో విమానం తిరిగి 10 గంటల తర్వాత ఇక్కడికి చేరుకుంది.

జనవరి జీతాల బిల్లుల సమర్పణ గడువు పెంచాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జనవరి నెల జీతాల బిల్లుల సమర్పణలో సాంకేతిక సమస్యలు ఏర్పడిన కారణంగా జీతాల బిల్లులు సమర్పణకు గడువు పెంచాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, యస్. చిరంజీవి కోరారు. టీచర్లు, ఉద్యోగుల పేర్లు, క్యాడర్ స్ట్రెంత్‌లు పేరోల్‌లో మిస్సింగ్ అయ్యాయన్నారు. దీంతో టీచర్లు, ఉద్యోగులు హెల్ప్ డెస్క్, సి.ఎఫ్.ఎం.ఎస్‌లో యస్ఆర్‌లు సృష్టించి తిరిగి పేరోల్‌లో పేర్లు, క్యాడర్ స్ట్రెంత్ లను నమోదు చేసుకుంటున్నారన్నారు. అందువల్ల జీతాల బిల్లుల సమర్పణ గడువు జనవరి 29 వరకు పెంచాలని ట్రెజరీ శాఖ డైరెక్టర్ మోహన్ రావు, సీఎఫ్ఎంఎస్ మేనేజర్ వెంకట రెడ్డికి విన్నవించగా వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

వి'వాహ్' శుభలేఖ




రెండు వేల రూపాయల నోటు తరహాలో పెళ్లి శుభలేఖ అచ్చు వేయించి అందర్నీ ఆశ్చర్యపరిచారు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ఏడిద వెంకటేష్. తన చిన్న కుమార్తె పెళ్లికి పరిమాణంలో.. రూపంలో అచ్చం రెండు వేల రూపాయల నోటును పోలినట్లుంది పెళ్లి కార్డు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని అక్షరాలుండే చోట రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ లవ్ అనే పదముంది. 'మేము ఇరువురం వివాహం చేసుకుంటున్నాం.. జీవితపు చివరి శ్వాసవరకూ కలసి ఉంటామని వాగ్దానం చేస్తున్నాం' అని సింపుల్‌గా సారాంశం ఉంది. నోటుకు మరోవైపు పెళ్లి వివరాలు ముద్రించారు. కొందరికి శుభలేఖ చేతిలో పెడుతుంటే నిజంగా రెండు వేల నోటు అనుకుని నోటు తీసుకునేందుకు మొహమాటపడ్డారు. శుభలేఖేనని తెలుసుకుని వారి సృజనశైలిని మెచ్చుకున్నారు. కాగా, 2017లో వెంకటేష్ తన పెద్ద కుమార్తె పెళ్లికి ఆహ్వాన పత్రికను బ్యాంక్ ఏటీఎం కార్డు తరహాలో ముద్రించి ఆకట్టుకున్నారు. తక్కువ ఖర్చు, సృజనాత్మకత కోసమే తాను ఇలా చేశానని వెంకటేష్ 'సాక్షి'కి తెలిపారు.

\- రాజమహేంద్రవరం సిటీ

ధిక్కార కేసులో జవహర్‌రెడ్డి, ప్రవీణ్‌ప్రకాశ్ వ్యక్తిగత హాజరుకు హైకోర్టు ఆదేశం

- విచారణ ఫిబ్రవరి 22కి వాయిదా

సాక్షి, అమరావతి: కోర్టు ధిక్కార కేసులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్‌ల వ్యక్తిగత హాజరుకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. విచారణను ఫిబ్రవరి 22కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. తమ సర్వీసులను నియామక తేదీ నుంచి క్రమబద్ధీకరించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ అనంతపురం జిల్లా కదిరికి చెందిన కాంట్రాక్ట్ లెక్చరర్ దాసరి ఉమాదేవి, మరో 114 మంది హైకోర్టులో 2021లో పిటిషన్ దాఖలు చేశారు. శాశ్వత అధ్యాపకులకు కల్పిస్తున్న విధంగానే తమకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ రాజశేఖరరావు విచారించారు. ఈ విచారణకు ప్రభుత్వ న్యాయవాది హాజరుగాకపోవడంతో న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పిటిషనర్లు కోరిన విధంగా మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. అయితే ఈ ఉత్తర్వులను అధికారులు అమలు చేయలేదంటూ దాసరి ఉమాదేవి తదితరులు కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ తదితరులను ప్రతివాదులుగా చేర్చారు. ఈ ధిక్కార వ్యాజ్యంపై జస్టిస్ రాజశేఖరరావు విచారించారు. ఈ వ్యాజ్యాన్ని ఎందుకు విచారణకు స్వీకరించరాదో స్వయంగా హాజరై లేదా న్యాయవాది ద్వారా వివరణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అయితే విచారణకు ఎవరూ హాజరు కాకపోవడంతో జవహర్‌రెడ్డి, ప్రవీణ్‌ప్రకాశ్‌లకు కోర్టు ధిక్కార చట్టం కింద ఫాం-1 నోటీసులు జారీచేశారు. వారిద్దరి వ్యక్తిగత హాజరుకు ఆదేశాలిచ్చారు.

ఓటు హక్కు సద్వినియోగంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

- గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్



సాక్షి, అమరావతి: ప్రజలందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పిలుపునిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవంలో ఆయన ప్రసంగిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలో సామాన్యుల అస్త్రం ఓటు హక్కని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారందర్నీ ఓటర్లుగా నమోదు చేయించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు కొత్తగా 3.03 లక్షల మంది ఓటర్ల నమోదుతో పాటు, మొత్తం 3,99,84,868 మంది ఓటర్లున్నట్లు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన కళాశాల విద్య కమిషనర్ పి.భాస్కర్, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, చిత్తూరు, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు కేవీఎస్ చక్రధర్‌బాబు, ఎం.హరినారాయణ, ఎ.మల్లికార్జున, పి.ప్రశాంతి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో ఎంఎన్.హరేంద్ర ప్రసాద్, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ఎస్పీ సీహెచ్ విజయరావు, శాసనమండలి డిప్యూటీ సెక్రటరీ కె.రాజ్‌కుమార్‌లతో పాటు ఏఆర్‌వోలు, బీఆర్‌వోలకు గవర్నర్ ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు బహూకరించారు.

ఐరన్ స్క్రాప్‌తో పునీత్ రాజ్‌కుమార్ విగ్రహం



తెనాలి: కర్ణాటకకు చెందిన ప్రముఖ సినీనటుడు డాక్టర్ పునీత్ రాజ్‌కుమార్ అభిమానుల వినతిపై ఆయన నిలువెత్తు ఐరన్ స్క్రాప్ విగ్రహాన్ని గుంటూరు జిల్లా తెనాలిలోని సూర్య శిల్పశాల శిల్పకారులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర తయారు చేశారు. టన్నున్నర ఐరన్ స్క్రాప్‌ను వినియోగించి నాలుగు నెలలు శ్రమించి తొమ్మిది అడుగుల విగ్రహాన్ని సిద్ధం చేశారు. బెంగళూరులోని ఓ ప్రధాన కూడలిలో ప్రతిష్ఠించనున్నారు.

సెల్ఫీ తీసుకుంటుండగా కోబ్రా కాటేసింది

పామును మెడలో వేసుకుని ఫొటోలకు ఫోజు

- కిందపడ్డ పామును పట్టుకోబోగా కాటేసిన నాగు
- ఆస్పత్రికి తరలించగా ప్రాణాలొదిలిన యువకుడు



మణికంఠరెడ్డి (ఫైల్)

కందుకూరు: నాగుపాముతో సెల్ఫీకి ప్రయత్నించిన ఓ యువకుడు ఆ పాము కాటేయడంతో ప్రాణాలొదిలాడు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణంలోని కోవూరు రోడ్డులో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకోగా.. బుధవారం వెలుగులోకి వచ్చింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం బొద్దికూరపాడు గ్రామానికి చెందిన పోలంరెడ్డి సాయిమణికంఠరెడ్డి (22) కందుకూరులోని జేపీ కాంప్లెక్స్‌లో షాపును అద్దెకు తీసుకుని జ్యూస్ షాపు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో పాములు పట్టి ఆడించే వెంకటస్వామి అనే వ్యక్తి ఆ షాపు వద్దకు వచ్చాడు. ఆ పామును చూసి సంబరపడిన మణికంఠరెడ్డి పాముతో సెల్ఫీలు తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలో పామును మణికంఠరెడ్డి మెడలో వేసుకోగా.. ఆ పాము జారి కిందపడిపోయింది. దీంతో మణికంఠరెడ్డి పాము తోక పట్టుకునే ప్రయత్నంలో అది ఒక్కసారిగా వెనక్కి తిరిగి కాటేసింది. వెంటనే స్నేహితులు మణికంఠను ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స ప్రారంభించిన కొద్దిసేపటికే మణికంఠ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. మెరుగైన చికిత్స కోసం ఒంగోలు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు.

కోరలు లేవని చెప్పడం వల్లే..

పామును ఆడించే వ్యక్తి మద్యం మత్తులో ఉండటంతో మణికంఠరెడ్డి ఫొటోల కోసం అడిగిన వెంటనే పామును ఇచ్చేశాడు. దానికి కోరలు తీసేశానని, అందువల్ల కాటేయదని చెప్పాడు. దీంతో మణికంఠరెడ్డి భయం లేకుండా పామును మెడలో వేసుకుని సరదాగా ఫొటోలు, సెల్ఫీలు తీసుకునే ప్రయత్నం చేశాడు. అది కాటేసిన తరువాత కూడా కోరలు తీసేశానని, కాటేసినా విషం ఎక్కదని దానిని ఆడించే వ్యక్తి చెప్పాడు. అయినా స్నేహితులు ఆస్పత్రికి తీసుకెళ్లగా.. కాటేసిన పాము అత్యంత విషపూరితమైన కింగ్ కోబ్రా జాతికి చెందినది కావడంతో ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ఘటనా స్థలాన్ని కందుకూరు సీఐ వెంకట్రావ్, ఎస్సై కిశోర్ పరిశీలించారు. పామును తీసుకొచ్చిన వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 305

గురువారం 26-1-2023



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



Please Call: 040 – 4753 5555
vijay sales
Shop On www.vijaysales.com
షోరూమ్ ఉదయం 10 గం॥లకు తెరవబడుతుంది
మెగా రిపబ్లిక్ డే సేల్
గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని ఆకర్షణీయమైన ఆఫర్ల కొరకు మా 'స్టోర్'కు విచ్చేయండి!
32 (80cm) LED TV
Republic Day Offer
₹6,990
VISE LED TV
Also available Range
43 (108cm) | 50 (125cm)
55 (138cm) | 65 (164cm)
LG 4K UHD LED TV
EMI STARTS FROM ₹2,999/-
CASHBACK UP TO ₹3,500/-
SAMSUNG 4K NEO QLED TV
Free Galaxy A23 (4G|6GB)
EMI STARTS FROM ₹1,990/-
CASHBACK UP TO ₹7,500/-
SANSUI 4K QLED TV
PRICE ₹79,990/-
65 (164cm) 4K QLED TV
VSP ₹52,999
Also available in:
55 (138cm) 4K QLED TV OFFER PRICE ₹34,990/-
MacBook Air M1
8GB | 256GB
PRICE ₹84,900/-
Instant Cashback ₹10,000
Trade in Value ₹13,000
Trade in Bonus ₹10,000
Effective Price ₹51,900*/-
iPad 9th Gen Wi-Fi 64GB
PRICE ₹31,599/-
Instant Cashback ₹3,000
Effective Price ₹28,599*/-
hp
Also Get Up To ₹14,000/- Exchange Bonus On Select Laptops
• On Select HP Laptops Get Up To ₹10,000/- Cashback
• One month EMI off on Bajaj Finance
*T&C – Offers applicable on Select Banks CC/DC EMI transactions.
Lenovo
LEGION GAMING, SLIM 5, FLEX 5 & YOGA SERIES
5% Cashback Up To ₹ 5,000/-
On Select Bank Cards (CC / DC)
Avail 3|0, 6|0, EMI on Select Bank Cards (CC / DC)
DELL
• Get 2 Years Dell Warranty Starting @ 399*
• JBL Buds OR JBL Speakers @ 999*
• Get UP TO 5000 Cashback*
iPhone 13 (128GB)
PRICE ₹64,900/-
Instant Cashback ₹2,000
Trade in Value ₹15,000
Trade in Bonus ₹6,000
Effective Price ₹41,900*/-
(Price inclusive of offer)
SAMSUNG GALAXY S20FE 5G 8GB | 128GB
Cashback Up To ₹5,000/- Leading Banks
VSP ₹33,999/-
REDMI NOTE 12 PRO 5G 6GB | 128GB
Cashback Up To ₹3,000/- ICICI Bank CC/DC
New Arrival
VSP ₹24,999/-
OPPO A78 5G 8GB | 128GB
10% Cashback Up To ₹1,500/- Leading Banks
New Arrival
VSP ₹18,999/-
Watch Series 8 41mm GPS
PRICE ₹42,900/-
Instant Cashback ₹3,000
Trade in Value ₹3,000
Trade in Bonus ₹2,000
Effective Price ₹34,900*/-
UP TO 50% OFF
Latest Models - Large Capacity with Bubble Storm & Hygiene Steam
Latest Models - Convertible and Inverter Technology
Chimney & Cooktop UP TO 50% OFF
V-GUARD GEYSER VINSTA 3L
41% Savings
PRICE ₹5,090/-
OFFER PRICE ₹2,999/-
BAJAJ 2 Ltrs WET GRINDER WITHOUT ARM
39% Savings
PRICE ₹6,850/-
OFFER PRICE ₹4,199/-
BOSCH MIXER GRINDER 1000 W 4 JAR
38% Savings
PRICE ₹10,590/-
OFFER PRICE ₹6,599/-
EUREKA FORBES
AQUAGUARD Water Purifier EDEN RO+UV+MTDS+SS
PRICE ₹36,500/-
40% Savings
OFFER PRICE ₹21,990/-
Smart Watches Starting ₹1,399/-
Portable Speaker Starting ₹999/-
Earphone, Bluetooth Neckband & True Wireless Buds Starting ₹349/-
Bluetooth Headphone Starting ₹499/-
Mobile & IT Accessories Starting ₹199/-
Up To ₹7,500/- Instant Discount, Cashback on Banks & Paper Finance
Scan to Shop Online
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | తిరుపతి | కాకినాడ | హైదరాబాద్ | వరంగల్ | ముంబై | ఢిల్లీ | థానే | నవీ ముంబై | పూనే | సూరత్ | వడోదర | అహ్మదాబాద్ | గురుగ్రామ్ | ఫరీదాబాద్ | నోయిడా | ఇందిరాపురం
మీ దగ్గరలోని ఏదైనా మా 'షోరూమ్'ను నేడే సందర్శించండి:
కాకినాడ: అపోలో హాస్పిటల్ పక్కన, మెయిన్ రోడ్, సూర్యారావుపేట, శివ కుమార్ - 73373 76220
పటమట (విజయవాడ): NTR సర్కిల్ పక్కన, రజనీ కుమార్ – 96665 03755
రాజమండ్రి: సాయి కృష్ణ థియేటర్ ఎదురుగా, ఇన్నీస్ పేట, సతీష్ – 88866 74548
రాజమండ్రి: జే ఎన్ రోడ్: సితార రెస్టారెంట్ ఎదురుగా, గౌతమ్ – 91549 03693
తిరుపతి: లీలా మహల్ సెంటర్- పీ.ఎస్ 4 రెస్టారెంట్ ప్రక్కన, కిరణ్ రాజు– 99482 28111
తిరుపతి: ఎమ్ ఆర్ పల్లి సర్కిల్, వేణు – 99480 30111
విజయవాడ: సూర్య టవర్స్, ఫార్ట్యూన్ మురళి పార్క్ హోటల్ పక్కన, ఈశ్వర్ – 88866 53042
విశాఖపట్నం: 48వ నెంబర్ బస్ స్టాప్ ఎదురుగా, దొండపర్తి, రమేష్ – 99482 41112
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. *Processing Fee is applicable as per Financier.
For Paper Finance: Please bring Adhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance Com Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank.
For corporate bookings or bulk orders, please mail us at corporatesales@vijaysales.com



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+8 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 305

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అతివల క్రికెట్‌కు అందలం

ఉమెన్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా బీసీసీఐ ప్రకటించిన 5 జట్ల కోసం ఫ్రాంచైజీలు మొత్తం రూ.4,669.99 కోట్లు వెచ్చించాయి.

- వివరాలు 5లో ▶



ఫైనల్లో సానియా-బోపన్న జోడీ

ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత్ క్రీడాకారులు రోహన్ బోపన్న, సానియా మీర్జా జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది.

- వివరాలు 5లో ▶

ఐటీ 'నగ'రాలు

- మహా నగరాల నుంచి నగరాల దిశగా ఐటీ కంపెనీలు
- కోవిడ్ అనంతరం శాటిలైట్ సెంటర్స్ ఏర్పాటు
- ఉద్యోగులు ఉన్న చోటే కార్యాలయాలు తెరుస్తున్న ఐటీ సంస్థలు
- ఆర్థిక మాంద్యం ప్రభావంతో వ్యయాన్ని తగ్గించుకునే చర్యలు
- విశాఖలో ఇప్పటికే రాండ్‌స్టాడ్, ఇన్ఫోసిస్.. విస్తరిస్తున్న టెక్ మహీంద్రా, విప్రో, ఐబీఎం
- విశాఖలో కార్యాలయాలను ప్రారంభించే యోచనలో హెచ్‌సీఎల్
- చర్చలు జరుపుతున్న పలు ఐటీ కంపెనీలు



సాక్షి, అమరావతి: అంతర్జాతీయంగా పేరు పొందిన ఐటీ కంపెనీలు ఇప్పుడు మహా నగరాల నుంచి నగరాల వైపు చూస్తున్నాయి. టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్, యాక్సెంచర్, మైండ్‌ట్రీ లాంటి ఐటీ దిగ్గజాలు విశాఖపట్నం, నాగ్‌పూర్, కోయంబత్తూర్, కొచ్చిన్ లాంటి నగరాలపై దృష్టి సారించాయి. కోవిడ్ సమయంలో ఉద్యోగులంతా వర్క్ ఫ్రమ్ హోమ్ విధానానికి అలవాటు పడటం, తిరిగి కార్యాలయాలకు వచ్చేందుకు సుముఖంగా లేకపోవడం, కమ్ముకొస్తున్న ఆర్థిక మాంద్యం ప్రభావంతో కంపెనీలు వ్యయాలను తగ్గించుకునే ప్రయత్నాల్లో ఉండటం ఇందుకు ప్రధాన కారణమని ఐటీ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

ఖర్చులు తగ్గించుకునేందుకు..

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న తాజా పరిస్థితుల నేపథ్యంలో వ్యయ నియంత్రణలో భాగంగా పలు ఐటీ కంపెనీలు భారీగా ఉద్యోగులను తొలగిస్తూ మానవ వనరులు అందుబాటులో ఉండే నగరాల్లో శాటిలైట్ కార్యాలయాలను (చిన్న స్థాయి) ప్రారంభించేందుకు మొగ్గు చూపుతున్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న మార్పులు రాష్ట్రంలో ఐటీ రంగ విస్తరణకు మంచి అవకాశాలను కల్పిస్తున్నాయి. ఇన్ఫోసిస్, ఐబీఎం, హెచ్‌సీఎల్, ఐబీఎం, విప్రో లాంటి ఐటీ దిగ్గజ కంపెనీలు ఇప్పుడు రాష్ట్రంలో కొత్తగా అడుగు పెట్టడం లేదా కార్యాలయాలను విస్తరించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఇన్ఫోసిస్..

మిగతా 2వ పేజీలో ▶

పెట్టుబడుల ఆకర్షణకు రోడ్‌షోలు

- ఈ షోల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు వివరిస్తాం
- జీఐఎస్ వేదిక నుంచే సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- 13 రంగాల్లో కంపెనీలను ఆకర్షించేందుకు కృషి: మంత్రి అమర్‌నాథ్

2లో

అమెరికాకు ప్రకృతి ఉత్పత్తులు

- ప్రొడ్యూసర్ మార్కెట్.కామ్‌తో రైతు సాధికార సంస్థ చర్చలు
- తొలి దశలో వరి, శనగ, కాఫీ, పామాయిల్

2లో




బాపట్ల జిల్లా కొత్తపాలెంలో ఓ మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు


తిరుపతి జిల్లా తొరూరు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి ఆర్కే రోజా

మన ప్రభుత్వం


తూర్పు గోదావరి జిల్లా చీపురుపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


విశాఖపట్నంలోని 5వ వార్డు మారికవలసలో కల్లు గీత కార్మికుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్

క్లుప్తంగా...

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ రాష్ట్ర ప్రజలకు 74వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు, సేవలను స్మరించుకుని దేశాభివృద్ధికి అందరం పునరంకితం కావాలని ఆయన ఆకాంక్షించారు. దేశ స్వాతంత్య్రోద్యమానికి ఊపిరి లూదిన సత్యం, అహింస, సౌభాతృత్వం భావనలు సదా అనుసరణీయమని ఆయన పేర్కొన్నారని రాజ్‌భవన్ వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపాయి.

రేపు శ్రీవాణి టికెట్ల ఫిబ్రవరి నెల కోటా విడుదల

తిరుమల: తిరుమలలో ఫిబ్రవరి నెలకు సంబంధించిన శ్రీవాణి టికెట్ల కోటా ఈ నెల 27వ తేదీన ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో టీటీడీ విడుదల చేయనున్నట్లు టీటీడీ పీఆర్వో విభాగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీవాణి ట్రస్ట్‌కు రోజుకు 1000 టికెట్లు కేటాయిస్తుండగా, అందులో 750 టికెట్లు ఆన్‌లైన్‌లో, 250 టికెట్లు కరెంట్ బుకింగ్ ద్వారా ఇస్తారని పేర్కొంది. భక్తులు దీనిని గమనించి తగినట్టుగా బుక్ చేసుకోవాలని కోరింది.

ప్రైవేటు లేఅవుట్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం

- ప్రభుత్వానికి 5% స్థలం కేటాయించాలన్న జీవో 145 ఉపసంహరణ

సాక్షి, అమరావతి: ప్రైవేట్ లే అవుట్లలో ఐదుశాతం స్థలం ప్రభుత్వానికి కేటాయించాలంటూ ఇచ్చిన జీవో నంబర్ 145ను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే సంస్థలు, వ్యక్తులు వేసే లేఅవుట్ స్థలంలో ఐదుశాతం ఆర్థికంగా వెనుకబడిన వారికి కేటాయించాలని ప్రభుత్వం 2021 డిసెంబర్‌లో ఈ జీవో జారీచేసింది. దీంతో ఇప్పటివరకు ఐదుశాతం స్థలాన్ని రిజర్వ్ చేస్తేనేగాని లేఅవుట్‌కు అనుమతి ఇవ్వని పరిస్థితి ఉంది. వివిధ రియల్ ఎస్టేట్ సంస్థలు, ప్రజల నుంచి ఆ నిబంధనను సవరించాలని విజ్ఞప్తులు అందడంతో ప్రభుత్వం జీవో నంబర్ 145ను ఉపసంహరించుకుంది. ఈ మేరకు బుధవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు.

'ఇంటెల్'లో ఆత్మకూరు యువకుడికి కొలువు

- వార్షిక ఆదాయం రూ.1.2 కోట్లు


వెంకటసాయికృష్ణారెడ్డికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు


ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు యువకుడికి యునైటెడ్ స్టేట్స్ ఇంటెల్ సంస్థలో వార్షిక ప్యాకేజీ రూ.1.2 కోట్లతో కొలువు దక్కింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం పాతజంగాలపల్లికి చెందిన ఈగా మురళీమనోహర్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు వెంకట సాయికృష్ణారెడ్డి ఖరగ్‌పూర్ ఐఐటీలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో ఈ ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఐఐటీ చివరి సంవత్సరం చదువుతున్న సాయికృష్ణారెడ్డి వచ్చే మే నెలలో ఈ కోర్సు పూర్తి చేసుకుని, ఆగస్టులో యూఎస్‌కు వెళ్లి ఉద్యోగంలో చేరనున్నారు. ఈ సందర్భంగా మురళీమనోహర్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతులు మాట్లాడుతూ కాయకష్టం చేసి రైతులుగా తాము సంపాదించిన సొమ్మంతా బిడ్డల భవిష్యత్ కోసమే వెచ్చిస్తున్నామని, వారు ఉన్నత స్థాయిలో ఉండడం కంటే తమకు వేరే కోరికలు లేవని భావోద్వేగానికి గురయ్యారు.

రాష్ట్ర సచివాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం

సాక్షి, అమరావతి : ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్న ప్రక్రియలో భాగంగా బుధవారం రాష్ట్ర సచివాలయంలో సాధారణ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్వీసెస్ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్ పాల్గొని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

డెస్క్ నుంచి డిస్క్ దాకా..

జాబ్‌లో జాగ్రత్తగా లేకుంటే జబ్బుల సమస్య



కూర్చుని తింటే కొండలైనా కరిగిపోతాయన్నది ఎప్పటి నుంచో ఉన్న నానుడి. కానీ కూర్చుని కదలకుండా పనిచేస్తే కొండంత ఆరోగ్య సమస్యలూ చుట్టుముడతాయన్నది నేటి సామెతగా మారింది. ఐటీతో పాటు అనేక రంగాల్లో కంప్యూటర్ల ముందు కూర్చుని చేసే డెస్క్‌జాబ్స్ పెరిగిపోయాయి. ఆ ఉద్యోగాల్లో ఎక్కువసేపు కూర్చునే ఉండటం, పనిఒత్తిడి కారణంగా వివిధ రకాల వ్యాధులూ పెరిగిపోతున్నాయి. అందువల్ల పనిప్రదేశంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.
- సాక్షి, హైదరాబాద్

- ఎక్కువ సేపు కూర్చుని పనిచేసే ఉద్యోగాలతో ఆరోగ్య సమస్యలు
- మెడ, వెన్నెముక, కంటి ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం.. వ్యాయామం లేకుంటే.. బీపీ, మధుమేహం వంటి వ్యాధులు కూడా
- పని చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

నిపుణుల సూచనలు

- కంప్యూటర్ ముందు కూర్చున్నప్పుడు వెన్నెముక కుర్చీకి ఆసాంతం ఆనుకునేలా నిటారుగా కూర్చోవాలి. కళ్లకు, స్క్రీన్‌కు మధ్య తగినంత దూరం ఉండేలా ఉంచుకోవాలి. పాదాలను నేలపై విశ్రాంతిగా ఆనించి ఉంచి మోకాలి వద్ద 90 డిగ్రీల కోణంలో కాళ్లు ఉంచాలి.
- మోచేయి ఎక్కువగా ఒత్తిడికి గురికావడం వల్ల కలిగే 'టెన్నిస్ ఎల్బో' సమస్య డెస్క్ జాబ్ ఉద్యోగుల్లో పెరుగుతోంది. ఈ పరిస్థితిలో కీబోర్డు, మౌస్‌లను వినియోగించేప్పుడు మణికట్టును వదులుగా ఉంచాలి.
- 45 నిమిషాల నుంచి గంట కంటే ఎక్కువసేపు నిర్విరామంగా కూర్చోవడం మంచిది కాదు. మధ్య మధ్యలో నిలబడటం, నడవటం చేయాలి.
- పని సమయంలో కాఫీలు/టీలు ఎక్కువగా తాగడం వల్ల డీహైడ్రేషన్ అవకాశాలు పెరుగుతాయి.
- ప్రతి 20 నిమిషాల పాటు కంప్యూటర్, ల్యాప్‌టాప్ స్క్రీన్‌పై పనిచేశాక.. కనీసం 20 సెకన్లపాటు మీకు దూరంగా ఉన్న వస్తువులను చూడాలి. దీనివల్ల కంటిపై ఒత్తిడి తగ్గుతుంది.

డెస్క్ వర్క్.. 'డిస్క్'పై ఎఫెక్ట్..

ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం వల్ల శరీరంలో శక్తి ఖర్చు తగ్గి కొవ్వు పేరుకుపోతోంది. ఇది ఊబకాయానికి దారితీస్తుంది. ముందుకు వంగి కూర్చోవడం వల్ల వెన్నెముకపై ప్రభావం పడుతోంది. తొలుత పనిచేసేటప్పుడే ఈ ఒత్తిడి ఉంటుంది. తర్వాత పడుకున్నప్పుడు కూడా ఇబ్బంది పెడుతుంది. కొన్నేళ్లలో ఇది పూర్తి స్థాయి డిస్క్ సమస్యగా మారుతుంది. పనిచేసే చోట కూర్చునే తీరులో లోపాలు, దీర్ఘకాల పని గంటలే దీనికి కారణమని వైద్య నిపుణులు చెప్తున్నారు.

మణికట్టుపై 'పని'కట్టు



కార్పల్ టన్నెల్ సిండ్రోమ్.. ఈ సమస్య మణికట్టు దగ్గర వస్తుంది. మణికట్టు దగ్గర దాదాపు 15 చిన్నచిన్న కండరాలు ఉంటాయి. వీటిలో ఒక్క కండరానికి వాపు వచ్చినా మిగతా అన్నింటిపై ఒత్తిడి పడుతుంది. దీనితో చేతిలో తిమ్మిర్లులా రావడం, రాత్రి పడుకున్నప్పుడు వేళ్లు వణకడం వంటివి జరగొచ్చు. రోజంతా మౌస్, కీబోర్డు వాడి.. ఆ తర్వాత బైక్ హ్యాండిల్, కార్ స్టీరింగ్ పట్టుకోవాల్సిన అవసరం వల్ల మణికట్టు కండరాలు మరింత అధిక శ్రమకు గురవుతాయి.

ఐటీ రంగంలో ఎక్కువగా..

ప్రముఖ వెల్‌నెస్ సంస్థ సోల్ హెల్త్‌కేర్ సంస్థ అధ్యయనం ప్రకారం.. ఐటీ రంగంలో ఆరోగ్య సమస్యలు బాగా పెరిగిపోయాయి. ఓ కంపెనీలో పనిచేసే 784 మందిని ఎంచుకుంటే.. అందులో 179 మంది నడుము నొప్పి, 129 మంది గర్భాశయం, వెన్నెముకలోని కీళ్లు/ డిస్క్‌లను ప్రభావితం చేసే గర్భాశయ స్పాండిలోసిస్, 65 మందిలో కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ (చేతుల్లో తిమ్మిర్లు), 61 మందిలో సాక్రోలియాక్ సమస్యలు ఉన్నట్టు గుర్తించారు.

- ఐటీ ఉద్యోగుల్లో గుండె జబ్బులు 147 శాతం ఎక్కువని, వీటితో మరణించే ప్రమాదం 18 శాతం పెరుగుతోందని అన్నల్స్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్ అధ్యయనంలో వెల్లడైంది.
- ది జర్నల్ ఆఫ్ నేషనల్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక ప్రకారం.. ఎక్కువగా కూర్చోవడం పెద్దపేగు కేన్సర్ ప్రమాదాన్ని 24 శాతం, ఊపిరితిత్తుల కేన్సర్ ప్రమాదాన్ని 21 శాతం, ఎండోమెట్రియల్ కేన్సర్ ప్రమాదాన్ని 24 శాతం వరకు పెంచుతోంది. కాళ్లలోని సిరల్లో రక్తం గడ్డకట్టడం వల్ల వచ్చే డీప్ వెయిన్ థ్రాంబోసిస్‌కు దారి తీయవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ముందే గుర్తించా..



కంప్యూటర్ ముందు పనిచేయడం మొదలెట్టిన కొన్నినెలల్లోనే ఆరోగ్యంలో తేడా గమనించాను. వేళ్ల తిమ్మిర్లు, నొప్పులు, కళ్ల పొడిబారడం వంటి సమస్యలు వచ్చాయి. డాక్టర్‌ను కలిసి వారి సూచనలకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకుంటూ పనిచేస్తున్నా. ఇప్పుడు సమస్యలు తగ్గిపోయాయి. మా సీనియర్లలో చాలా మంది మాత్రం ఇలాంటి సమస్యలతో బాధపడుతున్నారు.
– ప్రవంతి, ప్రైవేటు ఉద్యోగిని

హెల్త్ సెషన్స్ జరుగుతున్నాయి




మానసిక ఒత్తిడి, శారీరక సమస్యలు కార్పొరేట్ సంస్థల ఉద్యోగుల్లో ఇప్పుడు సాధారణమైపోయాయి. అనేకమంది జాబ్స్ వదిలేసి సొంత ఉపాధి వైపు మళ్లుతుండటానికి ఇదో కారణం కూడా. అందుకే ఆఫీసుల్లోనే ఆరోగ్యంపై వర్క్‌షాప్స్ జరుగుతున్నాయి.
– సంతోష్, ఐటీ ఉద్యోగి

గణతంత్ర 'వనం'



తూర్పు గోదావరి జిల్లా కడియం-వీరవరం రోడ్డులోని పల్ల వెంకన్న నర్సరీలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియా గేట్, జాతీయ పతాకం ప్రతిబింబించేలా చేసిన మొక్కల కూర్పు ఆకట్టుకుంటుంది. ప్రకృతి ప్రేమికుల మనసు దోచుకుంది.
- కడియం

అగ్గిపుల్లలపై జాతీయ గీతం



అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలోని తూటిపాలకు చెందిన సూక్ష్మ కళాకారుడు బి.ఎన్.వి.ఎల్.రవికుమార్. 26 అగ్గి పుల్లలపై జాతీయ గీతం, ఐ లవ్ ఇండియా అని రాసి దేశభక్తిని చాటుకున్నాడు.
- మాకవరపాలెం

ఐటీ 'నగ'రాలు

మొదటి పేజీ తరువాయి



రాండ్‌స్టాడ్ లాంటి కంపెనీలు ఇప్పటికే విశాఖపట్నంలో కార్యకలాపాలను ప్రారంభించగా ఐబీఎం, అమెజాన్, యాక్సెంచర్ లాంటివి కొత్త కార్యాలయాలను నెలకొల్పే దిశగా సన్నద్ధమయ్యాయి. ఇదే సమయంలో ఇప్పటికే కార్యకలాపాలు కొనసాగిస్తున్న టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, విప్రో లాంటి సంస్థలు విస్తరణ కార్యక్రమాలను ప్రకటిస్తున్నాయి. విశాఖలో విప్రో తాజాగా మరో 1,000 సీట్లను పెంచడానికి ముందుకు వచ్చినట్లు ఏపీటీఎస్ గ్రూపు సీఈవో ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మరోవైపు హెచ్‌సీఎల్ విశాఖపట్నంలో కార్యకలాపాలను ప్రారంభించే అంశాన్ని పరిశీలిస్తోంది.

60కిపైగా ఐటీ కంపెనీల ఆసక్తి

రాష్ట్రంలో కార్యకలాపాలను ప్రారంభించేందుకు 60కి పైగా ఐటీ కంపెనీలు ఆసక్తి వ్యక్తం చేస్తున్నట్లు ఇన్ఫినిటీ వైజాగ్ సమ్మిట్ సందర్భంగా పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. అంతర్జాతీయంగా ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న వారిలో అత్యధికంగా తెలుగు వారు ఉండటంతో పాటు తెలంగాణలో పనిచేస్తున్న వారిలో 10 శాతం మంది రాష్ట్రానికి చెందిన వారే కావడంతో ఐటీ కంపెనీలు ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించడానికి ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు.

నోరు అదుపులో పెట్టుకో

- టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణకు అక్కినేని అభిమానుల హెచ్చరిక

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ)/నెల్లూరు సిటీ: 'మద్యం తాగి నోటికొచ్చినట్లు మాట్లాడుతానంటే ఊరుకునేది లేదు. నోరు అదుపులో పెట్టుకొని.. వెంటనే క్షమాపణ చెప్పు' అని నటుడు, టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణను అక్కినేని అభిమానులు హెచ్చరించారు. ఓ సినిమా సభలో 'అక్కినేని.. తొక్కినేని' అంటూ బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం విశాఖలో ఉత్తరాంధ్ర అక్కినేని అభిమానుల సంఘం అధ్యక్షుడు రాము మీడియాతో మాట్లాడారు. అమ్మాయి కనిపిస్తే కడుపు చేసెయ్యాలని మాట్లాడే నీచ వ్యక్తిత్వం బాలకృష్ణదని మండిపడ్డారు. అక్కినేని, ఎస్వీ రంగారావు వంటి గొప్ప నటులను కూడా తేలిగ్గా మాట్లాడే నీచ స్వభావం బాలకృష్ణదని దుయ్యబట్టారు. రెండు రోజుల్లో క్షమాపణ చెప్పకపోతే.. బాలకృష్ణ ఇంటిముందే ధర్నాకు దిగుతామన్నారు. సమావేశంలో అక్కినేని నాటకోత్సవాల చైర్మన్ పొన్నాడ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు. నెల్లూరులో అక్కినేని నాగార్జున అభిమాన సంఘం ఆధ్వర్యంలో బాలకృష్ణ ఫ్లెక్సీని దహనం చేశారు.

సచివాలయాల వద్ద నేడు గణతంత్ర వేడుకలు

- గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఆదేశాలు

సాక్షి, అమరావతి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో గురువారం ఉదయం 9 గంటలకు తప్పనిసరిగా జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ షన్‌మోహన్ ఆదేశాలిచ్చారు. గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, వార్డు సచివాలయాల్లో వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులు ఇందుకు సంబంధించి బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. సచివాలయ పరిధిలో జరిగే జాతీయ పతాక ఆవిష్కరణకు ఆ పరిధిలో ఎన్నికైన ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో రాష్ట్ర స్థాయిలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే గణతంత్ర వేడుకల కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించేలా అన్ని సచివాలయాల వద్ద ఆ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం జరిగేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సంక్షేమ క్యాలెండర్ ప్రకారం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాల గురించి వివరించడంతో ఆ ప్రాంతంలో లబ్ధిపొందిన వారి వివరాలు తెలియజేయాలని సూచించారు.

మండలి, అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు ప్రాంగణాల్లో నేడు గణతంత్ర దిన వేడుకలు

సాక్షి, అమరావతి: భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 26వ తేదీ గురువారం ఉ.8 గం.కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి ప్రాంగణంలో గణతంత్ర వేడుకల్లో శాసన మండలి చైర్మన్ కె.మోషేన్‌రాజు పాల్గొని శాసన మండలి భవనంపై జాతీయ జెండాను ఎగురవేస్తారు. అలాగే రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం గురువారం ఉ.8.15 గం.కు అసెంబ్లీ ప్రాంగణంలో గణతంత్ర వేడుకల్లో పాల్గొని అసెంబ్లీ భవనంపై జాతీయ జెండాను ఎగురవేస్తారు. సచివాలయం మొదటి బ్లాకు వద్ద గురువారం ఉ.7.30 గం.లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి గణతంత్ర వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఎగురవేస్తారు. నేలపాడులోని ఏపీ ఉన్నత న్యాయస్థానం వద్ద ఉ.10 గం.కు రాష్ట్ర హైకోర్టు సీజే జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా గణతంత్ర వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఎగుర వేస్తారు.

అమెరికాకు ప్రకృతి ఉత్పత్తులు

- ప్రొడ్యూసర్ మార్కెట్.కామ్‌తో రైతు సాధికార సంస్థ చర్చలు
- తొలి దశలో వరి, శనగ, కాఫీ, పామాయిల్


అమెరికా సంస్థ ప్రతినిధులతో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ కుమార్, సీఈవో రామారావు

సాక్షి, అమరావతి: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అమెరికాతో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు 'ప్రొడ్యూసర్ మార్కెట్.కామ్' సంస్థ ముందుకొచ్చింది. ఆ సంస్థ సీఈవో ఖేత్ అగోడా, కన్సల్టెంట్ గేబ్రియల్ నేతృత్వంలోని ఈ బృందం రెండు రోజులపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలించింది. ఎరువులు, పురుగు మందులు వాడకుండా పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో రైతు పండిస్తున్న వివిధ పంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఉత్పత్తులను విదేశాల్లో మార్కెటింగ్ చేసే విషయమై గుంటూరులోని రైతు సాధికార సంస్థ కార్యాలయంలో సంస్థ సీఈవో బి.రామారావుతో బుధవారం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అగోడా మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు అమెరికా సహా వివిధ దేశాల్లో మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రైతు సాధికార సంస్థ సీఈవో బి.రామారావు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ సౌకర్యం లభిస్తే రైతులకు గిట్టుబాటు ధర దక్కుతుందన్నారు. తొలి విడతగా వరి, శనగ, కాఫీ, పామాయిల్ వంటి వాటిని ఎగుమతి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రైతు సాధికార సంస్థ సీనియర్ థిమాటిక్ లీడ్ ప్రభాకర్, ప్రాజెక్ట్ మేనేజర్ బిజేయ్ పాల్గొన్నారు.

పెట్టుబడుల ఆకర్షణకు రోడ్‌షోలు

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణకు వీలుగా రాష్ట్రంలో ఉన్న అనుకూలతలను, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను వివరించేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రోడ్డుషోలను నిర్వహించనున్నట్టు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. మార్చి 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)పై చర్చించేందుకు బుధవారం ఆయన విశాఖ కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం, ఒక హోటల్‌లో పారిశ్రామికవేత్తలతో మరో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలంగా ఉన్న పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామన్నారు. 2050 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారని చెప్పారు. యువతకు ఉద్యోగ కల్పనకు జీఐఎస్ సదస్సు ఉపయుక్తం కానుందన్నారు. దేశంలో మూడు పారిశ్రామిక కారిడార్లున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పారు పరిశ్రమలశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్ మాట్లాడుతూ ఈనెల 31న జరిగే దౌత్య సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, సలహాదారులు, విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. పరిశ్రమలశాఖ డైరెక్టర్ సృజన మాట్లాడుతూ జీఐఎస్‌కు ఈవెంట్ భాగస్వామిగా సీఐఐ, నాలెడ్జ్ భాగస్వామిగా కేపీఎంజీ, ఈవెంట్ మేనేజిమెంట్ ఏజెన్సీగా టైమ్స్‌నౌ సహాయం అందిస్తున్నట్లు వివరించారు.


మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టే సంస్థలతోనే ఒప్పందాలు

అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ విశాఖపట్నంలో జీఐఎస్ వేదికపై నుంచే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొన్ని పరిశ్రమలకు శంకుస్థాపనలు, మరికొన్నింటికి ప్రారంభోత్సవాలు చేస్తారని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా ఈ సదస్సులో కచ్చితంగా పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టే సంస్థలతోనే ప్రభుత్వం అగ్రిమెంట్లు కుదుర్చుకుంటుందని చెప్పారు. టీడీపీ హయాంలో జరిగిన నాలుగు భాగస్వామ్య సదస్సుల్లో రూ.1.87 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగే జీఐఎస్ తొలి సదస్సులోనే అంతకుమించి ఒప్పందాలు జరుగుతాయని పేర్కొన్నారు. దేశ, విదేశాలకు చెందిన 2,500 మంది పారిశ్రామిక వేత్తలు/ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతున్నారన్నారు. దేశంలోని ప్రముఖ పారిశ్రామిక వేత్తలకు కూడా సీఎం కార్యాలయం నుంచి ఆహ్వానాలు వెళ్లాయని తెలిపారు. మరే రాష్ట్రంలో లేనివిధంగా రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలనే ఈ జీఐఎస్ సదస్సుకు బ్రాండ్ అంబాసిడర్‌లుగా ప్రమోట్ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సూచించారని తెలిపారు. జీఐఎస్ సదస్సును విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. వ్యవసాయం-ఫుడ్ ప్రాసెసింగ్, ఏరోస్పేస్, రక్షణ, ఆటోమొబైల్, విద్యుత్ వాహనాలు, టెక్స్‌టైల్, ఇండస్ట్రియల్ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పెట్రోలియం అండ్ పెట్రోలియం కెమికల్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, టూరిజం, ఎంఎస్ఎంఈ, స్టార్టప్స్ వంటి 13 రంగాలకు సంబంధించిన కంపెనీలను ఆకర్షించేందుకు కృషిచేస్తున్నట్టు చెప్పారు. వీటిపై సదస్సులో ప్యానల్ డిస్కషన్ జరుగుతుందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడులకు అనువుగా ఉన్న అన్ని వనరులను, అవకాశాలను సదస్సులో వివరించి సద్వినియోగం చేసుకుంటామని చెప్పారు. పారిశ్రామికవర్గాలను సంప్రదించి కొత్త పాలసీ తీసుకొస్తామన్నారు.

పరిశ్రమల కోసం 50 వేల ఎకరాల సేకరణ

రాష్ట్రంలోని మూడు ఇండస్ట్రియల్ కారిడార్లకు అన్ని జిల్లాలను కలుపుకొంటూ పారిశ్రామిక ప్రగతి కోసం 50 వేల ఎకరాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. నక్కపల్లి, రాంబిల్లి, కాకినాడ, మచిలీపట్నం, కృష్ణపట్నం, ఏర్పేడు, ఓర్వకల్లుల్లో ఈ భూమిని సేకరించి పరిశ్రమల ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సన్నాహాలు చేస్తున్నారని ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వి.రవీంద్రనాథ్, మారిటైం బోర్డు చైర్మన్ కె.వెంకటరెడ్డి, ఏపీఐడీసీ చైర్‌పర్సన్ బి.ఎస్.నాగేంద్రపుణ్యశీల, హ్యాండీక్రాఫ్ట్స్ చైర్‌పర్సన్ బి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే

74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగే రిపబ్లిక్ పరేడ్‌లో ఈసారి మహిళా శక్తికి విశేష ప్రాధాన్యం లభించింది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లోనికవాతు బృందాలకు మహిళా ఆఫీసర్లు నాయకత్వం వహించనున్నారు. మొదటిసారి మహిళా ఒంటె దళం కవాతు చేయనుంది. డేర్ డెవిల్స్‌గా స్త్రీల బృందం మోటర్ సైకిల్ విన్యాసాలుచేయనుంది. అనేక శకటాలు మహిళా శక్తిని చాటనున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా స్త్రీ ప్రభావ శక్తికి ఈ పరేడ్ వేదిక కానుంది.



పరేడ్‌లో మహిళా శక్తి

గణతంత్ర దినోత్సవం నాడు మన దేశం తన సైనిక తేజాన్ని, సాంస్కృతిక సౌభ్రాతృత్వాన్ని, అంతర్గత వైవిధ్యాన్ని చాటుకుంటుంది. ప్రతి సంవత్సరం జనవరి 26న రిపబ్లిక్ డే పరేడ్‌లో రాష్ట్రపతి భవన్ నుంచి ఎర్రకోట వరకు జరిగే సైనిక కవాతు, రాష్ట్ర ప్రభుత్వాల శకటాల విన్యాసం, కళా బృందాల ఆటపాటలు. చూడటానికి కళ్లు చాలవు. ఇదంతా కలిసి మన దేశం... మనమంతా కలిసి మన శక్తి అనే భావన ఈ సందర్భంలో కలుగుతుంది. అయితే ఈసారి ఈ 'మన శక్తి'లో స్త్రీ శక్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, త్రివిధ దళాలు ప్రాధాన్యం ఇచ్చాయి. అందువల్ల ఈ పరేడ్ స్త్రీ శక్తికి నిదర్శనంగా నిలువనుంది.

ముగ్గురు మహిళా సైనికాధికారులు

పరేడ్‌లో పాల్గొనే త్రివిధ దళాల కవాతు బృందాలకు పురుష ఆఫీసర్లు నాయకత్వం వహించి ముందు నడవడం ఆనవాయితీ. ఈసారి ముగ్గురు మహిళా ఆఫీసర్లకు నాయకత్వ స్థానం దొరికింది. నావికా దళంలో నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్న లెఫ్టినెంట్ కమాండర్ దిశా అమృత్ (29) 144 మంది నావికులతో కూడిన కవాతు బృందాలకు నాయకత్వం వహించనుంది. బెంగళూరుకు చెందిన దిశ అమృత్ 2016లో నావికా దళంలో చేరక ముందు ఐటి రంగంలో పని చేసింది. ఎన్‌సిసి కాడెట్‌గా ఉన్నప్పటి నుంచి రిపబ్లిక్ డే పరేడ్ పాల్గొంటున్న ఆమె ఈసారి ఈ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో మిగ్– 17 పైలెట్‌గా ఉన్న స్క్వాడ్రన్ లీడర్ సింధు రెడ్డి తన దళం తరఫున 144 మంది గగన యోధులతో కవాతు నిర్వహించనుంది. ఇక మేడ్ ఇన్ ఇండియా ఆకాశ్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ సిస్టమ్‌కు లెఫ్టినెంట్ ఆకాష్ శర్మ నాయకత్వం వహించనుంది. 'చిన్నప్పటి నుంచి టీవీలో చూసిన పరేడ్‌లో ఈసారి నేను పాల్గొనడం సంతోషంగా ఉంది' అని శర్మ అంది. ఈ ముగ్గురు కాకుండా లెఫ్టినెంట్ డింపుల్ భాటి మోటార్ సైకిల్ విన్యాసాల దళంలో, మేజర్ మహిమ 'కమ్యూనికేషన్ ఎక్విప్‌మెంట్' బృందాల నాయకత్వంలో పాల్గొననున్నారు.



లెఫ్టినెంట్ ఆకాష్ శర్మ | స్క్వాడ్రన్ లీడర్ సింధు రెడ్డి | లెఫ్టినెంట్ కమాండర్ దిశా అమృత్

మహిళా శకటాలు

ఈసారి పరేడ్‌లో 17 రాష్ట్రాల నుంచి, 6 మంత్రిత్వ శాఖల నుంచి, త్రివిధ దళాల నుంచి శకటాలు పాల్గొననున్నాయి. ఇవి కాకుండా డిఆర్‌డివో శకటం ఉంటుంది. అయితే వీటిలో చాలా శకటాలు ఈసారి మహిళా శక్తికి ప్రాధాన్యం, ప్రాముఖ్యం ఇచ్చాయి. మూడు సైనిక దళాలు ఈసారి మహిళా కేంద్రిత శకటాలను నడుపుతున్నాయి. టూరిజంలోనూ, సేంద్రియ వ్యవసాయంలోనూ స్త్రీల భాగస్వామ్యంలో వారి స్వయం సమృద్ధికి పాటుపడతాం అనే థీమ్‌తో త్రిపుర శకటం ఉండనుంది. పశ్చిమ బెంగాల్ శకటం యునెస్కో గుర్తింపు పొందిన దుర్గా పూజను 'మానవత్వానికి అమూర్త వారసత్వ సంపదగా' అభివర్ణిస్తూ ముందుకు సాగనుంది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ 'సకల సజీవిత్వాలను సమృద్ధి చేసే అమృత స్త్రీతత్వం' థీమ్‌తో శకటం నడపనుంది. కేంద్ర హోమ్ శాఖ అయితే ఆరు కేంద్ర బలగాలలో స్త్రీ పోరాట పటిమను ప్రదర్శించే శకటంను ఎంచుకుంది. కేరళ మహిళా సాక్షరత శకటాన్ని, కర్నాటక మహిళా స్వయం సమృద్ధి శకటాన్ని ఈ పరేడ్ దారుల్లో నడిపించనున్నాయి.


కళకళలాడే నృత్యాలు

వీరందరూ కాకుండా వివిధ రాష్ట్రాల సాంస్కృతిక బృందాలలో విద్యార్థినులు, యువతలు, మహిళా కళాకరులు విశేష సంఖ్యలో పాల్గొనన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి మొదలు వీరంతా తమ సాంస్కృతిక విన్యాసాలను ప్రదర్శించనున్నారు. ●

చారిత్రక దృశ్యం



ఆకట్టుకునే యూనిఫాం: ప్రముఖ డిజైనర్ రాఘవేంద్ర రాథోడ్ డిజైన్ చేశారు



మేము సైతం: ఉమెన్ రైడర్స్

ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్ నేత్రపర్వంగా ఉండటమే కాదు, దేశభక్తి భావాలు ఉప్పొంగేలా కూడా చేస్తుంది. ఈసారి రిపబ్లిక్ డే పరేడ్‌లో ప్రత్యేకత... సరిహద్దు భద్రతాదళం (బీఎస్ఎఫ్) 'క్యామెల్ కాంటింజెంట్'లో తొలిసారిగా పాల్గొంటున్న మహిళా సైనికులు...

ఢిల్లీలో ఘనంగా జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్)కు చెందిన 'క్యామెల్ కాంటింజెంట్' 1976 నుంచి భాగం అవుతోంది. ఈసారి జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో మహిళా సైనికులు 'క్యామెల్ కాంటింజెంట్'లో భాగం కావడం చారిత్రక ఘట్టం కానుంది.

గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌కు చెందిన ఇరవై నాలుగు మంది మహిళా సైనికులకు రాజస్థాన్‌లోని జోథ్‌పూర్‌లో క్యామెల్ రైడింగ్‌లో శిక్షణ ఇచ్చి పన్నెండు మందిని ఎంపిక చేశారు.

'రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడం ఒక సంతోషం అయితే క్యామెల్ కాంటింజెంట్‌లో భాగం కావడం మరింత సంతోషం కలిగిస్తుంది' అంటుంది బృందంలో ఒకరైన అంబిక. 'రిపబ్లిక్ డే ఉత్సవాల్లో క్యామెల్ రైడర్స్‌ను చూసి అబ్బురపడేదాన్ని. ఇప్పుడు నేను అందులో భాగం కావడం గర్వంగా ఉంది' అంటుంది సోనాల్.

విజయ్‌చౌక్ నుంచి ఎర్రకోట వరకు కర్తవ్యపథ్ మీదుగా క్యామెల్ రైడర్స్ కవాతు నిర్వహిస్తారు. రిపబ్లిక్‌డే తరువాత జరిగే రీట్రీట్ సెరిమనీలో కూడా ఈ బృందం పాల్గొనబోతోంది. అమృత్‌సర్‌లో జరిగిన బీఎస్ఎఫ్ రైజింగ్ డే పరేడ్‌లో ఈ బృందం పాల్గొని ప్రశంసలు అందుకుంది.

ఉమెన్ రైడర్స్ కోసం ఆకట్టుకునే యూనిఫాంను కూడా రూపొందించారు. ప్రముఖ డిజైనర్ రాఘవేంద్ర రాథోడ్ దీన్ని డిజైన్ చేశారు. మన దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రాఫ్ట్ ఫామ్స్‌ను ఈ డిజైన్ ప్రతీకాత్మకంగా ప్రతిబింబిస్తుంది. రాజస్థాన్‌లోని మెవాడ్ సంప్రదాయానికి చెందిన తలపాగా మరో ఆకర్షణ.

మన దేశంలో భద్రతావసరాలు, సాంస్కృతి కార్యక్రమాల్లో ఒంటెలను ఉపయోగిస్తున్న ఏకైక సైనిక విభాగం బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్)

సాంస్కృతిక కార్యక్రమాల్లో బీఎస్ఎఫ్ క్యామెల్ కాంటింజెంట్ కవాతులకు ప్రత్యేకత ఉంది. ఉమెన్ రైడర్స్ రాకతో కవాతులలో రాజసం ఉట్టిపడుతుంది.

● కళ

డ్యాన్సింగ్ విత్ ది కెమెరా

– గల్లీ నుంచి దిల్లీ వరకు

'మనిషి చూడలేనివి కెమెరా మాత్రమే చూడగలదు' అనే సూత్రాన్ని నమ్మిన దయనితసింగ్ 'గుడ్ ఫొటోగ్రాఫర్'గా ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకుంది. జర్మనీలోని మ్యూనిక్‌లో జరుగుతున్న సింగ్ లార్జెస్ట్ ఫొటో ఎగ్జిబిషన్ విలువైన టైమ్ మిషన్....



జరగబోయే సంగీతకచేరి కోసం సాధన చేయడం ఒక ఎత్తయితే, కచేరి జరుగుతున్న ప్రదేశానికి చేరుకోవడానికి చేసే ప్రయాణం మరో ఎత్తు. నిండు బస్సులో, సీటు దొరకని కష్టంలో, సంగీతవాయిద్యాలను భద్రంగా చూసుకుంటూ చేసే ఆ ప్రయాణం, కచేరి ముగిసి బసకు చేరిన తరువాత వెల్లివిరిసే నవ్వుల పువ్వులు....ఇలాంటి దృశ్యాలు ఎన్నింటినో తన కెమెరాలోకి తీసుకువచ్చింది సింగ్.

సింగ్ కెమెరా ఎన్నో దశాబ్దాల చారిత్రక అందాలకు సజీవ సాక్ష్యంలా నిలిచింది.

ఫొటోగ్రఫీ రంగానికి సంబంధించిన ప్రతిష్ఠాత్మకమైన హాసెల్‌బ్లాడ్(స్వీడిష్ కెమెరా డెవలపర్ విక్టర్ హాసెల్‌బ్లాడ్ పేరు మీద ఇచ్చే పురస్కారం) అవార్డ్ అందుకోవడం ద్వారా సింగ్ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. సింగ్ గత కొన్ని దశాబ్దాలుగా హాసెల్‌బ్లాడ్ కెమెరానే ఉపయోగిస్తుంది.

దిల్లీలో పుట్టిన సింగ్ అహ్మదాబాద్‌లో చదువుకుంది. న్యూయార్క్ సిటీలోని 'ఇంటర్ నేషనల్ సెంటర్ ఫర్ ఫొటోగ్రఫీ'లో చేరడంతో తన జీవితం కొత్త మలుపు తీసుకుంది. చదువు పూర్తయిన తరువాత ది న్యూయార్క్ టైమ్స్, ది టైమ్స్ ఆఫ్ లండన్... మొదలైన పత్రికల్లో పనిచేసింది. ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది.

> కెమెరా, పఠనం అనేవి రెండు వేరు, వేరు విషయాలు కాదు. సాహిత్యాన్ని నిరంతరం చదవడం ద్వారా వచ్చే శక్తి కెమెరాకు కొత్త వెలుగు ఇస్తుంది.

ఏ దేశంలో పని చేసినా, ఎక్కడ పనిచేసినా సింగ్ ఫొటోగ్రఫీకి ప్రధాన కేంద్రం...భారతదేశం. మధ్యతరగతి, సంపన్న వర్గాల జీవనశైలి సింగ్ ఫొటోలలో కనిపిస్తుంది. దిల్లీ నుంచి గల్లీ వరకు ఎన్నో దృశ్యాలను కెమెరాలో బంధించింది.

'ఒక రోజు మంచి ఫోటో తీస్తే ఆరోజు వరకు మాత్రమే నన్ను నేను గుడ్ ఫొటోగ్రాఫర్ అనుకుంటాను' అంటున్న 61 సంవత్సరాల సింగ్ నిరంతర విద్యార్థి.

'డ్యాన్సింగ్ విత్ మై హాసెల్‌బ్లాడ్' పేరుతో ఈతరం కోసం అవగాహన తరగతులు కూడా నిర్వహిస్తుంటుంది సింగ్.

'కెమెరా, పఠనం అనేవి రెండు వేరు, వేరు విషయాలు కాదు. సాహిత్యాన్ని నిరంతరం చదవడం ద్వారా వచ్చే శక్తి కెమెరాకు కొత్త వెలుగు ఇస్తుంది' అని యువతరానికి చెబుతుంది సింగ్.

'ఆమెతో మాట్లాడడమే ఒక ఎడ్యుకేషన్' అనే వాళ్లకు కొదవ లేదు.

కోవిడ్ విరామాన్ని ఉపయోగించుకొని 'లెట్స్ సీ' పేరుతో ఫొటో–నావెల్ బుక్ తీసుకు వచ్చింది. నిజానికి దీన్ని పుస్తకం అనడం కంటే కాలయంత్రం అనడం సబబు.

ఆర్టిస్ట్ బుక్స్‌ను అందంగా, అద్భుతంగా డిజైన్ చేయడంలోనూ సింగ్ మంచి పేరు తెచ్చుకుంది. తన దృష్టిలో అవి 'పోర్టబుల్ మ్యూజియమ్స్'

వివిధ ప్రాంతాలలో మొబైల్ మ్యూజియమ్‌ల ద్వారా కూడా ఛాయాచిత్ర ప్రేమికులను ఆకట్టుకుంది సింగ్.

దయనితసింగ్ లార్జెస్ట్ ఫొటోఎగ్జిబిషన్ 'డ్యాన్సింగ్ విత్ మై కెమెరా' జర్మనీలోని మ్యూనిక్‌లో జరుగుతోంది.

'ఇంతకీ ఫొటోగ్రఫి మీకు ఏం ఇచ్చింది?' అనే ప్రశ్నకు–

'జీవితాన్ని అర్థం చేసుకోవడం నేర్పించింది' అనే అర్థవంతమైన జవాబు చెబుతుంది సింగ్. ●

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం ॥ 26-1-2023

పుడమి సాక్షిగా 2023
3RD EDITION

రెడ్యూస్.. రీయూస్.. రీసైకిల్!
వాడకం తగ్గించుకోవడం... వాడేసినవే మళ్లీ వాడటం...
పడేసిన వాటితో కొత్తవి తయారు చేసుకుని వాడుకోవడం..!
ఏమిటీ కర్మ! అవును కర్మే. మనిషి వల్ల పుడమికి పట్టిన కర్మ!
అవసరం ఉన్నవీ లేనివి కొని, అవసరం తీరీ తీరకుండానే పడేస్తున్నాం.
కొత్తవి కొంటున్నాం. కుండెడన్నం కోసం బండెడన్నం వండేస్తున్నాం.
ఫ్రిజ్‌ని రైతుబజార్‌ని చేస్తున్నాం.
వార్డ్‌రోబ్ పొట్ట పగిలేలా బట్టల్ని కుక్కేస్తున్నాం.
భారీ ఫర్నీచర్‌తో ఇంటినంతా నింపేస్తున్నాం.
బకెట్‌ల కొద్దీ నీళ్ల ట్యాంకుల్ని ఖాళీ చేస్తున్నాం!
ఇ.ఎం.ఐ.ల కొద్దీ మన దగ్గర డబ్బుంటే ఉండొచ్చు.
పుడమి దగ్గర ఇప్పుడు.. దాదాపుగా నో స్టాక్!
పంచభూతాల షార్టేజ్!!
తక్షణం మన వేస్టేజ్ తగ్గితేనే పుడమికి మనుగడ!


హైదరాబాద్‌లో జరిగిన 'పుడమి సాక్షిగా' మెగా టాకథాన్ కార్యక్రమంలో పాల్గొన్న రాజకీయ, సినీ ప్రముఖులు, పర్యావరణ ప్రేమికులతో సాక్షి బృందం

వేస్టేజ్ తగ్గితేనే పుడమికి మనుగడ

ఈ కఠోర వాస్తవంపై 'పుడమి సాక్షిగా..' మెగా టాకథాన్‌తో గత మూడేళ్లుగా సమాజానికి అవగాహన కల్పిస్తూ వస్తున్న.. 'సాక్షి మీడియా గ్రూప్' ఈ ఏడాది 'రెడ్యూస్..రీయూజ్.. రీసైకిల్..' అనే థీమ్‌తో ఈవెంట్‌ని నిర్వహించింది.

వాడకం తగ్గించి, వృథాను నివారించి, వ్యర్థాలను తగ్గిస్తేనే పుడమి తిరిగి జవసత్వాలు పుంజుకుంటుందని ఈ టాకథాన్ ద్వారా పర్యావరణ వేత్తలు, రాజకీయ నేతలు, ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. అధికారులు, కళాకారులు, సినీ హీరోల చేత చెప్పించింది. హైదరాబాద్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో ఇటీవల జరిగిన **ఈ కార్యక్రమం నేటి మధ్యాహ్నం 12 గంటల నుంచి సాక్షి టీవీలో ప్రసారం అవుతుంది.**

• • •

ధరిత్రిని కాపాడుకోవాలి, భూమిని కాలుష్య కాసారం కానీయకుండా భవిష్యత్తరాలకు అందించాలి అనే లక్ష్యంతో సాక్షి మీడియా గ్రూపు చేపట్టిన ప్రచారోద్యమమే 'పుడమి సాక్షిగా..'

ఇప్పటివరకు రెండు ఎడిషన్‌లను పూర్తి చేసుకున్న ఈ కార్యక్రమం మొదటి ఎడిషన్‌లో... ప్రమాదం అంచుకు ఎలా చేరాం? పుడమికి మనం ఏం తిరిగి ఇవ్వాలి? పర్యావరణానికి ఏం అవసరం? అనే అంశాలకు ప్రాధాన్యం ఇచ్చింది.

రెండో ఎడిషన్‌లో స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు, సకల ప్రాణులకూ ఆవాసంగా నేల, తక్కువ కాలుష్యంతో విద్యుత్ ఉత్పాదన అనే అంశాలను ప్రధానంగా చర్చించింది. ఈ మూడో ఎడిషన్‌లో 'రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్' అనే థీమ్‌ను ఎంపిక చేసుకుంది. ప్రముఖుల సూచనలను, సలహాలను స్వీకరించింది. సాక్షి 'ఫన్‌డే' ద్వారా వాటిని పాఠకులకు అందించింది. సాక్షి టీవీ ద్వారా నేడు వీక్షకులకు అందిస్తోంది.



నాకు నచ్చిన ప్రోగ్రాం

సామాజిక బాధ్యతను కర్తవ్యంగా తీసుకుని సాక్షి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది, అందులో నాకు బాగా నచ్చిన ప్రోగ్రామ్.. పుడమి సాక్షిగా. భగవంతుడు మనకిచ్చిన వరం పర్యావరణం. ఈ వరాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మానవాళి అందరిదీ. నేటి తరాలు బాధ్యతగా జీవిస్తేనే భావితరాలకూ ఈ వరం అందుతుంది.

- రోజా, పర్యాటక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి, ఏపీ

బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉంది



సాక్షి తీసుకున్న 'పుడమి సాక్షిగా..' అనే ఈ గొప్ప ఇనీషియేటివ్‌లో అందరం భాగస్వాములం కావాలి. పుడమి అంటే తల్లి. తల్లిని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి మనిషిదీ. ఏపీ ప్రభుత్వం ఇటీవలే 'పార్లే ఫర్ ది ఓషన్స్' అనే అమెరికన్ ఎన్జీవోతో ఎం.ఓ.యు. కుదుర్చుకుని విశాఖ బీచ్‌లో పోగయ్యే ప్లాస్టిక్‌ని రీయూజ్ చేయిస్తూ గొప్ప సంస్కరణకు నాంది పలికింది. పుడమి సంరక్షణకు ప్రజల్ని చైతన్యం చేస్తోంది.

- గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమల శాఖ మంత్రి, ఏపీ



రైతు.. భూమి.. పుడమి

సాక్షి మీడియా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతను గుర్తుచేస్తోంది. వ్యవసాయం విషయానికి వస్తే.. ప్రకృతి సాగు విధానాల వల్ల పుడమికి ఎంతో మేలు జరుగుతోంది. ఏపీలో రైతు భరోసా కేంద్రాలు, రైతు సాధికార సంస్థల ఏర్పాటుతో రైతుకు, భూమికి, పుడమికి ప్రయోజనకరమైన ఫలితాలను సాధిస్తున్నాం.

- కాకాని గోవర్ధన్, వ్యవసాయశాఖ మంత్రి, ఏపీ



గ్రీన్ వెజిటేషన్‌కు ప్రాధాన్యం

సాక్షి చేపట్టిన 'పుడమి సాక్షిగా..' ఒక మంచి ప్రయత్నం. ప్రపంచ వ్యాప్తంగా నేడు కలవరం కలిగిస్తున్న ప్రధాన సమస్య పర్యావరణ కాలుష్యం. అందుకు అనుగుణంగానే తెలంగాణ ప్రభుత్వం పలు ప్రత్యేకమైన పర్యావరణ హితమైన కార్యక్రమాలు చేపట్టి పచ్చదనాన్ని పెంపొందిస్తోంది. కోటీ యాభై ఎకరాల వ్యవసాయ భూమి సాగు అయ్యేలా నీటి అందించి, గ్రీన్ వెజిటేషన్‌ని సాధిస్తోంది.

- నిరంజన్‌రెడ్డి, సహకార శాఖ మంత్రి, తెలంగాణ



పిల్లలకు క్లీన్‌లీనెస్ నేర్పాలి

తిన్నామా, పడుకున్నామా, తెల్లారిందా.. ఇదే తెలుసు మనోళ్లకి. కానీ, రాబోయే తరానికి మనం ఏం ఇస్తున్నాం అనేది ఒక్కసారి మన మనస్సాక్షిని అడగాలి. పుడమి సాక్షిగా.. నేను ప్రతి మనిషికీ చెప్పేది ఒకటే.. మనం ఇవ్వాల్సింది మన పిల్లలకి విద్య, నేర్పాల్సింది క్లీన్‌లీనెస్. పర్యావరణాన్ని మనం శుభ్రంగా ఉంచితే మన రాష్ట్రం శుభ్రంగా ఉంటుంది. మన దేశం శుభ్రంగా ఉంటుంది. మనం అందరికీ ఇన్స్పిరేషన్ అవుతాం.

- అలీ, మీడియా అడ్వైజర్, ఏపీ



పాఠశాల స్థాయి నుంచే

కలెక్టివ్ సోషల్ రెస్పాన్సిబిలిటీ లేకపోవడం వల్ల మనం పర్యావరణాన్ని పరిరక్షించుకోలేకపోతున్నాం. ఇది ఏ ఒక్కరి వల్లో సాధ్యం అయ్యేది కాదు. అందరూ బాధ్యత తీసుకుని సమాజాన్ని చైతన్యవంతం చేయాలి. పాఠశాల నుంచే పిల్లల్లో పర్యావరణ స్పృహ కలిగించడానికి ఇన్సెంటివ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ఉంటే బాగుంటుంది. ఉదా.. క్లాస్ రూమ్‌ని శుభ్రంగా ఉంచిన వారికి ప్రోత్సాహకాలు ఇవ్వడం వంటివి. ఇప్పుడు మనం ప్రకృతి పట్ల శ్రద్ధ వహిస్తేనే భవిష్యత్ తరాలు పచ్చగా ఉంటాయి.

- అడివి శేష్, సినీ హీరో

ఎకో-ఫ్రెండ్లీ స్కూల్ క్యాంపస్



'పుడమిసాక్షిగా..' టాకథాన్‌కు నన్ను ఆహ్వానించినందుకు ధన్యవాదాలు. వాతావరణ మార్పులు భూతాపానికి కారణం అవుతున్నాయనే అంశంపై హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ తరఫున ఈజిప్ట్‌లో జరిగిన కాప్ 27 సదస్సుకు హాజరై అధ్యయన పత్రం సమర్పించాను. మా స్కూల్ క్యాంపస్ లో కూడా ఎన్విరాన్‌మెంట్ పిట్స్, సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకున్నాం. ప్లాస్టిక్ వినియోగం కూడా తగ్గించుకున్నాం.

- అంకిత్ సుహాస్, కాప్-27 డెలిగేట్

వస్తు వినియమం బాగా తగ్గాలి



గత దశాబ్దంగా మన దగ్గర ఉన్న గణాంకాలని బట్టి చూస్తే అర్బన్‌కి, రూరల్‌కు మధ్య వస్తు వినియోగ సంస్కృతిలో ఏ విధమైన తేడా కనిపించని పరిస్థితి. గ్రామ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలు రెండిటినీ స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ హ్యాండిల్ చేస్తోంది. వీటిని కంపేర్ చేసినప్పుడు.. కొనే రాశిలో తేడా ఉందేమో కానీ, ఇంటింటి నుంచీ వచ్చే రోజువారీ వ్యర్థాలు దాదాపు ఒకే మొత్తంలో ఉంటున్నాయి. వ్యర్థాలు ఎక్కువైతే పుడమికి ముప్పు కనుక రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ మన తక్షణ అవసరం.

- సంపత్ కుమార్, ఐ.ఎ.ఎస్. స్వచ్ఛాంధ్ర ఎండీ

మెటీరియలిజం వల్లే ఇదంతా..!



మన జీవన విధానం ఎకో ఫ్రెండ్లీగా ఉండాలి. పుడమికి హితంగా మన అలవాట్లు మార్చుకోవాలి. ఆర్టీసీలో మేము రీయూజ్ అనే కాన్సెప్ట్‌ని అవలంబిస్తున్నాం. మెటీరియలిజంకి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకు రావడం కోసం సాక్షి మీడియా గత మూడేళ్లుగా 'పుడమి సాక్షిగా..' అనే ప్రచారోద్యమాన్ని కొనసాగిస్తూ, టాకథాన్‌ని నిర్వహించడం అభినందనీయం.

- వి.సి.సజ్జనార్, ఐపీఎస్, టి.ఎస్.ఆర్టీసీ ఎండీ

ట్రిబుల్ 'ఆర్' ప్రస్తుతావసరం



ఇటువంటి ముఖ్య అంశంపై డిబేట్ ఏర్పాటు చేసిన సాక్షికి ధన్యవాదాలు. 25 ఏళ్ల క్రితం గూంజ్ సంస్థ ప్రారంభమైంది. తిండి, బట్ట, నివాసం అనే కనీస అవసరాలలో మేము దుస్తులపై దృష్టి పెట్టాం. దుస్తులను విరాళంగా సేకరించి దేశవ్యాప్తంగా ఉన్న నిరుపేదలకు అందిస్తున్నాం. ఆ విధంగా సంపన్నుల దగ్గరి వేస్టేజ్‌ని రీయూజ్‌కు అందిస్తున్నాం. సంపన్నులను పరోక్షంగా రెడ్యూస్‌కు ప్రేరేపిస్తున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్‌ఆర్ ఆర్‌తోనే పుడమిని సంరక్షించుకోగలం.

- మీనాక్షీ గుప్తా, 'గూంజ్' సంస్థ

సాధికారత



పచ్చటి గెలుపు సంతకం

• అంజు శ్రీవాస్తవ

కోట్ల విలువైన కార్పొరేట్ రంగం నుంచి కష్టాలు మాత్రమే కనిపించే వ్యవసాయ రంగంలోకి వచ్చింది అంజు శ్రీవాస్తవ.
అర ఎకరం భూమిని కౌలుకు తీసుకొని రకరకాల మొక్కలను పెంచడం ప్రారంభించింది.
'విన్‌గ్రీన్స్ ఫామ్స్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టింది. ఈ కంపెనీకి అర ఎకరం భూమి ప్రాణవాయువు అయింది. తాజాదనంతో వినియోగదారులను ఆకట్టుకుంది. చిన్న కంపెనీగా మొదలైన 'విన్‌గ్రీన్స్ ఫామ్స్' '500 కోట్ల క్లబ్'లోకి చేరడానికి వేగంగా అడుగులు వేస్తోంది...

అమెరికాలో అడ్వర్‌టైజింగ్ రంగంలో ఉద్యోగం చేస్తున్న అంజు శ్రీవాస్తవకు మొదటి నుంచి వ్యవసాయం అంటే ఇష్టం. ఆ రంగానికి సంబంధించిన మంచి చెడులు ఎప్పటికప్పుడు తెలుసుకోవడం అంటే ఆసక్తి. ఆ ఆసక్తే ఆమెను కుదురుగా ఒక చోట ఉండనివ్వలేదు.

వ్యవసాయరంగం కేంద్రంగా కంపెనీ ప్రారంభించాలనే కోరికతో ఇండియాకు వచ్చింది. స్వదేశంలో ఆమెకు ఎకరం పొలం కూడా లేదు. మొదట అర ఎకరం వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని గురుగ్రామ్ (హరియాణా) కేంద్రంగా 'విన్‌గ్రీన్స్ ఫామ్స్' కంపెనీ ప్రారంభించింది. ఆ తరువాత పదిహేను ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు.


• గ్రామీణ మహిళలతో అంజు శ్రీవాస్తవ

సాస్‌ల తయారీకి సంబంధించిన కంపెనీ ఇది. మన దేశంలో డిప్స్ అండ్ సాస్ మార్కెట్‌కు మంచి డిమాండ్ ఉంది. 2026లో ఇప్పుడున్న మార్కెట్ విలువ రెట్టింపు కానుందనే అంచనాలు ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకునే సాస్ మార్కెట్‌ను ఎంపిక చేసుకుంది అంజు శ్రీవాస్తవ.

తాము పండించిన మొక్కలతోనే సాస్‌ల తయారీ మొదలుపెట్టారు.

'సంతోషంగా లేని వారి జీవితాలు పదేపదే గుర్తుకు వస్తుంటే మనం మాత్రం ఎలా సంతోషంగా ఉండగలం!' అంటూ స్వదేశానికి వచ్చిన అంజు శ్రీవాస్తవకు వ్యవసాయరంగంపై ఆసక్తి ఉన్నప్పటికీ, ఆ రంగంలో ప్రత్యక్షంగా పనిచేసిన అనుభవం గానీ, వ్యాపార అనుభవం కానీ పెద్దగా లేవు. అమెరికాలో ఉన్నప్పుడు మాత్రం కుండీలో మొక్కలు ఇరుగు పొరుగు వారికి అమ్మేది. ఏ కంపెనీ ఉత్పత్తులు ఆదరణ పొందాలన్నా 'క్వాలిటీ' అనేది ప్రధాన విషయం అవుతుంది. అందుకే క్వాలిటీనే ముఖ్యం అనుకుంది.

సీక్వోయా క్యాపిటల్ పెట్టుబడులు పెట్టడంతో 'విన్‌గ్రీన్స్'కు రెక్కలు వచ్చి ముందుకు దూసుకెళ్లింది. డిప్స్ అండ్ సాస్ మార్కెట్‌లో తనదైన ప్రత్యేకతను నిలుపుకుంది.

అంజు శ్రీవాస్తవ తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించింది.

'డబ్బే ప్రధానం అయితే నేను అమెరికా నుంచి ఇక్కడికి వచ్చేదాన్ని కాదు. నా మొదటి ప్రాధాన్యత రైతుల సంక్షేమం. రైతుల దగ్గర విలువైన భూమి ఉన్నా, చేతిలో చిల్లిగవ్వ కూడా లేని పరిస్థితులు ఉంటాయి. ఒక వ్యక్తి కష్టపడితే దానికి తగిన ప్రతిఫలం లభించడం అనేది సహజ విషయం. అయితే రైతుల విషయంలో మాత్రం ఇది విరుద్ధంగా ఉంది. రాత్రనకా, పగలనకా రైతు ఎంత కష్టపడినా ఆ కష్టానికి తగిన ఫలితం దక్కడం లేదు' అంటున్న అంజు శ్రీవాస్తవ తన కంపెనీ ద్వారా ఎంతోమంది రైతులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తుంది.

గురుగ్రామ్ చుట్టుపక్కల గ్రామాలలోని రైతులు నెలకు రెండు వేలకు మించి సంపాదించలేకపోతున్నారనే విషయం అంజు శ్రీవాస్తవను ఆశ్చర్యానికి గురి చేసింది. 'విలువైన భూమి వారికి ఉన్నప్పుడు ఆ భూమి ద్వారానే మంచి ఆదాయం ఎందుకు సంపాదించకూడదు?' అని ఆలోచించింది అంజు. తీవ్రమైన పేదరికం ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాలలోని మహిళలు ఇళ్లు దాటి బయటికి వచ్చేవారు కాదు. ఇలాంటి పరిస్థితులలో అంజు శ్రీవాస్తవ ప్రతి ఇంటికి వెళ్లి మహిళలను చైతన్యవంతం చేసింది. ఆర్థికస్వాతంత్ర్యం ప్రాముఖ్యత గురించి తెలియజేసింది. వారిలో కదలిక మొదలైంది. ఇప్పుడు 'విన్‌గ్రీన్స్'లో చాలామంది మహిళలు పనిచేస్తున్నారు. గౌరవప్రదమైన ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. కంపెనీ పేరు 'విన్‌గ్రీన్స్'లో winకు పూర్తి రూపం... ఉమెన్ ఇనిషియేటివ్ నెట్‌వర్క్.

వ్యవసాయానికి సంబంధించిన శాస్త్రీయ జ్ఞానం కరువై ఒకే రకమైన పంటలు పండిస్తున్న రైతులకు అవగాహన సదస్సుల రూపంలో కొత్తదారి చూపిస్తోంది అంజు శ్రీవాస్తవ.

'కొన్ని సందర్భాల్లో అజ్ఞానానికి మించిన అదృష్టం లేదు. దీనికి నేనే ఉదాహరణ' అని చమత్కరిస్తుంది అంజు.

ఎందుకంటే ఆమె ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలు పెట్టినప్పుడు ఏమీ తెలియదు. ప్రతి అడుగులో ఒక కొత్త విషయాన్ని నేర్చుకుంటూ వెళ్లి ఘన విజయం సొంతం చేసుకుంది.

ఉమెన్ ఫ్రెండ్లీ

ఇవిగోనండీ మన నేస్తాలు!

ఎలక్ట్రానిక్ పరికరాలు గొంతు విప్పి మనతో మాట్లాడలేకపోవచ్చు.
మన 'సంక్షేమం' విషయంలో మాత్రం ఆత్మీయ నేస్తాల్లా ఆసరాగా నిలుస్తాయి.
వేలుకు ఉన్న అందమైన రింగ్ మన ఆరోగ్యానికి సంబంధించి విలువైన సూచనలు చేస్తుంది.
బేబీ బెడ్ మీద ఉన్న 'క్యూబియర్' పాప ఎందుకు ఏడ్చిందో సవివరంగా తెలియజేస్తుంది....



అనేక కంపెనీలు 'హెల్త్-టెక్' గ్యాడ్జెట్స్‌పై దృష్టి సారిస్తున్నాయి. వినియోగదారులు కూడా వాటిపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. మన దేశంలో 'అవంతరీ టెక్నాలజీస్' లాంటి కంపెనీలు మెడిటేషన్, హార్ట్‌రేట్‌కు సంబంధించిన రింగ్‌లను తయారు చేశాయి.

'ధ్యానం చేయాలంటే సరియైన సమయం, ఏకాగ్రత, నిశ్శబ్ద వాతావరణం కావాలనుకుంటాం. ధ్యానం చేయాలనుకోవడం సులభమే కానీ చేయడం కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో సరియైన సమయాన్ని ఎంపిక చేసుకోవడానికి ధ్యాన రింగ్ ఉపకరిస్తుంది' అంటుంది కంపెనీ.

'ధ్యానం చేయడానికి ఇది సరియైన సమయం' అని సూచించేలా రింగ్‌పై ఉన్న చిన్న ఎల్ఈడీ లైట్ వెలుగుతుంది. దీంతోపాటు ఈ రింగ్ ధ్యానానికి సంబంధించిన నాణ్యతను ట్రాక్ చేస్తుంది. మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని 'ఈవీ' అనే రింగ్‌ను తయారు చేసింది మోవానో కంపెనీ. ఈ రింగ్‌ను ఇటీవల లాస్ వేగాస్‌లో జరిగిన సీయిఎస్ (కన్స్యూమర్ ఎలక్ట్రానిక్ షో)లో ప్రదర్శించారు. గత సంవత్సరం అక్టోబర్ నెలలో ఈ రింగ్ ట్రయల్స్ విజయవంతంగా పూర్తయ్యాయి.

అల్యూమినియంతో తయారు చేసిన ఈ రింగ్ హార్ట్ రేట్ వేరియబిలిటీ, పీరియడ్, కేలరీలు, మెన్‌స్ట్రువల్ సింప్టమ్ ట్రాకింగ్... మొదలైన విషయాల్లో మహిళలకు సహాయపడుతుంది. 'ఈవి' రింగ్ ద్వారా


• ఈవీ రింగ్

'మెడికల్ గ్రేడ్ హెల్త్ డాటా'ను పొందవచ్చు.

'ఈవీ' రింగ్ కంపెనీ యాప్‌తో అనుసంధానమై ఉంటుంది. యాక్సెస్ కోసం మంత్లీ సబ్‌స్క్రిప్షన్‌లాంటివేవీ ఉండవని మోవానో కంపెనీ తెలియజేసింది.

పసిపిల్లలు ఎందుకు ఏడుస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. 'ఎందుకు?' అనేది తెలుసుకోవడానికి రకరకాలుగా ప్రయత్నిస్తూనే ఉంటాం. అయితే 'క్యూబియర్'తో పిల్లలు ఎందుకు ఏడుస్తున్నారనేది తెలుసుకోవడం సులభం అవుతుంది.

ఆకలి, డైపర్ వల్ల అసౌకర్యం... శిశువు ఎందుకు ఏడుస్తుందో తెలియజేసే ఎన్నో కారణాల గురించి ఈ ఎఐ ఆధారిత పరికరం సెకండ్ల వ్యవధిలో తెలియజేస్తుంది. యాప్‌తో అనుసంధానమైన 'క్యూబియర్' పసిపిల్లల కంఫర్ట్ లెవెల్, గది ఉష్ణోగ్రతకు సంబంధించిన అప్‌డేట్స్‌ను తల్లిదండ్రులకు తెలియజేస్తుంది.


• క్యూబియర్

వాల్ హ్యాంగింగ్, టేబుల్ ట్యాప్, క్రిబ్ స్టాండ్... మూడు రకాల ప్లేస్‌మెంట్ ఆప్షన్స్ ఉన్నాయి. పసిపిల్లల 'క్రయింగ్ డాటా'ను ఆధారం చేసుకొని 18-లేయర్ డీప్ లెర్నింగ్ ఆర్కిటెక్చర్‌తో రూపొందించిన 'క్యూబియర్'ను క్వాంటమ్ మ్యూజిక్ కంపెనీ తయారు చేసింది. లాస్‌వేగాస్‌లో జరిగిన సీయిఎస్ (కన్స్యూమర్ ఎలక్ట్రానిక్ షో)లో ప్రదర్శించారు.

రంగస్థలం

నారీమణుల నాటక వైభవం

జెండర్ హింస నుంచి అధికార దుర్వినియోగం వరకు, గృహహింస నుంచి రాజ్యహింస వరకు...మహిళలు ఎదుర్కొనే రకరకాల సమస్యలపై... మహిళలే రచించి, నటించి, దర్శకత్వం వహించిన నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. నాటకరంగంలో రాణించాలనుకునే మహిళలకు కొత్త శక్తిని ఇచ్చాయి. కొత్త దారి చూపాయి...

ఇరవై నాలుగు సంవత్సరాల క్రితం కేరళ సంగీత, నాటక అకాడమీ ఆధ్వర్యంలో 'ఉమెన్ థియేటర్ ఫెస్టివల్' ఘనంగా జరిగింది. సుదీర్ఘ విరామం తరువాత ఇటీవల తిరువనంతపురంలో జరిగిన 'ఉమెన్ థియేటర్ ఫెస్టివల్' నాటకరంగ ప్రేమికులకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. కేరళకు చెందిన ఉమెన్స్ థియేటర్ గ్రూప్ 'నిరీక్ష' ఈ నాటక ఉత్సవాలను నిర్వహించింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పద్నాలుగు మంది మహిళా దర్శకులు ఈ నాటక ఉత్సవాల్లో పాలుపంచుకున్నారు.

లింగవివక్ష, సామాజిక అసమానత, రాజ్యహింస, అధికార దుర్వినియోగం, స్త్రీలపై జరిగే హింస... మొదలైన అంశాలపై నాటకాలు ప్రదర్శించారు.

'నాటకరంగానికి సంబంధించి మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. అందువల్ల ప్రాతినిధ్యం మరింతగా పెరగడానికి ఇలాంటి నాటక ఉత్సవాలు కచ్చితంగా ఉపయోగపడతాయి. ఇక నుంచి ప్రతి సంవత్సరం ఈ నాటక ఉత్సవాలను నిర్వహించాలనుకుంటున్నాం. దీన్ని ఇంటర్నేషనల్ ఉమెన్స్ థియేటర్ ఫెస్టివల్ స్థాయికి తీసుకువెళ్లాలనేది మా లక్ష్యం' అంటుంది 'నిరీక్ష' సహ-వ్యవస్థాపకులలో ఒకరైన రాజేశ్వరి. 1999లో సుధి దయంతితో కలిసి 'నిరీక్ష ఉమెన్స్ థియేటర్స్ గ్రూప్' స్థాపించింది రాజేశ్వరి.


• నాటకరంగ ప్రతిభ

'రంగశ్రీ' ఉమెన్ థియేటర్ గ్రూప్‌కు కేరళలో పన్నెండు జిల్లాల్లో శాఖలు ఉన్నాయి. వివిధ సామాజిక అంశాలపై 'రంగశ్రీ' ప్రదర్శించిన స్ట్రీట్‌ప్లేలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రకరకాల అంశాలపై వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించారు. 'తమలోని నాటక కళానైపుణ్యాలకు మెరుగు పెట్టుకోవడానికి ఇలాంటి వర్క్‌షాప్‌లు ఉపకరిస్తాయి. ఔత్సాహికులకు కొత్త దారి చూపిస్తాయి. స్క్రిప్ట్ రైటింగ్ నుంచి లైటింగ్ వరకు ఎన్నో విషయాలు నేర్చుకునేలా చేస్తాయి' అంటుంది ఉత్సవ నిర్వాహక కమిటీలో సభ్యురాలైన సోయా థామస్.



13 ఏళ్ల తర్వాత సెమీస్‌లోకి జర్మనీ

పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్‌లో జర్మనీ జట్టు 13 ఏళ్ల తర్వాత మళ్లీ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. భువనేశ్వర్‌లో బుధవారం జరిగిన మూడో క్వార్టర్ ఫైనల్లో జర్మనీ 'షూటౌట్'లో 4–3తో ఇంగ్లండ్‌ను ఓడించింది. నిర్ణీత సమయం వరకు రెండు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. 2010 తర్వాత ఈ మెగా టోర్నీలో జర్మనీ సెమీఫైనల్ చేరింది. మరో క్వార్టర్ ఫైనల్లో నెదర్లాండ్స్ 5–1తో కొరియాను ఓడించి సెమీస్ చేరింది. శుక్రవారం జరిగే సెమీఫైనల్స్‌లో ఆస్ట్రేలియాతో జర్మనీ; బెల్జియంతో నెదర్లాండ్స్ ఆడతాయి.

సెమీఫైనల్లో భారత మహిళల జట్టు

అండర్‌-19 మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీలో షఫాలీ వర్మ నాయకత్వంలోని భారత జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. దక్షిణాఫ్రికాలో బుధవారం 'సూపర్ సిక్స్' దశ మ్యాచ్‌లు ముగిశాయి. గ్రూప్‌-1లో ఉన్న భారత్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా జట్లు 6 పాయింట్లతో సమఉజ్జీగా నిలిచాయి. అయితే మెరుగైన రన్‌రేట్ కారణంగా తొలి రెండు స్థానాల్లో నిలిచిన భారత్ (+2.844), ఆస్ట్రేలియా (+2.210) సెమీఫైనల్లోకి ప్రవేశించాయి.



నంబర్‌వన్ మొహమ్మద్ సిరాజ్

ఐసీసీ వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో హైదరాబాదీకి అగ్రస్థానం



దుబాయ్: పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ తన తొలి వన్డేను 2019 జనవరిలో ఆడాడు. 10 ఓవర్లలో 76 పరుగులిచ్చి వికెట్ తీయలేకపోయిన అతను భారత వన్డే జట్టులో చోటు కోల్పోయాడు. మూడేళ్ల తర్వాత అదృష్టవశాత్తూ 2022లో ఫిబ్రవరిలో మళ్లీ వన్డే అవకాశం దక్కింది! అంతే... ఆ తర్వాత అద్భుత బౌలింగ్‌తో దూసుకుపోయిన అతను ఇప్పుడు ఏడాది తిరిగేలోగా శిఖరానికి చేరాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం ప్రకటించిన తాజా వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో సిరాజ్ వరల్డ్ నంబర్‌వన్‌గా నిలిచాడు. 729 రేటింగ్ పాయింట్లు సాధించిన సిరాజ్... ఇప్పటి వరకు అగ్రస్థానంలో ఉన్న ట్రెంట్ బౌల్ట్ (708 పాయింట్లు)ను మూడో స్థానానికి నెట్టి 'టాప్' ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఇటీవల శ్రీలంక, న్యూజిలాండ్‌లపై ఐదు వన్డేల్లో కలిపి 14 వికెట్లు తీయడం ద్వారా సిరాజ్ దూసుకొచ్చాడు. ఓవరాల్‌గా ఇప్పటి వరకు 21 వన్డేల్లో 20.73 సగటుతో సిరాజ్ 38 వికెట్లు పడగొట్టాడు. కపిల్‌దేవ్, మణీందర్ సింగ్, కుంబ్లే, జడేజా, జస్‌ప్రీత్ బుమ్రా తర్వాత ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానానికి చేరిన ఆరో భారత బౌలర్‌గా సిరాజ్ చోటు దక్కించుకున్నాడు.

అతివల క్రికెట్‌కు అందలం...

మహిళల క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయం. మన దేశంలో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన లీగ్ పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు తొలి అంకం పూర్తయింది. అదీ అలాంటి ఇలాంటి తరహాలో కాదు. బీసీసీఐకి కాసుల వర్షం కురిపించేలా, అతివల ఆటను అందలం ఎక్కించేలా లీగ్ దూసుకొచ్చింది. అనూహ్య రీతిలో ఐదు జట్లను ఏకంగా రూ. 4669.99 కోట్లకు అమ్మిన బోర్డు తమ ఖజానాను మరింత పటిష్టం చేసుకోగా... ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళా క్రికెటర్లు బంగారు భవిష్యత్తును ఆశించేలా ఉన్న లీగ్ విలువ కొత్త ఆశలు రేపింది. పురుషుల లీగ్‌తో పోలిస్తే 'ఇండియన్' లేకుండా 'ఉమెన్ ప్రీమియర్ లీగ్' అనే కొత్త పేరుతో లీగ్ జరగనుంది. ఇక మిగిలింది వేలం ద్వారా ప్లేయర్ల ఎంపిక... ఆపై తొలి టోర్నీ సమరానికి సర్వం సిద్ధం!

- 'ఉమెన్ ప్రీమియర్ లీగ్' జట్ల ప్రకటన
- బీసీసీఐ ఖాతాలో రూ.4669.99 కోట్లు
- మూడు జట్లు కొన్న ఐపీఎల్ టీమ్‌లు
- అత్యధిక మొత్తం అదానీ గ్రూప్‌దే

జట్లు	యాజమాన్యం	మొత్తం
అహ్మదాబాద్	అదానీ స్పోర్ట్స్‌లైన్ ప్రైవేట్ లిమిటెడ్	రూ. 1289 కోట్లు
ముంబై	ఇండియావిన్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్	రూ. 912.99 కోట్లు
బెంగళూరు	రాయల్ చాలెంజర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్	రూ. 901 కోట్లు
ఢిల్లీ	జేఎస్‌డబ్ల్యూ జీఎంఆర్ క్రికెట్ ప్రైవేట్ లిమిటెడ్	రూ. 810 కోట్లు
లక్నో	క్యాప్రి గ్లోబల్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్	రూ. 757 కోట్లు



ముంబై: దాదాపు ఐదున్నరేళ్ల క్రితం వన్డే వరల్డ్ కప్‌లో ఫైనల్ చేరిన నాటినుంచి అంతకంతకూ తమ స్థాయిని పెంచుకుంటూ వచ్చిన భారత మహిళల క్రికెట్‌లో ఇదే మేలిమలుపు... పురుషుల ఐపీఎల్ తరహాలోనే తమకంటూ ఒక లీగ్ ఉండాలంటూ కోరుకుంటూ వచ్చిన మహిళల స్వప్నం భారీ స్థాయిలో సాకారం కానుంది. ఐపీఎల్ తరహాలో నిర్వహించే తొలి లీగ్ కోసం జట్లను సొంతం చేసుకునేందుకు బీసీసీఐ నిర్వహించిన వేలం అద్భుతం చేసింది. మొత్తం రూ. 4666.99 కోట్లకు ఐదు టీమ్‌లను వేర్వేరు సంస్థలు సొంతం చేసుకున్నాయి. లీగ్‌కు 'హోం గ్రౌండ్'లుగా నిలిచే ఐదు నగరాలుగా అహ్మదాబాద్, ముంబై, బెంగళూరు, ఢిల్లీ, లక్నో ఖరారయ్యాయి. ఇందులో అహ్మదాబాద్ ఫ్రాంచైజీ కోసం అదానీ సంస్థ అత్యధికంగా రూ. 1289 కోట్లు వెచ్చించింది. మూడు పురుషుల ఐపీఎల్ టీమ్ యాజమాన్యాలు ముంబై, బెంగళూరు, ఢిల్లీ ఇక్కడా భారీ మొత్తాలను మహిళల టీమ్‌లను సొంతం చేసుకోగా... ఐదో జట్టును క్యాప్రి గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థ గెలుచుకుంది.

భారీ డిమాండ్‌తో...

మహిళల లీగ్ జట్లను సొంతం చేసుకునేందుకు 17 సంస్థలు బిడ్‌లను కొనుగోలు చేసి పోటీ పడ్డాయి. 2008లో తొలిసారి పురుషుల ఐపీఎల్ ప్రకటించినప్పుడు జట్ల కొనుగోలుకు సంబంధించి బీసీసీఐ కనీస విలువను నిర్ణయించింది. ఈసారి అలాంటిది లేకుండా ఆసక్తి ఉన్నవారు తాము అనుకున్న మొత్తానికి బిడ్‌లు వేశారు. ఇటీవలే మహిళల లీగ్ ప్రసార హక్కులను రూ. 951 కోట్లకు వయాకామ్ 18 గ్రూప్ సొంతం చేసుకోవడం మహిళల మ్యాచ్‌లకూ పెరిగిన ఆదరణను చూపించింది. దాంతో ఫ్రాంచైజీలపై కూడా ఆసక్తి నెలకొంది. నిబంధనల ప్రకారం లీగ్ ప్రసార హక్కుల్లో 80 శాతం మొత్తాన్ని ఐదేళ్ల పాటు ఐదు ఫ్రాంచైజీలకు పంచుతారు. అందువల్ల కూడా ఎలా చూసినా నష్టం లేదని భావన బిడ్డర్లలో కనిపించింది. పురుషుల లీగ్‌లో టీమ్‌ను దక్కించుకోవడంలో విఫలమైన అదానీ గ్రూప్ ఈసారి మహిళల క్రికెట్‌లో అడుగు పెట్టగా, గుజరాత్ టైటాన్స్ స్పాన్సర్లలో ఒకటైన క్యాప్రి గ్రూప్ కూడా టీమ్‌ను సొంతం చేసుకుంది. 2008లో తొలిసారి పురుషుల ఐపీఎల్‌లో ఎనిమిది జట్లకు కలిపి రూ. 28,943.6 కోట్లు (అప్పటి డాలర్ విలువ ప్రకారం) బోర్డు ఖాతాలో చేరాయి. ఇప్పుడు మారిన విలువ ప్రకారం చూసినా మహిళల లీగ్‌లో వచ్చిన మొత్తం చాలా ఎక్కువని, నాటి రికార్డు బద్దలైందని బీసీసీఐ కార్యదర్శి జై షా ప్రకటించారు.

మార్చిలో టోర్నీ...

డబ్ల్యూపీఎల్ నిర్వహణకు సంబంధించిన తేదీల విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. అయితే ఫిబ్రవరి 26న దక్షిణాఫ్రికాలో మహిళల టి20 వరల్డ్ కప్ ముగిసిన వెంటనే సాధ్యమైనంత తొందరగా మ్యాచ్‌లు జరిపే అవకాశం ఉంది. ఫిబ్రవరిలో దీనికి సంబంధించి వేలం నిర్వహిస్తారు. ఒక్కో జట్టుకు ప్లేయర్ల కోసం గరిష్టంగా రూ. 12 కోట్లు ఖర్చు చేయవచ్చు. కనీసం 15 మందిని, గరిష్టంగా 18 మందిని టీమ్‌లోకి తీసుకోవచ్చు. ఇందులో ఐదుగురు విదేశీ ప్లేయర్లు ఉంటారు. తొలి సీజన్‌లో మొత్తం 22 మ్యాచ్‌లు జరుగుతాయి. మహిళల క్రికెట్‌లో ఈ రోజునుంచి కొత్త ప్రయాణం మొదలైందంటూ వ్యాఖ్యానించిన బోర్డు కార్యదర్శి జై షా కొత్త లీగ్‌కు 'మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)'గా నామకరణం చేసినట్లు వెల్లడించారు. 'ఉమెన్ బిగ్‌బాష్ లీగ్' తరహాలో 'ఉమెన్ ఐపీఎల్' అంటూ ఇప్పటి వరకు ప్రచారంలో ఉండగా... డబ్ల్యూఐపీఎల్ అని కాకుండా కాస్త భిన్నంగానే పేరును 'డబ్ల్యూపీఎల్'కే బోర్డు పరిమితం చేసింది.

'మిక్స్‌డ్' ఫైనల్లో సానియా–బోపన్న జోడీ

మెల్‌బోర్న్: తన గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ కెరీర్‌ను టైటిల్‌తో ముగించేందుకు భారత స్టార్ సానియా మీర్జా విజయం దూరంలో నిలిచింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలో భారత్‌కే చెందిన సీనియర్ స్టార్ రోహన్ బోపన్నతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సానియా మీర్జా ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో సానియా మీర్జా–రోహన్ బోపన్న ద్వయం 7–6 (7/5), 6–7 (5/7), 10–6తో 'సూపర్ టైబ్రేక్'లో మూడో సీడ్ డెసిరె క్రాజిక్ (అమెరికా)–నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) జోడీపై అద్భుత విజయం సాధించింది. గంటా 52 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సానియా–బోపన్న నాలుగు ఏస్‌లతోపాటు 27 విన్నర్స్ కొట్టింది. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. శుక్రవారం జరిగే ఫైనల్లో లీసా స్టెఫాని–రాఫెల్ మటోస్ (బ్రెజిల్) జోడీతో సానియా–బోపన్న ద్వయం తలపడుతుంది.



5 ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్‌డబుల్స్ విభాగంలో సానియా మీర్జా ఫైనల్ చేరడం ఇది ఐదోసారి. 2009లో మహేశ్ భూపతితో కలిసి ఆమె టైటిల్ సాధించింది. మిగతా మూడు సార్లు (2008, 2014, 2017) సానియా రన్నరప్‌గా నిలిచింది.

గెలుపు దిశగా ఆంధ్ర

సాక్షి, విజయనగరం: అస్సాం జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి'లో ఆంధ్ర జట్టు గెలుపు దిశగా పయనిస్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 160/3తో బుధవారం రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 361 పరుగుల వద్ద ఆలౌటైంది. రికీ భుయ్ (36; 4 ఫోర్లు) తక్కువ స్కోరుకే వెనుదిరిగినా... మరో ఓవర్‌నైట్ బ్యాటర్ కరణ్ షిండే (90 నాటౌట్; 1 ఫోర్), షోయబ్ (42; 7 ఫోర్లు) అండతో చక్కని పోరాటం చేశాడు. ఆ తర్వాత అండగా నిలిచేవారు కరువవడంతో కరణ్ సెంచరీ చేసే అవకాశం లేకపోయింది. స్వరూపమ్ 4 వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్రకు 248 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన అస్సాం ఆట నిలిచే సమయానికి 5 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ విజయం తప్పించుకోవాలంటే అస్సాం ఇంకా 186 పరుగులు చేయాలి. చేతిలో ఐదే వికెట్లున్నాయి.

పదోసారి సెమీఫైనల్లో జొకోవిచ్

క్వార్టర్ ఫైనల్లో ఐదో సీడ్ రుబ్లెవ్‌పై గెలుపు

మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ పదోసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ జొకోవిచ్ 6–1, 6–2, 6–4తో ఐదో సీడ్ రుబ్లెవ్ (రష్యా)పై అలవోకగా గెలిచాడు. 2 గంటల 3 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ 14 ఏస్‌లు సంధించాడు. 32 విన్నర్స్ కొట్టడంతోపాటు రుబ్లెవ్ సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. మరో క్వార్టర్ ఫైనల్లో టామీ పాల్ 7–6 (8/6), 6–3, 5–7, 6–4తో అమెరికాకే చెందిన బెన్ షెల్టన్‌ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్ చేరాడు. మహిళల సింగిల్స్ విభాగంలో 30 ఏళ్ల మగ్డా లినెట్ (పోలాండ్) 30వ ప్రయత్నంలో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్ చేరింది. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 45వ ర్యాంకర్ లినెట్ 6–3, 7–5తో ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచింది. మరో క్వార్టర్ ఫైనల్లో ఐదో సీడ్ సబలెంకా (బెలారస్) 6–3, 6–2తో డొనా వెకిచ్ (క్రొయేషియా)ను ఓడించి తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీస్ చేరింది.



2022 'ఐసీసీ టి20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా సూర్యకుమార్



దుబాయ్: గతేడాది పొట్టి ఫార్మాట్‌లో అసాధారణ మెరుపులతో చెలరేగిన సూర్యకుమార్ యాదవ్ 2022 'ఐసీసీ టి20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికయ్యాడు. గత ఏడాది సూర్య 31 మ్యాచ్‌లు ఆడి 1164 పరుగులు చేసి 'టి20 స్పెషలిస్టు'గా పేరు సంపాదించుకున్నాడు. భారత మహిళల జట్టు పేసర్ రేణుక సింగ్ 'ఐసీసీ మహిళల ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు ఎంపికైంది. రేణుక గతేడాది రెండు పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో 29 మ్యాచ్‌లు ఆడి 40 వికెట్లను పడగొట్టింది. స్మృతి మంధాన టి20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ రేసులో ఉన్నప్పటికీ తాహ్లియా మెక్‌గ్రాత్ (ఆస్ట్రేలియా) జోరుతో అవార్డుకు దూరమైంది.

సినిమా

రీల్ గూఢచారి

దేశం కోసం కొందరు గూఢచారులు 'మేరా భారత్ మహాన్' అంటూ ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు. అయితే ఇవి సిల్వర్ స్క్రీన్ గూఢచారుల కథలు. భారత రాజ్యాంగం అమలులోకొచ్చిన రోజు (జనవరి 26)న స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను లెక్కచేయని సమర యోధులను గుర్తు చేసుకుంటూ... సిల్వర్ స్క్రీన్‌పై దేశం కోసం పోరాడే ఈ రీల్ గూఢచారుల గురించి తెలుసుకుందాం.



కల్యాణ్ రామ్

ఓ రహస్యాన్ని ఛేదించేందుకు 'డెవిల్'గా గూఢచార్యం చేస్తున్నారు కల్యాణ్ రామ్. నవీన్ మేడారం దర్శకత్వంలో కల్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న సినిమా 'డెవిల్'. 'ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్' అనేది ఉపశీర్షిక. 1945లో బ్రిటిష్ పరిపాలనలో ఉన్న మద్రాస్ ప్రెసిడెన్సీ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ప్రేమ, ద్రోహం, మోసం.. ఈ మూడు అంశాలు ఏ విధంగా ఓ గూఢచారి జీవితాన్ని ప్రభావితం చేశాయన్నదే ఈ సినిమా ప్రధానాంశం. మరో వైపు దేశం కోసం అజ్ఞాతంలో ఉండనున్నారు విజయ్ దేవరకొండ. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇందులో అజ్ఞాత గూఢచారి పాత్రలో కనిపిస్తారట విజయ్ దేవరకొండ. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ఆరంభం కానుంది. ఇక 2018లో 'గూఢచారి'గా కనిపించి సక్సెస్‌ఫుల్‌గా మిషన్‌ను పూర్తి చేసిన అడివి శేష్ మళ్లీ ఓ కొత్త మిషన్‌ను ఆరంభించారు. 'గూఢచారి' సీక్వెల్ 'జీ 2' (గూఢచారి 2)లో హీరోగా నటిస్తున్నారు. సిరిగినీడి వినయ్ కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మరోవైపు యాక్షన్ 'ఏజెంట్'గా మారారు అఖిల్. సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో అఖిల్ హీరోగా నటిస్తున్న సినిమా 'ఏజెంట్'. దేశం కోసం ఎంతకైనా తెగించే ఓ ఏజెంట్ నేపథ్యంలో సాగే ఈ సినిమా ఈ వేసవిలో రిలీజ్ కానుంది. కాగా మంచు పర్వతాల్లో తుపాకులను దాచిపెట్టారు హీరో నిఖిల్. ఎందుకంటే దేశం కోసం గూఢచారిగా మారారు. ఎడిటర్ గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో నిఖిల్ హీరోగా నటిస్తున్న సినిమా 'స్పై'. దేశానికి సంబంధించిన ఓ సీక్రెట్‌ను కనిపెట్టి, దేశద్రోహులను ఓ స్పై ఏ విధంగా మట్టుపెట్టాడన్నదే ఈ సినిమా అని తెలుస్తోంది. 'స్పై'ను ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. వీరితో పాటు మరికొందరు కూడా గూఢచారులుగా కనిపించనున్నారు.


అడివి శేష్


అఖిల్



విజయ్ దేవరకొండ


నిఖిల్


కమల్‌హాసన్

కోలీవుడ్ లోనూ కొందరు హీరోలు దేశం కోసం సాహసాలు చేస్తున్నారు. దేశభక్తి నేపథ్యంగా హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన 'ఇండియన్' సినిమా సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడీ సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' చేస్తున్నారు కమల్ అండ్ శంకర్. పూర్తి దేశభక్తి బ్యాక్‌డ్రాప్‌లో, ఈ కాలంతోపాటు 1920 కాలం నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుందని తెలిసింది. ఇక దర్శకుడిగా 'తుపాకీ', 'స్పైడర్' వంటి స్పై మూవీస్‌ను తీసిన ఏఆర్ మురుగదాస్ నిర్మాతగా ప్రస్తుతం '1947, ఆగస్టు 16' అనే సినిమా నిర్మించారు. గౌతమ్ కార్తీక్ హీరోగా నటించిన ఈ సినిమాకు ఎన్ఎస్ పొన్‌కుమార్ దర్శకుడు. ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది. అలాగే మరో తమిళ హీరో అరుణ్ విజయ్ నటించిన సినిమా 'బోర్డర్'. మిలిటరీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే చిత్రం ఇది. ఎ. వెంకటాచలం దర్శకత్వం వహించిన ఈ సినిమా వచ్చే నెలలో రిలీజ్ కానుంది. ఇక విష్ణు విశాల్ హీరోగా మను ఆనంద్ దర్శకత్వంలోవచ్చిన 'ఎఫ్ఐఆర్' చిత్రం ఉగ్రవాదం నేపథ్యంలో సాగుతుంది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ఎఫ్ఐఆర్ 2'ని ప్రకటించారు విష్ణు విశాల్. కాగా గత ఏడాది విడుదలైన 'విక్రమ్' సినిమాలో కమల్‌హాసన్, 'సర్దార్'లో కార్తీ రా (రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్) ఏజెంట్స్‌గా నటించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రాలకు సీక్వెల్స్ రానున్నాయి.


గౌతమ్ కార్తీక్


సల్మాన్


షారుక్


సారా

బాలీవుడ్‌లో అయితే స్పై బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్స్‌కు కొదవే లేదు. ఇప్పటికే 'టైగర్ జిందా హై', 'ఏక్తా టైగర్' వంటి స్పై బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్స్‌లో నటించిన సల్మాన్ ఖాన్ ఈ ఫ్రాంచైజీలోనే తాజాగా 'టైగర్ 3' సినిమా చేస్తున్నారు. మనీష్ శర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఈ ఏడాదే రిలీజ్ కానుంది. అలాగే స్పై బ్యాక్‌డ్రాప్‌లో సౌత్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తున్న 'జవాన్' సినిమాలో హీరోగా నటిస్తున్నారు షారుక్ ఖాన్. ఈ ఏడాది జూన్ 2న 'జవాన్' విడుదల కానుంది. మరోవైపు కథానాయిక సారా అలీ ఖాన్ 'ఆయే వతన్.. మేరే వతన్' అనే మూవీ చేస్తున్నారు. కన్నన్ అయ్యర్ దర్శకత్వం వహిస్తున్నారు. క్విట్ ఇండియా ఉద్యమం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. ఓ కాలేజీ విద్యార్థిని స్వాతంత్ర్య సంగ్రామంలో ఎలా పాల్గొంది? అన్నదే ఈ సినిమా కథ. అలాగే దేశ విభజన నాటి అంశాల నేపథ్యంలో 'లాహోర్: 1947' అనే సినిమా రూపుదిద్దుకోనుంది. 'ఘాయల్', 'దామిని', 'ఘాతక్' వంటి హిట్ సినిమాల తర్వాత హీరో సన్నీ డియోల్, దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి కాంబినేషన్‌లో ఈ సినిమా రూపొందనుంది. ఇక దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ రీసెంట్‌గా స్పై బ్యాక్‌డ్రాప్ సినిమాలు చేస్తున్నారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన తాజా స్పై ఫిల్మ్ 'పఠాన్' థియేటర్స్‌లో ఉంది. కాగా 'వార్' తర్వాత హృతిక్ రోషన్‌తో 'ఫైటర్' చేస్తున్నారు సిద్ధార్థ్ ఆనంద్. ఇది కూడా స్పై బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్ అట. అలాగే హీరో ప్రభాస్‌తో కూడా సిద్ధార్థ్ ఓ స్పై బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్ చేస్తారని టాక్. ఇక హీరో జాన్ అబ్రహాం కూడా 'టెహ్రాన్' అనే స్పై ఫిల్మ్ చేస్తున్నారు. ఈ కోవలో మరికొన్ని బాలీవుడ్ సినిమాలు ఉన్నాయి.

నేను ఇక్కడే ఉంటానురా..


వెంకటేశ్

''నేను ఇక్కడే ఉంటానురా.. ఎక్కడికెళ్లను.. రమ్మను' అంటూ సీరియస్‌గా వార్నింగ్ ఇస్తున్నారు వెంకటేశ్. ఆయన హీరోగా నటించనున్న తాజా చిత్రానికి 'సైంధవ్' అనే టైటిల్ ఖరారు చేశారు. 'హిట్' ఫేమ్ శైలేష్ కొలను దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తారు. కాగా ఈ చిత్రం టైటిల్ పోస్టర్, వెంకటేశ్ గ్లింప్స్‌ని బుధవారం విడుదల చేశారు. ఒక మెడిసన్ వయాల్ (ఔషధ సీసా) ఉన్న కూల్ బాక్స్‌తో చంద్రప్రస్థ అనే ఓడ రేవు ప్రాంతంలోకి వెంకటేశ్ ఎంటరై, అక్కడి కంటైనర్ నుంచి తుపాకీని బయటకు తీసుకొచ్చి, గూండాల గ్యాంగ్‌ని ఉద్దేశించి 'నేనిక్కడే ఉంటానురా.. ఎక్కడికెళ్లను... రమ్మను..' అంటూ హెచ్చరించడం గ్లింప్స్‌లో కనిపిస్తుంది. ''వెంకటేశ్ నటించనున్న 75వ చిత్రం 'సైంధవ్'. ఆయన కెరీర్‌లో భారీ బడ్జెట్ మూవీ ఇది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియాగా రూపొందనుంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, కెమెరా: ఎస్. మణికందన్, సహనిర్మాత: కిషోర్ తాళ్లూరు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్).

థ్రిల్లింగ్ నక్షత్రం

మంచు మోహన్‌బాబు, మంచు లక్ష్మీప్రసన్న కలిసి నటించిన తొలి చిత్రం 'అగ్ని నక్షత్రం'. వంశీకృష్ణ మళ్ళ దర్శకత్వం వహించారు. లక్ష్మీప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు, మంచు లక్ష్మి నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వంశీకృష్ణ మళ్ళ మాట్లాడుతూ– ''సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'అగ్ని నక్షత్రం'. ఇందులోని ఫైట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. సినిమా అన్ని వర్గాల ఆడియన్స్‌కి నచ్చేలా ఉంటుంది'' అన్నారు. సముద్ర ఖని, సిద్దిక్, విశ్వంత్, చైత్రా శుక్ల తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: అచ్చు రాజామణి, కెమెరా: గోకుల్ భారతి.


లక్ష్మి, మోహన్‌బాబు, విశ్వంత్

ఆ తపనతో ఈ సినిమా చేశారు

– పరుచూరి గోపాలకృష్ణ

''అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్'.. ఇలా స్వాతంత్ర్య సమరయోధుల పాత్రలంటే అన్న ఎన్టీఆర్‌గారే గుర్తొస్తారు. అలాంటిది 'దేశంకోసం భగత్ సింగ్' సినిమాలో రవీంద్ర గోపాల్ ఏకంగా 14 మంది స్వాతంత్ర్య సమర యోధుల పాత్రలు చేయడం గొప్ప విషయం'' అని ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ అన్నారు. 'అన్నల రాజ్యం, నాగమ నాయుడు, రాఘవేంద్ర మహత్యం' లాంటి సినిమాలను నిర్మించిన నాగలక్ష్మి ప్రొడక్షన్స్ అధినేత రవీంద్ర గోపాల లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'దేశం కోసం భగత్‌సింగ్'. ప్రమోద్ కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ–'స్వాతంత్ర్య సమర యోధుల గొప్పతనాన్ని ప్రపంచానికి తెలపాలన్న తపనతో ఈ సినిమా చేశాడు రవీంద్ర. ఈ సినిమా చూశా.. బాగుంది'' అన్నారు. ''ఫిబ్రవరి 3న మా సినిమాని రిలీజ్ చేయనున్నాం'' అన్నారు రవీంద్ర గోపాల్.


పరుచూరి గోపాలకృష్ణ, రవీంద్ర గోపాల్

విద్య, ఉద్యోగ సమాచారం

నిక్‌మార్, హైదరాబాద్‌లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ (ఎన్‌ఐసీఎంఏఆర్).. ఫుల్‌టైం ఆన్-క్యాంపస్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

- అడ్వాన్స్‌డ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్‌లో రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్.
- ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌లో రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్.
- సస్టైనబుల్ ఎనర్జీ మేనేజ్‌మెంట్‌లో రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్.
- లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్‌లో రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్.
- క్వాంటిటీ సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్‌లో ఏడాది పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్.
- హెల్త్ సేఫ్టీ అండ్ ఇన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్‌లో ఏడాది పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్.
- **అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/ప్లానింగ్ ఉత్తీర్ణులై ఉండాలి). డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా అర్హులే.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:**01.02.2023.
- **ప్రవేశ పరీక్ష, బృంద చర్చలు,ఇంటర్వ్యూ తేదీలు:** 20.02.2023 నుంచి 26.02.2023 వరకు
- **ప్రవేశ ఫలితాల వెల్లడి తేది:** 06.03.2023.
- **వెబ్‌సైట్:** www.nicmar.ac.in

ఆర్‌జీయూకేటీ, బాసరలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు

బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ).. గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** సివిల్, మెకానికల్, ఇంజనీరింగ్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్.
- **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి బీఈ/బీటెక్, ఎంటెక్/ఎంఈ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- **వేతనం:** నెలకు రూ.30,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఇంటర్వ్యూ వేదిక:** ఆర్‌జీయూకేటీ-బాసర క్యాంపస్, బాసర, నిర్మల్ జిల్లా, తెలంగాణ.
- **ఇంటర్వ్యూ తేది:** 28.01.2023 (ఉదయం 10 గంటల నుంచి)
- **వెబ్‌సైట్:** www.rgukt.ac.in

» ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్ష విధానంలో మార్పులు
» అభ్యర్థులపై భారం తగ్గించే దిశగా నిర్ణయం
» మెయిన్స్‌లో 300 మార్కులకు రెండు పేపర్లు
» యధాతథంగా స్క్రీనింగ్ టెస్ట్
» సరైన వ్యూహంతో చదివితే విజయం ఖాయం

గ్రూప్2.. కీలక మార్పులు ఇవే!



ఏపీపీఎస్సీ గ్రూప్-2 సర్వీసులు.. ప్రభుత్వ ఉద్యోగార్థులు ఎంతో ఆసక్తి చూపే ఉద్యోగాలు! గ్రూప్-2 ఎంపిక ప్రక్రియలో విజయం సాధించేందుకు లక్షల మంది అహర్నిశలు కృషి చేస్తున్న పరిస్థితి! నోటిఫికేషన్ కోసం వేచి చూడకుండా.. పరీక్ష ఎప్పుడు జరిగినా జాబ్ కొట్టాలనే లక్ష్యంతో రేయింబవళ్లు పుస్తకాలతో కుస్తీపడుతుంటారు! ఇలాంటి వారికి మేలు చేసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా గ్రూప్ 2 పరీక్ష విధానంలో కీలక మార్పులు ప్రకటించింది. అన్ని నేపథ్యాల అభ్యర్థులకు అనుకూలంగా ఉండేలా .. గ్రూప్-2 మెయిన్ విధానంలో మార్పులు చేసింది. ఈ నేపథ్యంలో.. ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్ష విధానంలో తాజా మార్పులు, సిలబస్ అంశాలు, వాటిపై పట్టు సాధించడమెలాగో తెలుసుకుందాం...

'గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఒకే సబ్జెక్ట్‌ను స్క్రీనింగ్, మెయిన్స్ రెండింటికీ చదవాల్సి వస్తోంది. దీంతో వారికి విలువైన సమయం వృథా అవుతోంది. ఏపీ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో అభ్యర్థులపై ఒత్తిడి తగ్గడమే కాకుండా.. వారు ప్రిపరేషన్‌కు సరైన సమయం కేటాయించుకునే ఆస్కారం లభిస్తుంది' -ఇది ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్ పరీక్షలో మార్పులపై నిపుణుల అభిప్రాయం.

నిపుణుల కమిటీ సిఫార్సులు

గ్రూప్-2 మెయిన్ పరీక్ష సిలబస్, టాపిక్స్, పేపర్ల విషయంలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలు, అభ్యర్థుల్లో నెలకొన్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న ఏపీపీఎస్సీ.. ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సిఫార్సుల ప్రకారం-గ్రూప్-2 మెయిన్ పరీక్షలో మార్పులు చేస్తూ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు కూడా జారీ చేసింది.

గ్రూప్-2 మెయిన్.. ఇక రెండు పేపర్లే

- ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం-గ్రూప్-2 ఎంపిక ప్రక్రియలో రెండో దశ అయిన మెయిన్ ఎగ్జామినేషన్‌లో కీలక మార్పులు చేశారు.
- ఇంతకాలం 3 పేపర్లుగా నిర్వహిస్తున్న మెయిన్ పరీక్షలో ఇక నుంచి రెండు పేపర్లే ఉంటాయి.
- కొత్త విధానం ప్రకారం-ప్రతి పేపర్‌కు 150 మార్కులు చొప్పున మొత్తం 300 మార్కులకు మెయిన్ నిర్వహిస్తారు. అంటే ఇకపై రెండు పేపర్లు పేపర్1, పేపర్2 మాత్రమే ఉంటాయి.
- మెయిన్ పేపర్-1లో 2 సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో ఆంధ్రప్రదేశ్ సామాజిక చరిత్ర, సాంస్కృతిక ఉద్యమాలు; రెండో సెక్షన్‌లో భారత రాజ్యాంగ సమీక్ష సబ్జెక్ట్‌లు ఉంటాయి.
- అదేవిధంగా పేపర్-2 మొదటి విభాగంలో..భారత, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ; రెండో విభాగంలో సైన్స్ అండ్ టెక్నాలజీ సబ్జెక్ట్‌లు ఉంటాయి.
- ఇలా రెండు పేపర్ల నేపథ్యంలో.. ఒక్కో పేపర్‌కు 150 మార్కులు చొప్పున మొత్తం 300 మార్కులకు మెయిన్ ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తారు.

మూడో పేపర్ తొలగింపు

గ్రూప్-2 మెయిన్ తాజా మార్పుల కోణంలో కీలకమైన అంశం.. ఇప్పటి వరకు ఉన్న మూడో పేపర్‌ను తొలగించడం. ఈ పేపర్‌లో ప్లానింగ్ ఇన్ ఇండియా, ఇండియన్ ఎకానమీ, సమకాలీన సమస్యలు, ఆంధ్రప్రదేశ్ ప్రాధాన్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వంటి అంశాలున్నాయి. ఈ పేపర్ పూర్తిగా అకడమిక్‌గా ఎకనామిక్స్ నేపథ్యం ఉన్న వారికి అనుకూలంగా ఉందని.. దీని వల్ల ఇతర నేపథ్యాల విద్యార్థులకు అవకాశాలు సన్నగిల్లుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమైంది. వీటిని పరిగణనలోకి తీసుకున్న ఏపీపీఎస్సీ నిపుణుల కమిటీ.. మూడో పేపర్ అవసరం లేదని పేర్కొంది. ఈ పేపర్‌ను తొలగించొచ్చని సిఫార్సు చేసింది. దీంతో ఈ మూడో పేపర్‌ను పూర్తిగా తొలగించారు. అయితే దీనికి బదులుగా కొత్తగా పేర్కొన్న పేపర్-2లో భారత్, ఏపీ ఆర్థిక వ్యవస్థలను చేర్చారు.

స్క్రీనింగ్ టెస్ట్.. యధాతథం

గ్రూప్-2 ఎంపిక ప్రక్రియలో తొలి దశగా పేర్కొనే స్క్రీనింగ్ టెస్ట్‌లో మాత్రం ఎలాంటి మార్పులు లేవు. ప్రస్తుతమున్న విధానంలో స్క్రీనింగ్ టెస్ట్ ఒక పేపర్‌గా జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ సబ్జెక్ట్‌లలో 150 మార్కులకు ఉంటుంది.

రెండుసార్లు చదవాల్సిన శ్రమ లేకుండా

- ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్ పరీక్షలో మార్పులు తీసుకోవడానికి ప్రధాన కారణం.. పలు అంశాలు.. తొలి దశ స్క్రీనింగ్ టెస్ట్‌తోపాటు, మెయిన్ ఎగ్జామ్‌లోనూ పునరావృతం అవుతుండడమే. అభ్యర్థులు కూడా ఆయా టాపిక్స్‌ను స్క్రీనింగ్ టెస్ట్‌కు, మెయిన్ ఎగ్జామ్‌కు రెండుసార్లు చదవాల్సి వస్తోంది. దీంతో సమయం సరిపోక ఇబ్బంది పడుతున్నారు.
- పాత విధానంలో స్క్రీనింగ్ టెస్ట్‌లో జనరల్ స్టడీస్ పేపర్.. మెయిన్ పరీక్షలోనూ ఉంది. సిలబస్ అంశాలు కూడా ఒకే విధంగా ఉన్నాయి.
- దీంతో అభ్యర్థులు జనరల్ స్టడీస్‌ను రెండుసార్లు అధ్యయనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల సమయం వృథా అవడమే కాకుండా.. అప్పటికే స్క్రీనింగ్ టెస్ట్‌లో ఈ అంశాలపై నిర్వహించిన పరీక్షలో విజయం సాధించిన వారికి.. రెండో దశలో మళ్లీ ఇవే టాపిక్స్ పరీక్ష అవసరం లేదనే ఉద్దేశంతో జనరల్ స్టడీస్‌ను తొలగించినట్లు తెలుస్తోంది.

సైన్స్ అండ్ టెక్నాలజీకి చోటు

- గ్రూప్-2 మెయిన్ ఎగ్జామినేషన్ మార్పుల్లో మరో ముఖ్యమైన అంశం.. రెండో పేపర్‌లో సెక్షన్-2గా సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాన్ని కొత్తగా చేర్చడం. ప్రస్తుత ఆధునిక సాంకేతిక పరిస్థితుల నేపథ్యంలో అభ్యర్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీపై అవగాహన తప్పనిసరిగా మారింది. దీంతో కొత్తగా ఈ అంశాన్ని చేర్చారు. ఇప్పటివరకు ఉన్న విధానంలో ఏ పేపర్‌లోనూ సైన్స్ అండ్ టెక్నాలజీ టాపిక్‌కు చోటు లేదు. తాజా నిర్ణయంతో అభ్యర్థులు ఇక సైన్స్ అండ్ టెక్నాలజీపైనా దృష్టి పెట్టాల్సి ఉంటుంది.
- మొత్తంగా చూస్తే.. గ్రూప్-2 పరీక్ష విధానంలో మార్పులు చేస్తూ ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభ్యర్థులపై ఒత్తిడిని తగ్గించడమే కాకుండా.. పరీక్షకు సన్నద్ధమయ్యే వారు తమ సమయాన్ని సమర్థంగా వినియోగించుకునే అవకాశం లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకే టాపిక్‌ను మరోసారి అధ్యయనం చేయాల్సిన అవసరం లేకుండా.. ఆ సమయాన్ని వేరే టాపిక్‌కు కేటాయించుకునే వెసులుబాటు కూడా కల్పిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

గ్రూప్-2 కొత్త ఎంపిక విధానం

- **మొదటి దశ స్క్రీనింగ్ టెస్ట్:** గ్రూప్-2లో మొదటి దశగా స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుంది. జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ అంశాలతో 150 మార్కులకు నిర్వహిస్తారు.
- **రెండో దశ మెయిన్ ఇలా:** స్క్రీనింగ్ టెస్ట్‌లో పొందిన మార్కులు, ప్రతిభ ఆధారంగా.. 1:50 నిష్పత్తిలో రెండో దశ మెయిన్‌క ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్ష రెండు పేపర్లుగా 300 మార్కులకే ఉంటుంది. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది.

పేపర్	సబ్జెక్ట్	మార్కులు
1	సెక్షన్-1: సోషల్ హిస్టరీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రదేశ్‌లోని సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలు) సెక్షన్-2: భారత రాజ్యాంగం సమీక్ష	150
2	సెక్షన్-1: భారత్, ఏపీ ఆర్థిక వ్యవస్థ సెక్షన్-2: సైన్స్ అండ్ టెక్నాలజీ	150
	మొత్తం	300

పట్టు సాధించడానికి మార్గాలివే

హిస్టరీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్ర, సంస్కృతికి సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి. ప్రాచీన చరిత్ర మొదలు ఆధునిక చరిత్ర వరకూ.. ముఖ్యమైన అంశాలపై అవగాహన పెంచుకోవాలి. జాతీయోద్యమంలో ఆంధ్రప్రదేశ్ పాత్ర గురించి అధ్యయనం చేయాలి. భారతదేశ చరిత్రకు సంబంధించిన అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా.. భారత జాతీయోద్యమంపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. ఆంధ్ర ప్రాంత ఉద్యమాలకు సంబంధించి ఆంధ్ర జనసంఘం, ఆంధ్రమహాసభల్లో కీలక పాత్ర పోషించిన వ్యక్తుల గురించి తెలుసుకోవాలి. వారి ఆధ్వర్యంలో జరిగిన సభలు, సమావేశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. విశాలాంధ్ర ఉద్యమానికి సంబంధించి పెద్దమనుషుల ఒప్పందంలోని కీలక అంశాలు తెలుసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ప్రాచీన చరిత్రకు సంబంధించి శాతవాహనుల కాలం నుంచి తూర్పు చాళుక్యుల వరకు.. అన్ని రాజ వంశాల కాలంలో ముఖ్య ఘట్టాలు, కళలు, సాహిత్యాభివృద్ధికి చేసిన కృషి, ముఖ్యమైన నిర్మాణాలు-వాటి విశిష్టత (ఉదా: బౌద్ధ స్థూపాలు) గురించి పూర్తిగా అవగాహన పెంచుకోవాలి.

పాలిటీ: గ్రూప్-2 మెయిన్ పేపర్-2లో సెక్షన్-2గా పేర్కొన్న భారత రాజ్యాంగ సమీక్ష విషయంలో పాలిటీపై పట్టు సాధించాలి.భారత రాజ్యాంగం ముఖ్య లక్షణాలు; ప్రవేశిక; ప్రాథమిక విధులు; ప్రాథమిక హక్కులు; ఆదేశిక సూత్రాలు; భారత సమాఖ్య; విశిష్ట లక్షణాలు; కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల విభజన; శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ పాత్రలపై నిర్దేశిత సిలబస్ ప్రకారం-లోతుగా అధ్యయనం చేయాలి. పంచాయతీరాజ్ వ్యవస్థ; 73,74 రాజ్యాంగ సవరణలు; వాటి ప్రాముఖ్యత; తేదీలు వంటి వాటిపై దృష్టి సారించాలి. కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన, కార్యనిర్వాహక విధుల విభజన, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు గురించి రాజ్యాంగంలో పేర్కొన్న అధికరణలను అధ్యయనం చేయాలి. కేంద్ర-రాష్ట్ర సంబంధాల విషయంలో అవసరమైన సంస్కరణలు, ఆయా కమిషన్ల సిఫార్సులు(ఉదా: రాజ్‌మన్నార్ కమిటీ, సర్కారియా కమిషన్ తదితర)అధ్యయనం చేయాలి.ఆయా రాజ్యాంగ పదవులు(రాష్ట్రపతి,గవర్నర్), నియామకం తీరుతెన్నులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తాజాగా రాజ్యాంగ సవరణల ద్వారా రూపొందిన కొత్త చట్టాలపై అవగాహన మేలు చేస్తుంది.

భారత్, ఏపీ ఆర్థిక వ్యవస్థ

గ్రూప్-2 మెయిన్ పేపర్-2లో సెక్షన్-1గా ఉన్న ఈ అంశానికి సంబంధించి భారత్‌లో పంచవర్ష ప్రణాళికల నుంచి ప్రారంభించి తాజా ఆర్థిక పరిణామాల వరకు.. అన్ని అంశాలను అధ్యయనం చేయాలి. 1956 నుంచి అమలు చేసిన పారిశ్రామిక విధానాలు, ఆర్‌బీఐ ఏర్పాటు, నూతన విదేశీ వాణిజ్య విధానం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల గురించి తెలుసుకోవాలి దేశంలో సహజ వనరుల లభ్యత, ఆర్థికాభివృద్ధి దిశగా అవి దోహదపడుతున్న తీరుపై అధ్యయనం చేయాలి. కోర్ ఎకానమీకి సంబంధించి ద్రవ్యం, బ్యాంకింగ్, పబ్లిక్ ఫైనాన్స్‌ల నిర్వచనాలు-సిద్ధాంతాలు తెలుసుకోవాలి. అదే విధంగా జాతీయాదాయ భావనలు, జీడీపీ, తలసరి ఆదాయం వంటి బేసిక్ కాన్సెప్ట్‌లపై పరిపూర్ణ అవగాహన అవసరం. వీటికితోడు ఆర్థిక రంగంలో తాజా పరిణామాల గురించి కూడా చదవాలి. ఆర్థిక సంఘం సిఫార్సులు, తాజా బడ్జెట్ గణాంకాలు వంటి వాటిపై అవగాహన పొందాలి.

ఆంధ్రప్రదేశ్ ఎకానమీకి సంబంధించి సహజ వనరుల లభ్యత మొదలు సామాజిక ఆర్థిక సంక్షేమ పథకాల వరకూ..అన్నింటినీ అధ్యయనం చేయాలి. ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలోని ముఖ్యమైన వనరులు, అవి లభించే ప్రాంతాలు, పంటలు-దిగుబడి కారకాల గురించి తెలుసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో పంచవర్ష ప్రణాళికల అమలు తీరుతెన్నులపై అధ్యయనం చేయాలి. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు, బడ్జెట్ కేటాయింపులపై అవగాహన ఏర్పరచుకోవాలి.

సైన్స్ అండ్ టెక్నాలజీ

గ్రూప్-2 మెయిన్స్‌లో పేపర్2లో కొత్తగా చేర్చిన టాపిక్.. సైన్స్ అండ్ టెక్నాలజీ. దీనిపై పట్టు సాధించడం కోసం అభ్యర్థులు భారత అభివృద్ధిలో సైన్స్ అండ్ టెక్నాలజీ పాత్ర; మోడ్రన్ ట్రెండ్స్ ఇన్ లైఫ్ సైన్సెస్; అభివృద్ధి, వాతావరణ సమస్యలపై అవగాహన పెంచుకోవాలి. కోర్ సైన్స్ అంశాలపైనా పట్టు సాధించాలి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయలాజికల్ సైన్సెస్‌లో ఆయా అంశాలకు సంబంధించి ప్రాథమిక భావనలు, వాటి అనువర్తనాలు, ప్రమాణాల గురించి తెలుసుకోవాలి. దేశ శాస్త్ర సాంకేతిత రంగంలో తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.ఇస్రో ప్రయోగాలు, డీఆర్‌డీఓ,క్షిపణి వ్యవస్థ, ఆయుధ వ్యవస్థల గురించి తెలుసుకోవాలి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.